
రష్యా విప్లవం
భారత స్వాతంత్ర్య సంగ్రామం
రూ॥160/- పేజీలు:195

నవచేతన పబ్లిషింగ్ హౌస్
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★★

జస్టిస్ ఘోష్ కమిషన్ రిపోర్టుపై చర్యలేమిటి?
రాష్ట్రాన్ని వివరణ కోరిన హైకోర్టు

మున్సిపల్ ఎన్నికలెప్పుడు?
ప్రభుత్వ వివరణ ఇవ్వాలన్న హైకోర్టు

03

సంపుటి 08, సంచిక: 272 | మంగళవారం | 2-09-2025 | ఖమ్మం | Published from: Khammam, Hyderabad, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

## ‘కాళేశ్వరం అవినీతి’పై సిబిఐ విచారణ

- శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానం
- అక్రమాలను నిగ్గుతేల్చేందుకు కేసును కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించడమే సముచితమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

జస్టిస్ పి.సి ఘోష్ కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా ‘కాళేశ్వరం ప్రాజెక్టు’ అవినీతిపైన దర్యాప్తును సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్‌కు (సిబిఐ) అప్పగించాలని శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఈ ప్రాజెక్టులో అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన వివిధ శాఖలు, ఏజెన్సీలు పాలు పంచుకున్నాయని, ప్రాజెక్టు డిజైన్,నిర్మాణం,ఫైనాన్సింగ్‌లో వ్యాప్‌కోస్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు,పిఎఫ్‌సి, ఆర్ఇసి వంటి ఆర్థిక సంస్థలు పాలుపంచుకున్నా యని, అందుకే ఈ కేసును సిబిఐకి అప్పగించడమే తరువాయి 2లో

## వరద నష్టంపై సమగ్ర నివేదిక

- వెంటనే సిద్ధం చేయండి
- వర్షాలతో దెబ్బతిన్న పనులను వేగవంతం చేయండి
- వరదలపై సమీక్షించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- 82మండలాల్లో 2.36లక్షల ఎకరాల్లో పంట నష్టం



ప్రజాపక్షం/హైదరాబాద్

భారీ వర్షాలు, వరదలతో దెబ్బతిన్న రోడ్లు, భవనాలు, చెరువులు, కుంటల మరమ్మతు పనులతో పాటు విద్యుత్ సబ్‌స్టేషన్‌ల పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వరదలపై సోమవారం సచివాలయంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో వరదలతో వాటిల్లిన నష్టంపై అన్ని శాఖల నుంచి సమగ్ర నివేదికలు వెంటనే సిద్ధం చేయాలని సిఎం అధికారులను ఆదేశించారు. ఈ నెల 4వ తేదీన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క నేతృత్వంలోని బృందం ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిసి ఈ నివేదికలను అందజేస్తుందని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్ర విపత్తు ఉపశమన నిధులు (ఎస్‌డిఆర్‌ఎఫ్) నిధులున్నా నిబంధనల ప్రకారం వాటిని వ్యయం చేయడంలో అలసత్వం చూపడంపై ముఖ్యమంత్రి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లినా కేంద్రం నుంచి సరైన సహాయం తరువాయి 2లో

## ఓట్లు తొలగించే అధికారం ఎవరికీ లేదు?

మీట్ ది ప్రెస్‌లోజస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి





## అత్యంత ప్రమాదంలో ఎన్నికల ప్రక్రియ

- దేశంలో వలసపాలన బానిసత్వం నుంచి విముక్తికి గుర్తింపు ఓటు హక్కు
- దానిని పరిహాసం చేస్తుంటే చూస్తూ ఉండలేకపోతున్నాం

ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి



జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిని కలిసిన వామపక్షనేతలు

- హైదరాబాద్‌లో విపక్షపార్టీ ఎంపిలు, పలువురు నేతలతో భేటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

దేశంలోనే అత్యున్నత రాజ్యాంగ వ్యవస్థ ఎన్నికల సంఘం నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియ నేడు దేశంలో అత్యంత ప్రమాదంలో పడనున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయని ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్న జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. దేశంలో వలస పాలన బానిసత్వం నుంచి విముక్తికి గుర్తింపు ఓటు హక్కు అని, అంత విలువైన ఓటు హక్కును కేంద్ర పాలకులు తమ ఇష్టానుసారంగా పరిహాసం చేస్తుంటే గత 53 ఏళ్లుగా రాజ్యాంగాన్ని నమ్మి ఆచరిస్తున్న వ్యక్తిగా చూస్తూ ఉండలేకే ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా పోటీ చేస్తున్నానని జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ప్రతిపక్ష పార్టీల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి ఎంపిలతో సోమవారం హైదరాబాద్‌లో సమావేశమయ్యారు. టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి నాజర్ హుస్సేన్, ఎంపి మల్లు రవి, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, టిజెసి అధ్యక్షులు ప్రొఫెసర్ ఎం. కోదండరామ్‌తో పాటు కాంగ్రెస్ ఎంపిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలోని ప్రజలందరూ 1947లో ముందుగా ఓటర్లుగా గుర్తింపు పొందిన తర్వాతే దేశ పౌరులుగా గుర్తించబడ్డారన్నారు. ఆలాంటి ఓటు హక్కును చిత్తు కాగితంగా భావిస్తూ చించేస్తాం, తొలగిస్తామంటే ఎలా సాధ్యమవుతుందని తరువాయి 12లో

## పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులు ఆమోదించండి

గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు కాంగ్రెస్, సిపిఐ, బిఆర్‌ఎస్ ప్రజాప్రతినిధుల బృందం విజ్ఞప్తి



ప్రజాపక్షం/హైదరాబాద్

బిసిల రిజర్వేషన్లకు మార్గం సుగమం చేసే తెలంగాణ పంచాయతీ రాజ్, మున్సిపల్ చట్టం సవరణ బిల్లులను ఆమోదించాలని కాంగ్రెస్, బిఆర్‌ఎస్, సిపిఐ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధుల బృందం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను విజ్ఞప్తి చేశారు.బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచేందుకు అడ్డంకిగా మారిన 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఉన్న పంచాయతీ, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులను ఆమోదించి, బిసిలకు న్యాయం చేయాలని వారు గవర్నర్‌ను కోరారు. బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి అనసూయ సీతక్క, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేష్‌కుమార్‌గౌడ్, సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం,బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే కె.పి.వివేకానంద ప్రతినిధి బృందం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను సోమవారం కలిశారు. ఈ సందర్భంగా వారు శాసనసభలో ఆమోదించిన మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లు అంశాన్ని గవర్నర్ దృష్టికి తీసుకొచ్చారు. స్థానిక సంస్థలల్లో ఉన్న 50 శాతం రిజర్వేషన్ల నిబంధన ఎత్తివేస్తూ శాసన సభలో ప్రవేశపెట్టిన పంచాయతీరాజ్,మున్సిపల్ సవరణ బిల్లు ఏకగ్రీవ ఆమోదంపొందిందని, మూడ్ ఆఫ్ హౌజ్ పరిగణనలోకి తీసుకుని బిసిల రిజర్వేషన్ల తరువాయి 12లో

## హైడ్రోజన్ బాంబు పేలుస్తా...



- ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు
- ‘గాంధీ సే అంబేద్కర్’ మార్చ్ అడ్డగింత
- డాక్ బంగ్లా క్రాసింగ్ వద్దే బైఠాయింపు

**పాట్నా :** ఓట్ల చోరీకి సంబంధించి తాము ఇప్పటికే అణుబాంబు పేల్చామని, త్వరలోనే మరింత శక్తిమంతమైన హైడ్రోజన్ బాంబు పేలుస్తామని ఓటర్ అధికార్ యాత్ర ముగింపు సందర్భంగా రాహుల్‌గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటారని చెప్పారు. బిహార్‌లో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేపట్టిన ‘ఓటు అధికార్ యాత్ర’ ముగింపు సందర్భంగా సోమవారం పాట్నాలో ‘గాంధీ సే అంబేద్కర్’ మార్చ్‌ను నిర్వహించారు. అయితే ఈ పాదయాత్రను పోలీసులు మధ్యలోనే అడ్డుకున్నారు. భారతీయ కూటమి నాయకులు మహాత్మా గాంధీ విగ్రహం వద్ద పుష్పగుచ్ఛాలుంచి నివాళి అర్పించి పాదయాత్రను ప్రారంభించారు. ఈ యాత్ర ఎస్ పి వర్మ రోడ్, ఎగ్జిబిషన్ రోడ్, డాక్ బంగ్లా క్రాసింగ్ గుండా సాగింది. యాత్రలో రాహుల్ గాంధీతో పాటు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ఆర్‌జెడి నేత తేజస్వీ యాదవ్, వికాస్ షీల్ ఇన్సాన్ పార్టీ చీఫ్ ముకేష్ సహానీ, సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, పార్టీ జాతీయ కార్యదర్శి అన్నీరా జా, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ, సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ప్రధాన కార్యద ర్శి దీపాంకర్ భట్టాచార్య, టిఎంసి ఎంపి యూ సుఫ్ పఠాన్, శివసేన (యుబిటి) నేత సంజయ్ రౌత్, ఇతర ఇండియా కూటమి నాయకులు పాల్గొన్నారు. కాగా, ‘గాంధీ సే అంబేద్కర్’ పా దయాత్రను డా క్ బంగ్లా క్రాసింగ్ వద్ద అడ్డుకున్నట్లు ఎస్‌ఎస్‌పి కార్తికేయ శర్మ తరువాయి 2లో



## బిజెపి అక్రమాలను సహించం

సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా

ప్రజాస్వామ్యాన్ని దొంగిలించడానికి బిజెపి అవకతవకలను సిపిఐ, ఇండియా మహాఘట్బంధన్ అనుమతించవని, ప్రతి పౌరుడు తమ ఓటు వేస్తారని, ప్రజల ఐక్య బలం మోసపూరిత పాలనను ఓడిస్తుందని సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి. రాజా అన్నారు. ఓట్ అధికార్ యాత్ర ముగింపులో రాజాతో పాటు సిపిఐ జాతీయ కార్యదర్శి అన్నీ రాజా, సిపిఐ బిహార్ కార్యదర్శి రాంనరేష్ పాండే, పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు. అయితే చరిత్రాత్మక ఓటర్ అధికారి యాత్ర ముగింపు కోసం ప్రధాన కార్యదర్శి డి.రాజా నేతృత్వంలో వేలాది మంది సిపిఐ శ్రేణులు పాట్నాలోని గాంధీ మైదాన్ వైపు ర్యాలీగా కదిలారు. ‘ఓట్ చోర్, గద్దీ చోడ్’ అంటూ దిక్కులు తరువాయి 2లో



## భూకంప విలయం

అఫ్గానిస్థాన్‌లో 6.2 తీవ్రతతో భూప్రకంపనలు

**812 మంది మృతి**

**2,500 మందికి గాయాలు**

కునార్ రాష్ట్రంలో వందల ఇళ్ళు నేలమట్టం

మూసుకుపోయిన దార్లు,హెలికాప్టర్లే దిక్కు



**కాబూల్:** తూర్పు అఫ్గానిస్థాన్ కునార్,లాఘ్‌మన్ రాష్ట్రాలలో భూ ప్రళయం సంభవించింది. భూమి తీవ్రంగా కంపించడంతో ఇళ్ళు నేలమట్టమై 812 మంది పైగా ప్రజలు మరణించారు. మరో 2,500 మంది గాయపడ్డారు. మృతులు,గాయపడినవారం సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉంది. అనేకమంది శిథిలాల్లో చిక్కుకున్నారు. ఈ భూకంపం రిచ్‌టర్ స్కేలుపై 6.2 తీవ్రతతో నమోదైనట్లు తాలిబన్ హోంమంత్రిత్వశాఖ ప్రకటించింది. భూకంపం వచ్చాక తిరిగి తెల్లారేవరకూ మరో 13 సార్లు భూ ప్రకంపనలు సంభవించాయి. దీనివల్ల కాబూల్ నుండి ఇస్లామాబాద్ వరకూ ప్రకంపనలు విస్తరించాయి. తమ పిల్లలు,ఆత్మీయులను శిథిలాలనుండి బయటకు తీసేందుకు సహాయం లభించడంలేదని సజీవులు రోదిస్తున్నారు. ఐతే గాయపడినవారిని ఆసుపత్రులకు తరలించేందుకు తాలిబన్ ప్రభుత్వం హెలికాప్టర్‌లను రంగంలోకి దించింది. కానీ ఎక్కడో మారుమూల ఉన్న గ్రామాలకు చేరుకోవడం సహాయబృందాలకు కష్టంగా మారింది. ఈ ప్రాంతాలో ఇప్పటికే గడచిన కొద్దిరోజులుగా తీవ్రమైన వరదలు బీభత్సం సృష్టించగా, కొండచరియలు విరిగిపడి రహదారులపై తీవ్ర ఆటంకాలు ఏర్పడ్డాయి. సహాయ కార్యక్రమాలు నిర్వహించడానికి హెలికాప్టర్ ఒక్కటే ఏకైక మార్గంగా ఉంది. సరైన మార్గాలు లేకపోవడంతో మరణాల సంఖ్య, ఉద్ధృతి వివరాలు తెలిసేందుకు జాప్యం జరుగుతోంది. కునార్ రాష్ట్రంలో ఎక్కువ నష్టం జరిగింది. ప్రధానంగా మూడు గ్రామాలు తీవ్రం గా నష్టపోయాయి. కొన్ని గ్రామాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కునార్ రాష్ట్రంలోని నూర్గల్, సోకీ, వాట్పూర్, మనోగీ, ఛాపదార్ తదితర జిల్లాలలో వందలాది ఇళ్ళు నేలమట్టమయ్యాయి. నాన్‌గర్హర్ రాష్ట్రం జలాలాబాద్‌కు ఈశాన్యంగా 27 కి.మీ దూరంలో భూకంప కేంద్రం ఉందని అమెరికా భూగర్భశాస్త్రాల పరిశోధనాకేంద్రం గుర్తించింది. కునార్ రాష్ట్రం పాకిస్థాన్ తరువాయి 2లో

## హరీశ్‌రావు, సంతోష్ వల్లే కెసిఆర్‌కు అవినీతి మరక



- కాళేశ్వరం అవినీతిలో హరీశ్ పాత్ర లేదా.?
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కీలక వ్యాఖ్యలు

ప్రజాపక్షం/హైదరాబాద్


కెసిఆర్‌కు అవినీతి మరక అంటించడంలో మాజీ మంత్రి హరీష్ రావు, సంతోష్‌రావు, మెగా కృష్ణారెడ్డి పాత్ర ఉన్నదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. అవినీతి అనకొండలు కెసిఆర్‌ను అప్రతిష్టపాలు తరువాయి 12లో

## ఉగ్రవాదాన్ని అణచివేస్తాం

- ఎస్‌సిఒ సభ్యదేశాల ప్రతిన
- పహల్గాం ఉగ్రదాడికి ఖండన



**టియాంజిన్:** జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఏప్రిల్ 22న జరిగిన ఉగ్రవాద దాడిని సోమవారం షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) సభ్యదేశాలు తీవ్రంగా ఖండించాయి. అయితే పాకిస్థాన్ ఉగ్రవాద సంస్థలకు స్వర్గధామంగా ఉందని భారత దేశం చాలా కాలంగా చెబుతున్నప్పటికీ ఉమ్మడి ప్రకటనలో పాకిస్థాన్ పేరు ప్రస్తావించకపోవడం గమనార్హం. చైనాలోని టియాంజిన్‌లో జరిగిన శిఖరాగ్ర సమావేశం ముగిసిన తర్వాత వెలువడిన సంయుక్త ప్రకటనలో, చైనా, టర్కీతో సహా సభ్య దేశాలు దాడిలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి, సంతాపం వ్యక్తం చేశాయి. అటువంటి చర్యలకు పాల్పడినవారు, చేయించినవారు, సాయం చేసినవారిని చట్టం ముందు నిలబెట్టి శిక్షించాలని నొక్కిచెప్పాయి. ఏరూపంలో ఉన్నప్పటికీ ఉగ్రవా దం, వేర్పాటు వాదం, తీవ్రవాదంపై ఉమ్మడి పోరాటాన్ని కొనసాగించాలని ప్రతిన బూనాయి. అటువంటి బెదిరింపులను ఎదుర్కోవడంలో సా ర్వభౌమ ప్రభుత్వాలు , వాటి సంస్థలు ప్రాథమిక బాధ్యతను కలిగి ఉన్నాయని సభ్య దేశాలు పునరుద్ఘాటించాయి. ఉగ్రవాద, వేర్పాటువాద , తీవ్రవాద గ్రూపులను కిరాయి ప్రయోజనాల కోసం ఉపయోగించుకునే ప్రయత్నాలు ఆమోదయోగ్యం కాదని సభ్య దేశాలు స్పష్టం చేశాయి. వీటిని అణచివేసేందుకు సభ్య దేశాలు చేస్తున్న ప్రయత్నాలను గుర్తిస్తున్నామని వెల్లడించాయి. పాకిస్థాన్ జరిగిన ఉగ్రవాద దాడులను కూడా ఎస్‌సిఒ సభ్య దేశాలు ఖండించాయి. వాటిలో మే 21న జరిగిన జాఫర్ ఎక్స్‌ప్రెస్ బాంబు దాడి, ఖుజ్‌దార్ దాడి కూడా ఉన్నాయి. ఇక ఉగ్రవాదాన్ని అణచివేస్తామని ప్రతినబూనిన సభ్య దేశాలు... గాజాలో ఇజ్రాయిల్ చేపడుతున్న సైనిక చర్యను ఖండించాయి. గ్లోబల్ కౌంటర్‌టెర్రరిజం స్ట్రాటజీని పూర్తిగా అమలు చేయడంలో ఐక్యరాజ్యసమితి ముఖ్య పాత్ర పోషిస్తుందని ఎస్‌సిఒ పేర్కొంది. ఉగ్రవాద గ్రూపులను తరువాయి 2లో

చలో చండీఘడ్


భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
25వ కాంగ్రెస్
21-25 సెప్టెంబర్, 2025
చండీఘడ్ (పంజాబ్)

(సిపిఐ ఆరంభకాలం విశేషాలు 6వ పేజీలో)

## ‘స్థానికత’ తప్పక ఉండాల్సిందే

వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు తెలంగాణ సర్కారు విధించిన నివాస నిబంధనలను సమర్థించిన ‘సుప్రీం’

**న్యూఢిల్లీ :** రాష్ట్ర కోటా కింద వైద్య కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలకు తెలంగాణ నివాస నిబంధనల (స్థానికత)ను సోమవారం సుప్రీంకోర్టు సమర్థించింది.గత నాలుగు సంవత్సరాలుగా రాష్ట్రంలో 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులు రాష్ట్ర కోటా కింద మెడికల్ కాలేజీలు, దంత కళాశాలల్లో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

గాజా జర్నలిస్టులకు 70దేశాల్లో

## 250 మీడియా సంస్థల మద్దతు



**జెరూసలెం:** గాజాలో జర్నలిస్టులపై ఇజ్రాయెల్ చేస్తున్న ఉద్దేశపూర్వక దాడులు,హత్యలకు నిరసన తెలియజేస్తూ 70 దేశాలకు చెందిన 250 మీడియా సంస్థలు తమ తమ వెబ్‌సైట్ పత్రికలద్వారా ఫ్రంట్‌పేజీలలో ఒకే సారి నిరసన తెలియజేశాయి. ఇజ్రాయెల్ అకృత్యాలను మూకుమ్మడిగా ఖండించాయి. ఒక్క ఆగస్టు నెలలోనే దాదాపు 11 మంది జర్నలిస్టులు ఐడిఎఫ్ గగనతల దాడుల ద్వారా మరణించారు. గాజాలో జర్నలిస్టులకు ఈ 250 మీడియా సంస్థలూ పూర్తి సంఘీభావం ప్రకటించాయి. రిపోర్టర్స్ వితౌత్ బోర్డర్స్ ఫ్రీడమ్ గ్రూపు జర్నలిస్టుల సంస్థ సోమవారం ఈ విషయం ప్రకటించింది. జర్నలిస్టులందరినీ ఇలా చంపుకుని తింటే ఇక మీ ఉనికి గురించి కూడా ప్రపంచానికి చెప్పడానికి ఎవ్వరూ ఉండరని ఆ గ్రూపు డైరెక్టర్ తిబావుట్ బ్రుట్టిన్ ఒక ప్రకటనలో హెచ్చరించారు.

హౌతీల నిర్బంధంలో..

# 11 మంది ఐక్యరాజ్యసమితి సిబ్బంది



**సనా:** యెమెన్‌రాజధాని సనాలో హౌతీ తిరుగుబాటు ఉగ్రవాదులు ఐక్యరాజ్యసమితి కార్యాలయాలపై దాడులు చేసి 11 మంది సిబ్బందిని నిర్బంధించి తీసుకుపోయారు. తమ ప్రధానమంత్రి అల్–రహవీ సహా పలువురు మంత్రులను ఇజ్రాయెల్ దాడిచేసి చంపిన తర్వాత హౌతీ ప్రభుత్వ అధికారులు తమ పాలనాపరిధిలో ఉన్న ప్రాంతాలలో దాడులు చేసి అనేకమందిని అరెస్టు చేశారు. ఇందులోభాగంగా ఐక్యరాజ్యసమితి కార్యాలయాలపై కూడా దాడులు చేసి సిబ్బందిని తీసుకుపోయారు. ఈ దాడులపై హౌతీ ప్రభుత్వ అధికారులు ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. యెమెన్‌లోని ఐక్యరాజ్యసమితి దౌత్యవేత్త హాన్స్ గ్రండ్‌బెర్గ్ ఒక ప్రకటనలో తమ సిబ్బంది నిర్బంధాన్ని తీవ్రంగా ఖండించారు. సనా,హొడైడాలలో ఉన్న ఐక్యరాజ్యసమితి కార్యాలయాలలోకి బలప్రయోగంతో దూసకువచ్చి ఆస్తులు స్వాధీనం చేసుకున్నారని, సిబ్బందిని నిర్బంధంలోకి తీసుకున్నారని చెప్పారు. బేషరతుగా తక్షణం వారిని విడుదల చేయాలని హాన్స్ గ్రండ్‌బెర్గ్ డిమాండ్ చేశారు. వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు చెందిన ఏడుగురు సిబ్బందిని, యూనిసెఫ్‌కు చెందిన నలుగురు సిబ్బందిని హౌతీలు నిర్బంధించి తీసుకుపోయినట్లు భద్రతాసిబ్బంది చెప్పారు.

### ప్రధాని రహవీ, మంత్రులకు అంత్యక్రియలు

సనాలో హౌతీల తిరుగుబాటు ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం చేసిన దాడుల్లో మరణించిన హౌతీ ప్రధానమంత్రి అహ్మద్ అల్–రహవీతోపాటు పలువురు మంత్రులకు సోమవారం యెమెన్‌లో అంత్యక్రియలు జరిగాయి. వందలాదిమంది ప్రజలు సంతాపం ప్రకటించారు. గడచిన గురువారం ఐడిఎఫ్ దాడుల్లో హౌతీ ఉప–ప్రధానమంత్రి జలాల్ అల్ రోవైషాన్, విదేశాంగమంత్రి జమాల్ అమెర్, సమాచారమంత్రి హషిమ్ షరఫ్ అల్‌దిన్, స్థానిక ప్రభుత్వ మంత్రి అల్ మదానీ, ఆర్థికమంత్రి మునిన్ అల్ మహ్రి, న్యాయమంత్రి ముజాహిద్‌అహ్మద్ సహా రవాణామంత్రి, కార్మిక,విద్యా,కీడ్రాశాఖలమంత్రులు మొత్తం 10 మంది దాడుల్లో మరణించారు. వారి అంత్యక్రియల సందర్భంగా ప్రజలు షాబ్ మసీదువద్ద గుమిగూడి ప్రార్థనలు చేశారు. హౌతీ అధికారులు ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఇజ్రాయెల్‌పై ప్రతీకారం తీర్చుకుంటామని ప్రతిజ్ఞ చేశారు. అల్–రహవీ గత ఏడాది ఆగస్టు పదో తేదీన తిరుగుబాటుదారుల ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఏడాదికాలంగా కొనసాగిస్తున్న కార్యకలాపాలపై సమీక్షా కార్యక్రమంగా నిర్వహించిన సమావేశంలో రహవీ పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ సైన్యం గురిచూసి క్షిపణి దాడి చేసింది. దక్షిణ సనాలోని పురాతనకాల గ్రామం బెయిట్ బావ్స్‌లోని ఒక విల్లాలో సమావేశం జరుగుతుండగా ఐడిఎఫ్ దాడులకు పాల్పడింది. ఈనెల 21న హౌతీ ఉగ్రవాదులు ఇజ్రాయెల్‌పై రెండేళ్ళ తర్వాత క్లస్టర్ బాంబులు ప్రయోగించారు. తర్వాత 24న, 28న ఐడిఎఫ్ వరుస దాడులు చేసింది.

## ఆక్రమిత కశ్మీరులో నేలకూలిన పాకిస్థాన్ హెలికాప్టర్

### ఐదుగురు సైనికులు మృతి

**ఇస్లామాబాద్:** ఆక్రమిత కశ్మీరు భూభాగం గిల్గిత్–బాల్టిస్థాన్ ప్రాంతం దయామర్‌జిల్లా ఛిలాస్ టౌన్‌లో పాకిస్థాన్ మిగ్–17 హెలికాప్టర్ కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంలో ఐదుగురు సైనికులు మరణించారు. వీరిలో ఇద్దరు అధికారులున్నారని సైన్యం ఒక ప్రకటనలో తెలిపింది. థక్‌దాస్ కంటోన్మెంట్ ప్రాంతానికి 12 కి.మీ దూరంలో ఉన్న హుదోర్ గ్రామ సమీపంలో ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఒంటిగంట ప్రాంతంలో హెలికాప్టర్‌లో సాంకేతికలోపం తలెత్తడంతో నేలకూలిపోయింది. పైలట్ ఇన్ కమాండ్ మేజర్ అతిఫ్, కో–పైలట్ మేజర్ ఫైజల్, ఫ్లైయిట్ ఇంజనీరు నాయబ్ సుబేదార్ మఖ్బూల్, హవాల్దార్ జహంగీర్, క్రూ చీఫ్ నాయక్ అమిర్ మరణించినవారిలో ఉన్నారు. రోజువారీ శిక్షణా కార్యక్రమంలో భాగంగా నేలమీదకు దిగే ప్రయత్నం చేస్తుండగా హెలికాప్టర్ కూలిపోయింది. దయామర్ పోలీసులు, సహాయ బృందాలు ఆ ప్రాంతానికి వెళ్ళాయి. ఆగస్టు నెలారంభంలో కూడా వరద సహాయచర్యల్లో భాగంగా ఆహారాన్ని తరలిస్తున్న హెలికాప్టర్ కూలిపోవడంతో ఐదుగురు మరణించారు. అంతకుముందు 2024లో ఉత్తర వజిరిస్థాన్‌లోని షెవా చమురుక్షేత్రంలో ఉన్న ఒక పెట్రోలియం కంపెనీ హెలికాప్టర్ కూలిపోవడంతో ఆరుగురు మరణించారు.

## ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు టర్కీ కృషి

### పుతిన్‌కు చెప్పిన ఎర్డొగాన్



**అంకారా:** ఉక్రేన్‌లో యుద్ధ నివారణకు టర్కీ కృషి చేస్తుందని ఆ దేశ అధ్యక్షుడు రెసిప్ తయ్యాప్ ఎర్డొగాన్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పారు. ఇస్తాంబుల్ నగరంలో జరుగుతున్న చర్చల్లో టర్కీ ప్రతినిధులు ఉక్రేన్‌లో శాశ్వత శాంతి సాధనకు కృషి చేస్తున్నారని చెప్పారు. ఉక్రేన్ సమస్యకు న్యాయబద్ధమైన పరిష్కారం సాధించి, శాశ్వత శాంతి సాధనకు తమవంతు ప్రయత్నాలు చేస్తామన్నారు. ఉత్తర చైనా తియాన్‌జిన్‌లో షాంఘై సహకారసంస్థ (ఎస్‌సిఓ) సదస్సులో పాల్గొన్న ఎర్డొగాన్ రష్యా నేత పుతిన్‌తో సమావేశమయ్యారు. రెండు రోజుల ఎస్‌సిఓ సదస్సు సోమ వారం రాత్రి ముగిసింది. రష్యా–టర్కీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, అజర్‌బైజాన్, ఆర్మేనియాలో శాంతి ప్రయత్నాలు, గాజాలో పరిస్థితులతోపాటు సిరియాలో పరిస్థితులు, ఉక్రేన్‌లో శాంతి యత్నాల గురించి కూడా ఎర్డొగాన్–పుతిన్ మధ్య చర్చల్లో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి. టర్కీ అధ్యక్షభవనం రాజధాని అంకారాలో ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. ఇజ్రాయెల్ యుద్ధ దాడులలో గడచిన 23 నెలలుగా 220 మంది జర్నలిస్టులు మరణించారు.

సామూహిక హత్యాకాండకు

## ఆచరణాత్మక నిర్వచనమిచ్చిన ఇజ్రాయెల్

**వెనిస్:** సామూహిక హత్యాకాండ అనే పదానికి ఇజ్రాయెల్, దాని సైన్యం గాజాలో ఆచరణాత్మక నిర్వచనం ఇస్తున్నాయని అంతర్జాతీయ చట్టాల నిపుణులు ప్రకటించారు. 1948లో ఐక్యరాజ్యసమితి 'జెనోసైడ్' నియంత్రణ, నిర్మూలన కోసం ఈ పదానికి ఒక నిర్వచనం ఇచ్చింది. ఈ నిర్వచనాన్ని ఇజ్రాయెల్ సైన్యం ఆచరణాత్మక రూపాన్ని ఇచ్చిందని, సామూహిక హత్యాకాండ అంటే ఎంత అమానవీయంగా, ఎంత దారుణంగా, కిరాతకంగా ఉంటుందో కళ్ళకు కట్టినట్టుగా చూపించిందని 500 మంది సభ్యులతో కూడిన ఐఎజిఎస్ స్కాలర్లు ప్రకటించారు. 'జెనోసైడ్' అనే పదానికి ఆచరణాత్మక నిర్వచనాన్ని ఇచ్చిన ఇజ్రాయెల్ అకృత్యాలను పేర్కొంటూ ఈ మేరకు వారుఒక తీర్మానం చేశారు. ఐఎజిఎస్ అనేది 1994లో ఆవిర్భవించింది. ఆనాడు ప్రపంచ మేధావులతో ఇంటర్నేషనల్ జెనోసైడ్ స్కాలర్స్ (ఐఎజిఎస్) పేరుతో ఒక విద్యావేత్తల పీఠం ఏర్పడింది. జెనోసైడ్‌ను నిర్వచించేందుకు, దాని దుర్మార్గాలను అరికట్టేంకు విద్యావేత్తలు దీనిని ఏర్పాటు చేశారు. ఇటలీ నగరం వియన్నాలో ఆగస్టు 30వ తేదీన ఈ విద్యావేత్తల సమావేశంలో 'జెనోసైడ్' నిర్వచనంపై ఇజ్రాయెల్‌ను ఉటంకిస్తూ ఒక తీర్మానం చేశారు. పశ్చిమ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయంలో ఇంటర్నేషనల్ లా ప్రొఫెసర్, ఐఎజిఎస్ అధ్యక్షురాలు మెలానీ ఓ బ్రియానీ రాయిటర్స్ వార్తాసంస్థతో మాట్లాడుతూ, 'జెనోసైడ్' అధ్యయనాలలో ఇజ్రాయెల్ చేస్తున్న దారుణ మానవ మారణహోమం భవిష్యత్‌లో ఒక స్థిరమైన నిర్వచనంగా మిగిలిపోతుందని అన్నారు.

## సమగ్ర నివేదిక

(మొదటి పేజీ తరువాయి)

అందకపోవడంపై ముఖ్యమంత్రి ఆరా తీశారు. వరదలకు తీవ్రంగా నష్టపోయిన జిల్లాల కలెక్టర్లకు తక్షణ ఉపశమనం కింద రూ. 10 కోట్లు, ఇతర జిల్లాల కలెక్టర్లకు రూ.5 కోట్లు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు స్పష్టం చేశారు. వరదల సమయంలో ప్రాణాలు కోల్పోయిని వారి కుటుంబాలకు, పశువులు కోల్పోయిన వారికి వెంటనే పరిహారం అందించాలని ఆదేశించారు.

**నీటి వినియోగదారుల సంఘాల పునరుద్ధరణ**

రాష్ట్రంలో 257 చెరువులు, కుంటలకు గండి పడిందని అధికారులు సిఎం దృష్టికి తెచ్చారు. చిన్న నీటిపారుదల వనరుల పునరుద్ధరణ పనులను వేగవంతం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. చిన్న నీటి పారుదల విభాగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారని, ఆర్‌ఆర్‌ఆర్, ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన, ఇతర కేంద్ర ప్రాయోజిత పథకాలను వినియోగించుకొని, చిన్న నీటి వనరులకు మరమ్మతులు, పునరుద్ధరణ పనులు చేపట్టాలని సిఎం సూచించారు. గతంలో నీటి వినియోగదారుల సంఘాల ఆధ్వర్యంలో చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు, డిస్ట్రిబ్యూటరీల వారీగా సంఘాలు ఉండేవని గుర్తు చేశారు. నీటి వినియోగదారుల సంఘాలకు సంబంధించిన నిబంధనలు పరిశీలించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్లు నూతన ప్రతిపాదనలతో నివేదిక సమర్పించాలని సిఎం ఆదేశించారు. నివేదికపై మంత్రి వర్గంలో చర్చించి తగిన నిర్ణయం తీసుకుంటామన్నారు.

**పంట నష్టం అంచనా**

రాష్ట్రంలోని 82 మండలాల్లో 2.36 లక్షల ఎకరాల్లో పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖ అధికారులు సిఎం దృష్టికి తీసుకొచ్చారు. పూర్తి వివరాలతో రెండు రోజుల్లో నివేదిక సమర్పిస్తే కేంద్రం దృష్టికి తీసుకెళతామని సిఎం తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులతో భవిష్యత్తులో అకాల వర్షాలు, వరదలు ఎక్కువగా వచ్చే ప్రమాదం ఉందని, అందువల్ల అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలు అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. విపత్తు సమయంలో తక్షణమే క్షేత్ర స్థాయికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎస్‌డిఆర్‌ఎఫ్ దళాల సేవలను సిఎం అభినందించారు. వీరికి మరింత మెరుగైన శిక్షణ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. నిర్మాణంలో ఉన్న నూతన వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు, ఆసుపత్రుల భవనాల పనులు వేగవంతం చేసి ప్రారంభ తేదీలు నిర్ణయించాలని సంబంధిత అధికారులను సిఎం ఆదేశించారు.

## భూకంప విలయం

(మొదటి పేజీ తరువాయి)

సరిహద్దు ఖైబర్‌పఖ్తుంఖ్వా ప్రాంతానికి సమీపంగా ఉంటుంది. ఈ ప్రాంతాలన్నీ పర్వతమయం మారుమూల గ్రామాలు, నిస్తంత్రీ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయి. కావడంతో ప్రజలు ఎత్తైన ప్రదేశాలలోనే ఇళ్ళు నిర్మించుకున్నారు. భూకంపంవల్ల ఇళ్ళు ఒకదానిమీద ఒకటి పడి మరింత విధ్వంసం జరిగింది.

కునార్‌లో 610 మంది మరణించగా నాన్‌గర్హర్‌లో 12 మంది మరణించారు. గాయపడినవారిలో ఎక్కువమంది పిల్లలు, మహిళలే ఉన్నారు. ఇంకాచాలామంది సజీవులు శిథిలాల్లో చిక్కుకుని ఉంటారని తాలిబాన్ ప్రభుత్వం భయాందోళన చెందుతోంది. శిథిలాల నుండి సజీవులను వెలికితీసేందుకు సహాయ కార్యక్రమాలు ప్రారంభించారు. గాయపడినవారిని హెలికాప్టర్లపై సమీపంలో ఉన్న అతిపెద్ద జలాలాబాద్ ప్రభుత్వం ఆసుపత్రికి తరలిస్తున్నారు. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి దాటాక 12.47 గంటలకు సంభవించిన భూకంపంలో కునార్ రాష్ట్రంలోని మారుమూల గ్రామాలు నష్టపోయాయి. గాయపడినవారిని జలాలాబాద్ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. ఐతే కునార్ ప్రాంతం సాంస్కృతికంగా, మతపరంగా మతఛాంధనవాద భావాలు ఉండటంలో ఈ ఆసుపత్రిలో ముందుగా పురుషులకే చికిత్సలు చేస్తున్నారు. ప్రమాద ప్రాంతాల నుండి మహిళలను ఆలస్యంగా తీసుకువెళుతున్నారు. ఆసుపత్రులకు తీసుకువెళ్ళిన మహిళలు చికిత్సలకోసం ఎక్కువ సమయం ఎదురుచూడాల్సి వస్తోందని అక్కడి వారు చెప్పారు. కునార్ నదీతీరతీర గ్రామం అస్సదాబాద్‌లో ప్రజలు భయంకర శబ్దాలతో హఠాత్తుగా మేలుకుని బయటకు పరుగులు తీశారు. అర్ధరాత్రి మంచి నిద్రలో ఉండగా భూకంపం తనను భయభ్రాంతులకు గురిచేసిందని, తనశరీరం సగం మేరకు భూమిలోకి కూరుకుపోయిందని నూర్గల్‌లోని మజాదారా ప్రాంత నివాసి సిద్ధిఖీలాల్ చెప్పారు. తన భార్యాపిల్లలు దాదాపు నాలుగు గంటలసేపు బద్దలైన భూమిలోనే కూరకుపోయి ఉండిపోయారని, తర్వాత బయటకు తీశామని చెప్పారు.

ఇదిలా ఉండగా బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు వీలుగా ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసినట్లు తాలిబన్ ప్రధానమంత్రి కార్యాలయం ఏర్పాటు చేసింది. అంతేకాకుండా వారికి ఆర్థిక సహాయం అందించేందుకు 10.8 మిలియన్ పౌండ్లు ఆఫ్గనీస్‌ను కూడా నిధిగా సమకూర్చినట్లు తాలిబన్ ప్రభుత్వ ప్రధాన అధికార ప్రతినిధి జబుహుల్లా ముజహిద్ ఒక ప్రకటనలో తెలియజేశారు. అవసరమైతే ఇంకా ఎక్కువ ధనాన్ని బాధిత కుటుంబాలకోసం కేటాయిస్తామని కూడా చెప్పారు. అంతర్జాతీయ సహాయం ఆఫ్ఘనిస్థాన్‌కు రావడంలో ఎలాంటి ఆటంకాలు లేవు. కానీ ఈ ఏడాది ఆరంభంలో అమెరికా సహాయాన్ని ఆకస్మికంగా నిలిపివేయడంతో ఆఫ్ఘనిస్థాన్‌కు ఈ కష్టకాలంలో ఆర్థిక వనరులు సమకూర్చడానికి చాలా పెద్ద కష్టం వచ్చిపడింది.

**ఐరాస, భారత్,ఇరాన్, జపాన్ తక్షణ సహాయం**

**మృతులకు నరేంద్రమోదీ సంతాపం**

ఈ ప్రకృతి ప్రళయంపై ఐక్యరాజ్యసమితితోపాటు భారతదేశం,జపాన్ కూడా తక్షణం స్పందించాయి. తక్షణ సహాయం ప్రకటించాయి. పలు దేశాలు దీనిని పెనువిషాదంగా ప్రకటించాయి. ఐక్యరాజ్యసమితి, యూనిసెఫ్ హుటాహుటిన సహాయ చర్యలకు దిగాయి. ఆఫ్ఘనిస్థాన్‌కు భారత్ తన పూర్తి సంఘీభావాన్ని ప్రకటించింది. భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ వేరువేరుగా ఎక్స్ వేదికగా తీవ్ర సంతాపాలు ప్రకటించారు. వైద్య,మానవతాసహాయం అందజేస్తామని తెలిపారు.ఈ సంక్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని మోదీ సోషల్ మీడియా ద్వారా ప్రకటించారు. ఇరాన్ ప్రభుత్వం కూడా తక్షణ మానవతా సహాయాన్ని ప్రకటించింది. బాధితులకు తక్షణ వైద్య,మానవతా సహాయం అందజేస్తామని ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు. యూనిసెఫ్ దళాలు దగ్గరలోనే ఉన్నాయని, రహదారి మార్గంలో తమ బృందాలు హుటాహుటిన సహాయం నిమిత్తం భూకంప ప్రాంతాలకు తరలివెళ్ళాయని, వందలాది ఇళ్ళు నేలమట్టమయ్యాయని కాబూల్‌లోని యూనిసెఫ్ కార్యాలయం ప్రతినిధి సలామ్ అల్ జనాబీ చెప్పారు. ఈ తరుణంలో పిల్లల సంరక్షణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం వంటి విషయాలకు యూనిసెఫ్ ప్రాధాన్యం ఇస్తుందని ఆయన చెప్పారు.

**భూవిలయాలకు ఆఫ్ఘనిస్థాన్ నిలయం**

ఆఫ్ఘనిస్థాన్‌లో కునార్ ప్రాంతంలో ప్రకృతి వైపరీత్యాలకు సుదీర్ఘమైన చరిత్ర ఉంది. భూకంపాలకు, వరదలు,ఇతర ప్రకృతి వైపరీత్యాలకు ఇది కేంద్రంగా మారింది. 2022 జూన్‌లో ఆఫ్ఘనిస్థాన్‌లో సంభవించిన భూకంపం తర్వాత అతిపెద్ద భూప్రళయ ఘటన ఇదే. ఆనాడు రిచ్‌టర్ స్కేలుపై 6.1 తీవ్రతతో నమోదైన భూకంపంలో 1000 మందిపైగా ప్రజలు మరణించారు. 2023 అక్టోబరు ఏడో తేదీన హీరాత్ రాష్ట్రంలో 6.3 తీవ్రతతో సంభవించిన పెనుభూకంపంవల్ల దాదాపు4000 మందిపైగా మరణించారని తాలిబన్ ప్రభుత్వం అంచనావేసింది. ఐక్యరాజ్యసమితి మాత్రం 1,500 మంది మరణించినట్లు ప్రకటించింది. తీవ్ర భూకంపాలు సంభవిస్తే దాదాపు ఆఫ్ఘనిస్థాన్ దేశం అంతటా ఎక్కడా సురక్షితమైన ప్రాంతం లేదని భూగర్భశాస్త్ర నిపుణులు చెప్పారు.

## ఉగ్రవాదాన్ని అణచివేస్తాం

(మొదటి పేజీ తరువాయి)

సంయుక్తంగా ఎదుర్కోవడానికి ఐరాస చార్టర్, అంతర్జాతీయ చట్ట సూత్రాలకు అనుగుణంగా సంబంధిత ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని అమలు చేయాలని తెలిపింది. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడం ప్రధాన సవాల్‌గా మారిందని ఎస్‌సీఓ విడుదల చేసిన ప్రకటన పేర్కొంది.

**అతిపెద్ద సదస్సు ఇదే!**

షాంఘై సహకార సంస్థ అనేది 10 సభ్య దేశాల కూటమి. ఇందులో భారత్, రష్యా, చైనా, పాకిస్థాన్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్ ఉన్నాయి. ఏటా ఓ దేశం అధ్యక్ష బాధ్యతలు వహిస్తుండగా, ఈ సారి ఎస్‌సీఓ ప్లస్ సమ్మిట్‌ను చైనా భారీగా నిర్వహించింది. ఈ సదస్సులో టర్కీ, ఇండోనేసియా, మలేసియా, వియత్నాం, నేపాల్, మాల్దీవుల నేతలు హాజరయ్యారు. వీరితో పాటు వివిధ అంతర్జాతీయ సంస్థల అధికారులు పాల్గొన్నారు. దీంతో ఎస్‌సీఓ చరిత్రలోనే అత్యంత గొప్పగా ఈ సదస్సును నిర్వహించినట్లయింది.

**ఉగ్రవాదం మానవాళికి ఉమ్మడి సవాల్ : ప్రధాని మోదీ**

చైనాలోని టియాంజిన్‌లో జరుగుతున్న ఎస్‌సీవో వేదికగా భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పాకిస్థాన్ వైఖరిని ఎండగట్టారు. పాక్ పేరు ప్రస్తావించకుండా కొన్ని దేశాలు ఉగ్రవాదానికి బహిరంగంగా మద్దతిచ్చాయని దుయ్యబట్టారు. పాక్ ప్రధాని షెహబాజ్ సమక్షంలోనే ఆ దేశ వైఖరిని తప్పుబట్టారు మోదీ. ఉగ్రవాదం శాంతికి ముప్పుగా పరిణమించిందని పేర్కొన్నారు. ఉగ్రవాద సమస్యతో భారత్ నాలుగు దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతోందని తెలిపారు. ఏ దేశానికైనా భద్రత, శాంతి, స్థిరత్వం అనేవి అభివద్ధికి పునాదులని మోదీ పేర్కొన్నారు. "ఉగ్రవాదం శాంతికి ముప్పుగా పరిణమించింది. ఉగ్రవాద సమస్యలతో భారత్ 4 దశాబ్దాలుగా ఇబ్బందులు పడుతోంది. ఎస్‌సీవో సభ్యులుగా భారత్ కీలక భూమిక పోషిస్తోంది. ఎస్‌సీవో కోసం భారత్ విజన్, పాలసీ 3 పిల్లర్లపై ఆధారపడి ఉంది. భద్రత, అనుసంధానం, అవకాశాలు 3 పిల్లర్లుగా నిలుస్తాయి. ఉగ్రవాదం, వేర్పాటువాదం సవాళ్లుగా మారాయి. ఇటీవల పహల్గాం దాడి ఉగ్రవాదుల పైశాచికత్వాన్ని చాటింది. పహల్గాం దాడి వేళ భారత్‌కు మద్దతుగా నిలిచిన దేశాలకు కతజ్ఞతలు" అని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, వేర్పాటువాదం, తీవ్రవాదం పెద్ద సవాళ్లుగా మారాయని మోదీ అభిప్రాయపడ్డారు. ఉగ్రవాదం ఒక దేశ భద్రతకు మాత్రమే సవాలు కాదని, మానవాళి మొత్తానికీ ఉగ్రవాదం ఉమ్మడి సవాలని అన్నారు. ఉగ్రవాదంతో ఏ దేశం, ఏ సమాజం, ఏ పౌరుడూ సురక్షితం కాదని తెలిపారు. అందుకే ఉగ్రవాదంపై పోరులో దేశాలన్నీ ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. అల్‌ఖైదా, అనుబంధ సంస్థలతో పోరులో భారత్ చొరవ చూపిందని, ఉగ్రవాదులకు ఆర్థిక సహకారానికి వ్యతిరేకంగా భారత్ గళం వినిపించిందన్నారు.

**ఎస్‌సీవో సభ్య దేశాల మధ్య మరింత సహకారం అవసరం**

అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణల కోసం ఎస్‌సీవో సభ్య దేశాల మధ్య మరింత సహకారం అవసరమని ప్రధాని మోదీ అభిప్రాయపడ్డారు. అనుసంధాన ప్రక్రియలో దేశాల సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను గౌరవించాలన్నదే తమ విధానమని స్పష్టం చేశారు. చైనా చేపడుతున్న బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్‌ను ఉద్దేశించి మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు చైనాలోని టియాంజిన్ వేదికగా 25వ షాంఘై సహకార సంస్థ శిఖరాగ్ర సదస్సు అధికారికంగా ప్రారంభమైంది. చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ అధ్యక్షతన జరుగుతున్న ఈ సదస్సుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సహా వివిధ దేశాధినేతలు హాజరయ్యారు. సదస్సు ప్రారంభ సమయంలో పుతిన్‌ను ప్రధాని మోదీ ఆత్మీయంగా పలకించారు. షేక్‌హ్యాండ్ ఇచ్చి ఆలింగనం చేసుకున్నారు. ఆ చిత్రాలను మోదీ తన ఎక్స్ ఖాతాలో పంచుకున్నారు. పుతిన్‌ను కలవడం ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటుందని రాసుకొచ్చారు. జిన్‌పింగ్, పుతిన్‌తో సంభాషించిన చిత్రాలను కూడా పంచుకున్నారు. ఆ తర్వాత వారు ఎస్‌సీఓ సభ్యుల గ్రూప్ ఫొటో కోసం వేదిక వైపు నడిచారు.



**పాక్ ప్రధానిని పట్టించుకోని మోదీ**

ప్రధాని నరేంద్ర మోదీ, పుతిన్ కలిసి వెళ్తుండగా అక్కడ పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ అక్కడే నిల్చున్నప్పటికీ, మోదీ ఆయనను పట్టించుకోకుండా, పలకరించకుండా వెళ్లిపోయారు. సమావేశంలో చాలా సందర్భాల్లో మోదీ, పాక్ ప్రధానిని పట్టించుకోకుండా దూరంగా ఉన్నారు. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో భారత్‌పాక్ మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొన్న నేపథ్యంలో మోదీ పాక్ ప్రధానిని పట్టించుకోలేదు.

## సహించం

(మొదటి పేజీ తరువాయి)

పిక్కటిల్లేలా నినదించారు.

**అవినీతిలో నితీశ్ భీష్మ పితామహుడు : తేజస్వీ**

బిహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ప్రభుత్వం అనేక అక్రమాలకు పాల్పడిందని ఆర్‌జెడి నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. అవినీతిలో 'భీష్మ పితామహుడు' అని అన్నారు. బిహార్‌లో ప్రత్యేక ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై తేజస్వీ బహిరంగంగా విమర్శలు చేశారు. ఎన్నికల కమిషన్ సహాయంతో ఇద్దరు బిజెపి నాయకులు దేశంలో ప్రజాస్వామ్యాన్ని అంతం చేయాలనుకుంటున్నారని మండిపడ్డారు. 'బిహార్ ముఖ్యమంత్రికి స్పృహ లేదు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ఆయన ప్రభుత్వాన్ని అధికారం నుండి తరిమివేస్తారు' అని తేజస్వి పేర్కొన్నారు.

## సిబిఐ విచారణ

(మొదటి పేజీ తరువాయి)

సముచితమని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి వెల్లడించారు. 'కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల' బ్యారేజీల నిర్మాణం'పైన జస్టిస్ పిసి.ఘోష్ కమిషన్ నివేదిక'పైన శాసనసభలో ఆదివారం అర్ధరాత్రి వరకు సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ చర్చలో సభ్యులు ప్రస్తావించిన అంశాలపై సిఎం రేవంత్ రెడ్డి సమాధానమిచ్చారు. ఊరు,పేరు,అంచనాలు మార్చి డబ్బులు దోచుకున్న వారిని శిక్షించాలని భావిస్తున్నామని, రీ డిజైన్ పేరుతో తుమ్మడిహట్టిని మేడిగడ్డకు మార్చి, రాష్ట్రానికి గుదిబండగా మార్చిన కెసిఆర్‌ను,హరీశ్ రావును శిక్షించాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నిం చారు. జస్టిస్ పి.సి ఘోష్ కమిషన్ నివేదికలో ఏమైనా లోపాలుంటే ప్రస్తావించాలని, కానీ జస్టిస్ పిసి ఘోష్‌ను తక్కువ చేసి మాట్లాడటం ఏ రకంగా సరికాదని మండిపడ్డారు. అధిక వడ్డీలు తెచ్చి రాష్ట్రంపై మోయలేని భారం మోపారని దుయ్యబట్టారు. 2015లో రీడిజైన్ పేరుతో కెసిఆర్ మదిలో పడిన బీజం విషవృక్షంగా మారి తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసిందన్నారు. జస్టిస్ పి.సి ఘోష్ విచారణ కమిషన్ తమ నివేదికలో క్రిమినల్ చర్యలకు అర్హమైన అనేక లోపాలు, అవకతవకలను గుర్తించిందని, నిర్లక్ష్యం, దురుద్దేశం, ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తొక్కిపెట్టడం, ఆర్థిక అవకతవకల వంటి అనేక అంశాలను ప్రస్తావించిందని సిఎం వివరించారు. మూడు బ్యారేజీల నిర్మాణంలో తప్పు జరిగిందని, అసలు ప్లానింగ్ లేదని కమిషన్ స్పష్టం చేసిందన్నారు.

## హైడ్రోజన్ బాంబు పేలుస్తా...

(మొదటి పేజీ తరువాయి)

విలేకరులుతో చెప్పారు. ఆ తరువాత ప్రాంతం నిషేధిత ప్రాంతమైనందునే యాత్రను మధ్యలోనే నిలిపివేసినట్లు ఆయన చెప్పారు. కాంగ్రెస్ 14 రోజుల పాటు నిర్వహించిన 'ఓటర్ అధికార్ యాత్ర' ముగింపుగా సోమవారం ఆ పాదయాత్రను చేపట్టారు. రానున్న రాష్ట్ర ఎన్నికలకు ముందు 38 జిల్లాల్లో 25 జిల్లాలను కలుపుకొని 110 అసెంబ్లీ నియోజకవర్గాల గుండా ఓట్ అధికారక్ యాత్ర సాగింది. కాగా రాహుల్ మాట్లాడుతూ బిహార్ ఒక విప్లవాత్మక రాష్ట్రం అని, అది దేశానికి ఒక సందేశాన్ని ఇచ్చిందని పేర్కొన్నారు. తాము రాజ్యాంగాన్ని ఖూనీ చేయనీయబోమని, అందుకే యాత్ర చేపట్టామన్నారు. తము చేపట్టిన ఈ యాత్రకు అద్భుతమైన స్పందన వచ్చిందన్నారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి 'ఓటు చోర్ గద్దీ చోడ్' అనే నినాదాన్ని ఇచ్చారని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు అన్నారు. తాను బిజెపికి ఒక విషయం చెప్పాలనుకుంటున్నానని... 'మీరు అణు బాంబు కంటే పెద్దది ఏదైనా విన్నారా, అదే హైడ్రోజన్ బాంబు. బిజెపి శ్రేణులారా సిద్ధంగా ఉండండి, హైడ్రోజన్ బాంబు వస్తోంది. ఓటు చోరీ వాస్తవికతను ప్రజలు త్వరలో తెలుసుకోబోతున్నారు' అని రాహుల్‌గాంధీ హెచ్చరించారు. ఆ తరువాత మోదీ దేశ ప్రజల్లో తలెత్తుకోలేరన్నారు.మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు దొంగిలించబడ్డాయని అన్నారు. కర్ణాటకలోని బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ సీటులోని మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్‌లో 'ఓటు చోరీ' ఎలా జరిగిందో తమ పార్టీ ఆధారాలతో సహా చూపించిందని చెప్పారు. బిహార్ యువతకు తాను చెప్పాలనుకుంటున్నానని.... ఓటు చోరీ అంటే హక్కుల చోరీ, ప్రజాస్వామ్య చోరీ, ఉపాధి చోరీ అని, మీ రేషన్ కార్డుతో పాటు ఇతర హక్కులను లాక్కుంటారని రాహుల్ ఆరోపించారు.



**బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ మాయలో నితీశ్: ఖర్గే**

జెడి(యు) అధినేత ఒకప్పుడు సోషలిజం గురించి మాట్లాడేవారని, కానీ ఆ తర్వాత బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ ఉచ్చిలో పడిపోయారని బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్‌పై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నిప్పులు చెరిగారు. రాష్ట్ర ప్రజలు ఆయనను చెత్తకుండీలో విసిరివేస్తారని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 'ఓటు చోరీ' (ఓట్ల దొంగతనం) ద్వారా గెలవడానికి ప్రయత్నిస్తున్నారని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ 'డబుల్ ఇంజిన్' ప్రభుత్వం త్వరలో ఓడిపోతుందని ఖర్గే ఉద్ఘాటించారు. పేదలు, వెనుకబడిన వర్గాలు, దళితులతో కూడిన కొత్త ప్రభుత్వం ఏర్పడుతుందని ఆయన నొక్కి చెప్పారు. ఒకప్పుడు సోషలిజం గురించి మాట్లాడిన నితీశ్‌కు ఇప్పుడు ఆ సోషలిస్ట్ ఆలోచనలు ఎక్కడికి పోయాయని ప్రశ్నించారు. ఓటరు అధికార్ యాత్ర దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైందని, దానిని భంగపరిచే ప్రయత్నాలు జరిగినా, బిహార్ ప్రజలు, మహాఘట్బంధన్ వెనక్కి తగ్గలేదన్నారు.

**ఎస్ఐఆర్ పేరుతో హక్కులు లాక్కుంటున్నారు : హేమంత్**

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో ప్రజల హక్కులను లాక్కుంటున్నదని, పాలక సంకీర్ణం ఇష్టానుసారం ఓటర్ల జాబితాలను తయారు చేస్తున్నారని జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ మండిపడ్డారు. ఎన్‌డిఎ ప్రభుత్వం 'విభజించి పాలించు' విధానాన్ని అనుసరిస్తోందని ఆరోపించారు. పాలక కూటమిని అధికారం నుండి తొలగించేందుకు అన్ని భారత కూటమి నియోజకవర్గాలు ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. 'మన ఓటు మన రాజ్యాంగాన్ని రక్షిస్తుంది. కాపాడుతుంది. మీ ఓటు ఒక పార్టీకి చెందినది కాదు; అది దేశం కోసం. ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి పోరాడాలి' అని ఆయన అన్నారు. ప్రతిపక్ష నాయకులపై బిజెపి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి), సిబిఐ, ఇతర కేంద్ర సంస్థలను ఉపయోగిస్తోంది అని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తనను జైలుకు పంపారని, అసెంబ్లీ ఎన్నికల సమయంలో జైలు నుండి బయటకు వచ్చినప్పుడు, తాము జార్ఖండ్ భారీ మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో తాను జైలు నుండి బయటకు వచ్చి ఉంటే, వారు (బిజెపి) పార్లమెంటరీ ఎన్నికల్లో జార్ఖండ్ రాష్ట్రంలో ఖాతాలను తెరిచి ఉండేవారు కాదన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## 'పాత పెన్షన్'ను పునరుద్ధరించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఒక సంవత్సరంలోపు కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేసి, పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని టిజిఇజెఎసి 'పాత పెన్షన్ పోరాట సాదన సభ' తీర్మానించింది. 2004 సంవత్సరంలో 'సెప్టెంబర్ 1న' సిపిఎస్ విధానాన్ని ప్రవేశపెట్టిన రోజు సందర్భంగా సోమవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో టిజిఇజెఎసి ఆధ్వర్యంలో 'పాతపెన్షన్ పోరాట సాధన సభ' నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంఎల్‌సి శ్రీపాల్ రెడ్డి, టిజిఇజెఎసి ఛైర్మన్ మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ఏలూరు శ్రీనివాస్ రావు, ఎస్‌టియు అధ్యక్షులు సదానందగౌడ్, యుటిఎఫ్ అధ్యక్షులు చావరవి, సిపిఎస్ యూనియన్ అధ్యక్షులు స్థిత ప్రజ్ఞ, ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ జెఎసి తీసుకున్న నిర్ణయాలకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. మారం జగదీశ్వర్ మాట్లాడుతూ సిపిఎస్‌లో రద్దుచేసి, షేర్ మార్కెట్‌కు ప్రతినెలా తరలి వెళ్లే రూ450 కోట్లను ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు వినియోగించాలన్నారు. ఏలూరు శ్రీనివాస్ రావు మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు రాష్ట్రాల్లో పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించిందని అన్నారు.

# ఓట్ల తొలగింపు అధికారం ఎవరికీ లేదు




### ఆ హక్కు రాజ్యాంగపరంగా చట్టం ద్వారా సంక్రమించింది
### రాజ్యాంగబద్ధ పదవులను రాజకీయ పదవులుగా మారుస్తూ ఎన్నికలను అపహాస్యం చేస్తున్నారు
### టియుడబ్ల్యుజె మీట్ ది ప్రెస్‌లో ప్రతిపక్షాల ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దేశంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో రాజ్యాంగపరమైన అత్యున్నత పదవిలో ఒకటైన ఉప రాష్ట్ర పతి ఎన్నికనైనా ఎన్నికల కమిషన్ స్వేచ్ఛగా, పారదర్శకంగా నిర్వహిస్తుందని ఆశిస్తున్నానని ప్రతిపక్షాల ఉపరాష్ట్ర పతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఈ ఎన్నికలో గెలుపే లక్ష్యంగా అన్ని పార్టీల ఎంపిలను కలిసి ఓటు అభ్యర్థించనున్నట్లు ఆయన వెల్లడించారు. తెలంగాణ, తెలుగు బిడ్డగా తాను ఈ ఎన్నికలో పోటీ చేస్తున్న నేపథ్యంలో తెలుగుజాతి ఔనత్యాన్ని చాటుతున్న టిడిపి అధినేత, ఎపి ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు నాయుడు, తెలంగాణే ఉచ్వాస, నిస్వాసగా భావించే తెలంగాణ మాజీ సిఎం కె.చంద్రశేఖర్ రావును కలిసి మద్దతు కోరనున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టియుడబ్ల్యుజె) ఆధ్వర్యంలో జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డితో మీట్ ది ప్రెస్ కార్యక్రమం సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో జరిగింది. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ ఛైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ సంపాదకులు కె.రామచంద్ర మూర్తి, టియుడబ్ల్యుజె రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ, ప్రధాన కార్యదర్శి కె.రామ్‌నారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన వారి పేర్లను ఓటరు జాబితాలో నుంచి తొలగించే అధికారం ఈ దేశంలోని ఎవరికీ లేదని, ఎందుకంటే ఆ హక్కు రాజ్యాంగ పరంగా చట్టం ద్వారా సంక్రమించిందని చెప్పారు. దేశంలో పాలకులు రాజ్యాంగబద్ధ పదవులను రాజకీయ పదవులుగా మార్చివేయడమే కాకుండా ఎన్నికల ప్రక్రియను సైతం అపహాస్యం చేస్తూ తమ ఇష్టానుసారంగా మలుచుకుంటున్నారని అన్నారు. దేశంలోని రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన అన్ని సంస్థలను పాలకులు ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూన్నారని జస్టిస్ సుదర్శన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కొత్త కొత్తగా అధికారులు ఎవరికి ఇవ్వలేదని, ఉన్న అధికారులపై నియంత్రణ మాత్రమే ఇచ్చిందన్నారు. ఒకవేళ అవసరమైన మార్పులు, చేర్పులు చేయాలకుంటే దానిపై విస్తృతస్థాయిలో చర్చలు, సంభాషణల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని, కానీ క్రమక్రమంగా ఇవి కనుమరుగైనా మోజార్టీ ఉంటే చాలు ప్రభుత్వం తాము ఏమైనా చేయవచ్చు అనే స్థితి వచ్చిందన్నారు. ఇది ప్రజాసామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమని జస్టిస్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. యాజమన్యాల ఒత్తిడి, ఇతర కారణాలో తెలియదు కానీ జర్నలిస్టులు సైతం ప్రశ్నించడం, సమాజాన్ని విశ్లేషించడం, అధ్యయనం చేయడం మరిచి పోయారని ఇది ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని ఆయన పేర్కొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతకు కృషి

### ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో మహిళలను ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసి దేశానికే తెలంగాణను రోల్ మోడల్‌గా నిలిపేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ప్రజా భవన్‌లో సోమవారం జరిగిన మహిళలకు సంచార చేపల విక్రయ వాహనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని ఇతర రాష్ట్రాలవారు తెలంగాణకు వచ్చి ఇక్కడ మహిళల అభివృద్ధి కోసం చేపట్టిన కార్యక్రమాలను చూసే పరిస్థితిని కల్పించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. రాష్ట్రంలోని 46 వేల చెరువుల్లో చేప పిల్లల పెంపకానికి రూ. 122 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు. భవిష్యత్తులో చేప, రొయ్య పిల్లల పెంపకం బాధ్యతలను స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జి) మహిళలకు అప్పగించాలని ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోందని వెల్లడించారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సహించేందుకు వారికి సోలార్ పవర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించి, ఆ తర్వాత వాటి నుంచి ఉత్పత్తి అయిన విద్యుత్‌ను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, తద్వారా వారికి ఆదాయం సమకూరుతుందని తెలిపారు.

**కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చడమే లక్ష్యం..**

రాబోయే ఐదేళ్లలో రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ లక్ష్య సాధన కోసం మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామన్నారు. ప్రతి సంవత్సరం రూ. 20 వేల కోట్లు వడ్డీ లేని రుణాలు పంపిణీ చేయాలని ఇందిరమ్మ ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. మొదటి సంవత్సరంలోనే అంచనాలకు మించి రూ. 21,600 కోట్లు పంపిణీ చేసినట్టు ఆయన వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల రూపంలో ఇచ్చే ప్రతి రూపాయి రాష్ట్ర జిడిపి పెరుగుదలకు దోహదపడుతుందన్న నమ్మకతో ఉన్నామన్నారు.

**గత పదేళ్ళ మహిళా సంఘాలను గాలికి వదిలేశారు..**

గత 10 సంవత్సరాలు పరిపాలించిన వారు స్వయం సహాయ సంఘాల సభ్యులను గాలికి వదిలేశారని భట్టి విక్రమార్క మల్లు విమర్శించారు. ప్రజా ప్రభుత్వం రాగానే వారిని ఆర్థికంగా నిలబెట్టేందుకు పెద్ద ఎత్తున సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. బలమైన కుటుంబ వ్యవస్థ కేవలం మహిళల ద్వారానే సాధ్యమవుతుందన్నారు. హైదరాబాద్‌లో మహిళల వ్యాపారాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పెద్ద ఎత్తున కృషి చేస్తోందని, హైటెక్ సిటీ సమీపంలోని శిల్పారామం వద్ద మహిళా సంఘాలకు విలువైన స్థలాన్ని కేటాయించిందని చెప్పారు. అన్ని జిల్లాల్లో డ్వాక్రా బజార్లను ఏర్పాటు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందన్నారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుని ప్రపంచంతో పోటీ పడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, షెర్ప్ సిఈఓ దివ్య పాల్గొన్నారు.

## ఘోష్ కమిషన్ రిపోర్టుపై చర్యలేమిటి?

### రాష్ట్రాన్ని వివరణ కోరిన హైకోర్టు
### చర్యలు తీసుకోకుండా ఉత్తర్వుల జారీకి నిరాకరణ
### విచారణ నేటికి వాయిదా

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన రిపోర్టుపై ప్రభుత్వం ఏవిధంగా ముందుకు వెళ్లనుందో చెప్పాలని రాష్ట్రాన్ని హైకోర్టు వివరణ కోరింది. రిపోర్టుపై చర్యలు తీసుకోవాలనే నిర్ణయం తీసుకున్నారా లేక తీసుకుంటారా, ఇంకా ఏ నిర్ణయమూ తీసుకోలేదా.. ఏదోకటి స్పష్టం చేయాలంది. మంగళవారం జరిగే విచారణ సమయంలో చెప్పాలంది. అప్పటి వరకు కమిషన్ రిపోర్టుపై ప్రభుత్వం చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని మాజీ సీఎం, బిఆర్‌ఎస్ వ్యవస్థాపకుడు కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి.హరీష్ రావు తరఫు లాయర్లు చేసిన అభ్యర్థనను తిరస్కరించింది. అసెంబ్లీలో కమిషన్ రిపోర్టు ప్రవేశపెట్టాక చర్చ చేసినప్పటికీ రాష్ట్ర సర్కార్ చర్యలు తీసుకోకుండా స్టే ఆదేశాలు ఇవ్వాలంటూ వారిద్దరూ మధ్యంతర పిటిషన్లు దాఖలు చేశారు. వీటిని చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ జి ఎం మొహియుద్దీన్ల ధర్మాసనం ఎదుట వారిద్దరి తరఫున సుప్రీంకోర్టు సీనియర్ అడ్వొకేట్లు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు వాదించారు. పిటిషన్ గురించి లేవెత్తి అత్యవసరంగా విచారణ చేయాలని కోరారు. కమిషన రిపోర్టుపై అసెంబ్లీలో సుదీర్ఘ చర్చ అర్ధరాత్రి వరకు జరిగిందన్నారు. నివేదికపై చర్యల గురించి అసెంబ్లీ తీర్మానం చేయకుండానే ముగించిందన్నారు.

అయితే, ఈ వ్యవహారంపై సిబిఐ దర్యాప్తునకు నిర్ణయం తీసుకుంటున్నట్లు సీఎం అసెంబ్లీలోనే ప్రకటించారని చెప్పారు. ఈ పరిస్థితుల్లో రిపోర్టు ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. ఈరోజే మధ్యాహ్నం విచారణ చేపట్టాలని కోరారు. పోలీసు చట్టం సెక్షన్ 62 కింద దర్యాప్తు నిమిత్తం ప్రభుత్వం జీవో చేసేలోగానే విచారణ పూర్తి చేసి స్టే ఇవ్వాలని కోరారు. జీవో వచ్చాక పిటిషన్లు దాఖలు చేసి చేస్తున్న న్యాయపోరాటానికి ఫలితం ఉండదన్నారు. అసెంబ్లీలో చర్చిస్తామని ప్రభుత్వం చెప్పిందని, చర్యలు తీసుకోబోమని కూడా ప్రభుత్వం హామీ ఇచ్చినదానికి భిన్నంగా చర్యలు ఉన్నాయన్నారు. దీనిపై హైకోర్టు, ఆందోళన కనబడుతోందని వ్యాఖ్య చేసింది. దీనిపై అడ్వొకేట్లు స్పందిస్తూ, ప్రతిపక్ష సభ్యులు సలహాలు ఇవ్వాలనుకుంటే ఇవ్వవచ్చని, ఇవ్వకపోయినా రిపోర్టుపై చర్యలు ఉంటాయని సీఎం అసెంబ్లీలోనే ప్రకటించారని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతిపరులను వదిలిపెట్టబోమని కూడా హెచ్చరించారని చెప్పారు. విచారణను ఒకటి రెండు రోజులు వాయిదా వేయాలని ప్రభుత్వ న్యాయవాది కోరడంపై స్పందిస్తూ, అప్పటి వరకు స్టే ఇవ్వాలని వారు కోరారు. ఇందుకు హైకోర్టు నిరాకరించింది. ప్రభుత్వ వివరణ వచ్చాక పరిశీలిస్తామని ప్రకటించింది. విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

## నడిగడ్డ, పాలమూరుకే కాదు.. రాష్ట్రానికే గర్వకారణమైన కమ్యూనిస్టు నాయకుడు సురవరం

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** నడిగడ్డ నుండి దేశ నలుమూలల వరకు సురవరం చేసిన కృషిని మరువలేమని సమాజంలో మార్పు కోసం మన వంతు పాత్ర పోషించినప్పుడే సురవరం సుధాకర్ రెడ్డికి మనమిచ్చే ఘనమైన నివాళులని, దేశంలోనే మచ్చలేని కమ్యూనిస్టు నాయకుడని పేదల కోసం బడుగు బలహీన వర్గాల కోసం ఆయన చేసిన కృషి మరి ఎవరు చేసి ఉండరని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి కొనియాడారు. సోమవారం నాడు సురవరం సుధాకర్‌రెడ్డి స్వగ్రామమైన మహబూబ్‌నగర్ జిల్లా కంచుపాడులో ఆయన సంస్కరణ సభ సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బాల నరసింహ అధ్యక్షతన జరిగింది. ఈ సంస్మరణ సభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి, ఏఐసిసి కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి, మహబూబ్‌గర్ ఎంపీ డీకే అరుణ తదితర నాయకులు సుధాకర్ రెడ్డి చేసినటువంటి త్యాగాలను పోరాటాలను కొనియాడారు. అది నడిగడ్డ పాలమూరు వాసి కావడం ఎంతో గర్వకారణమన్నారు. ఆయన రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా ఉండి, లేబర్ కమిటీ చైర్మన్‌గా ఈ దేశంలో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపే దిశగా ప్రయత్నం చేశారని తెలిపారు. కార్యక్రమంలో సిపిఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్య దర్శి ఆంజనేయులు, నాగర్‌కర్నూలు జిల్లా కార్యదర్శి ఫయాజ్ మహబూబ్ నగర్ జిల్లా కార్యదర్శి బాలకిషన్, వనపర్తి జిల్లా కార్యదర్శి విజయరాములు నారాయణ పేట జిల్లా కార్యదర్శి నరసింహులు, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి పల్లె నరసింహ ఏఐటియుసి రాష్ట్ర నాయకురాలు ప్రేమ్ పావని, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కార్యదర్శి అనిల్ కుమార్, కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఆనంద్ జి, కర్నూలు జిల్లా సిపిఐ రాష్ట్ర నాయకులు జగన్నాథం, ప్రజా నాట్యమండలి కళాకారులు ప్రజా సంఘాల నాయకులు వివిధ పార్టీల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పంచాయతీరాజ్, మున్సిపల్ చట్ట సవరణ బిల్లులకు శాసనమండలి ఆమోదం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** 'తెలంగాణ రాష్ట్ర పంచాయత్‌రాజ్ సవరణ బిల్లు, మున్సిపల్ చట్ట సవరణ బిల్లు, అల్లోపతిక్ చట్ట సవరణ బిల్లు'లను శాసనమండలి సోమవారం ఆమోదించింది. కాళేశ్వరంపై సిబిఐ విచారణను వ్యతిరేకిస్తూ బిఆర్‌ఎస్ సభ్యులు నిరసనకు దిగారు. దీంతో బిల్లులపై పూర్తి స్థాయి చర్చ జరగకుండానే సభ ఆమోదం తెలిపింది. అనంతరం సభను శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి నిరవధికంగా వాయిదా వేశారు. అంతకు ముందు శాసనమండలిలలో తొలుత పంచాయతీరాజ్ శాఖమంత్రి దనసరి అనసూయ సీతక్క పంచాయతీరాజ్ బిల్లును ప్రవేశపెట్టగా, వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహా అల్లోపతిక్ చట్ట సవరణ బిల్లును, శాసనసభ వ్యవహారాలు, పరిశ్రమల శాఖమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మున్సిపల్ చట్ట సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం పంచాయతీరాజ్ బిల్లుపై జరిగిన చర్చలో ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న మాట్లాడుతుండగా బిఆర్‌ఎస్ సభ్యులు కాళేశ్వరంపై సిబిఐ విచారణను వ్యతిరేకిస్తూ, కాళేశ్వరంపై సభలో చర్చించాలని పట్టుబట్టారు. దీంతో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి స్పందిస్తూ శాసనసభలో జరిగిన చర్చకు శాసనమండలికి సంబంధం లేదని, శాసనసభలో జరిగిన అంశాలను ఇక్కడ ప్రస్తావించవద్దని సూచించారు. బిఆర్‌ఎస్ సభ్యులకు ఎవరి స్థానాల్లో వారు కూర్చోవాలని విజ్ఞప్తి చేసినప్పటికీ పోడియం వద్దకు వెళ్లి నినాదాలు చేశారు. ''కాళేశ్వరం కమిషన్ బూటకం, సిబిఐతో దోస్తీ బిజెపితో కుస్తీ, కాంగ్రెస్ బిజెపి నాటకం, 'రాహుల్‌కి సిబిఐ వద్దు, రేవంత్‌కి సిబిఐ ముద్దు'' అంటూ నినాదాలు చేస్తూ 'పిసి ఘోష్ కమిషన్ రిపోర్ట్ నివేదిక'ను చింపేసి, వాటిని ఛైర్మన్‌పై విసిరేశారు. దీంతో బిఆర్‌ఎస్ సభ్యుల తీరుపై మంత్రి పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెద్దల సభలో అమర్యాదగా ప్రవర్తిస్తున్నారన్నారు. తప్పు చేయనప్పుడు విచారణను ఎదుర్కొనేందుకు భయం ఎందుకని, విచారణ ఎదుర్కొంటామని చెప్పి, ఇప్పుడు ఎందుకు భయపడుతున్నారని ఆయన నిలదీశారు. కావాలనే బిసి రిజర్వేన్ బిల్లును బిఆర్‌ఎస్ అడ్డుకుంటోందని పొన్నం విమర్శించారు. అయినప్పటికీ బిఆర్‌ఎస్ సభ్యులు వినకపోవడంతో గందరగోళం మధ్యనే బిల్లులను శాసనమండలి ఆమోదించింది. బిఆర్‌ఎస్ సభ్యులు పోడియం నుంచి తమ తమ స్థానాలకు వెళ్లాలని చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పదే పదే సూచించినప్పటికీ వారు నిరసనను కొనసాగించారు. దీంతో సభను ఛైర్మన్ నిరవధికంగా వాయిదా వేశారు.

**బిజెపి, బిఆర్‌ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బిసిల 42 శాతం రిజర్వేషన్‌లకు సహకరించాలి : ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం**

బిజెపి, బిఆర్‌ఎస్‌లకు చిత్తశుద్ధి ఉంటే బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని సిపిఐ ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం అన్నారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ బిసిలకు స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకిగా ఉన్న పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు తాము సంపూర్ణంగా మద్దతిచ్చామన్నారు. బిసిలకు 23 శాతం ఉన్న రిజర్వేషన్‌లను 42 శాతానికి పెంచుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకమైన బిల్లు తీసుకొందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా అణచివేతకు గురవుతున్న బలహీన వర్గాలకు న్యాయం చేసే బిల్లు ప్రవేశపెట్టినప్పుడు బిఆర్‌ఎస్ ఆందోళనకు దిగడం దురదుష్టకరమని మండిపడ్డారు. అన్ని రాజకీయ పక్షాలు బిసి బిల్లుకు మద్దతు ఇవ్వాలని, ఈ విషయంలో బిజెపి, బిఆర్‌ఎస్‌లు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని అన్నారు.

**కాళేశ్వరంపై విచారణ జరగాల్సిందే..**

పదేళ్ల బిఆర్‌ఎస్ పాలనలో కాళేశ్వరం అద్భుతమని చెప్పారని నెల్లికంటి సత్యం అన్నారు. నల్లగొండ జిల్లా ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో స్వచ్ఛమైన తాగునీరు అందించకుండా తన ఫామ్‌హౌజ్ పక్కనే కాళేశ్వరం కట్టుకున్నారని విమర్శించారు. వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి హయాంలో గ్రావిటి ద్వారా నీళ్లు వచ్చే ప్రాణహిత, చేవేళ్ల ప్రాజెక్టును పక్కన పెట్టి, కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి, దీనిని ఒక ఎటిఎంగా మార్చుకున్నారని మండిపడ్డారు. కాగ్ నివేదిక కూడా కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలు జరిగాయని స్పష్టం చేసిందని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి మాయంగా మారిందన్నారు. కాళేశ్వరంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు.

**కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తం : టిపిసిసి ఛీఫ్ మహేశ్ కుమార్ గౌడ్**

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవినీతి జరిగిన మాట వాస్తవమని టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఈ విషయాన్ని తెలంగాణలో 90 శాతానికి పైగా ప్రజలు నమ్మి బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించారని తెలిపారు. శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మంత్రులు పొన్నం ప్రభాకర్, దనసరి అనసూయ సీతక్కలతో కలిసి ఆయన మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగినందునే సిబిఐకి అప్పగించామని అన్నారు. కాళేశ్వరం అంశంపై మాట్లాడలేకే కెసిఆర్ మొహం చాటేశారని ఎద్దేవా చేశారు. బిసి బిల్లు కోసం కాంగ్రెస్ చిత్తశుద్ధితో పోరాడుతోందన్నారు. బిజెపి, బిఆర్‌ఎస్ పార్టీలు బిసి రిజర్వేషన్‌లకు వ్యతిరేకమని విమర్శించారు. మండలిలో బిసి బిల్లు ఆమోదం పొందకుండా చేసేందుకు బిఆర్‌ఎస్ ఎంఎల్‌సిలు నానా హంగామా చేశారని మండిపడ్డారు. బిజెపి తరహాలోనే బిఆర్‌ఎస్ కూడా బిసిలకు వ్యతిరేకంగా పనిచేస్తుందని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు.

**బిసిలను మభ్యపెట్టేందుకే కాంగ్రెస్ బిల్లు తెచ్చింది : తీన్మార్ మల్లన్న**

కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తుందని ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న ఆరోపించారు. గతంలో 32 శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం బిల్లును ప్రవేశపెడితే హైకోర్టులో కేసు వేసి అడ్డుకున్నారని, ఇందిరా సహాని కేసు, హైకోర్టు, సుప్రీంకోర్టుల కేసులతో బిసి బిల్లు అమలయ్యే పరిస్థితులు లేవని ఆయన చెప్పారు.




## మరింత మెరుగైన పారదర్శక సేవలు

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రజలకు మరింత మెరుగైన పారదర్శక సేవలు అందించడానికి వీలుగా అవినాభావ సంబంధం కలిగిన రెవెన్యూ, స్టాంప్స్,రిజిస్ట్రేషన్, సర్వే విభాగాలను అనుసంధానం చేసేలా సాఫ్ట్‌వేర్‌ను రూపొందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. రిజిస్ట్రేషన్లకు సర్వే మ్యాప్‌ను జతచేయాలని భూభారతి చట్టంలో పొందుపర్చామని, దీనిని దృష్టిలో పెట్టుకుని భూభారతి పోర్టల్ సర్వే మ్యాప్ లింక్ చేసేలా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైదరాబాద్‌లోని బి.ఆర్. అంబేడ్కర్ సచివాలయంలో రెవెన్యూ, స్టాంప్స్, రిజిస్ట్రేషన్, సర్వే విభాగం, ఎన్‌ఐసి అధికారులతో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ భారతి పోర్టల్‌లో ఎటువంటి సాంకేతిక సమస్యలు రాకుండా పోర్టల్ నిర్వహణ మరింత సులభతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎన్‌ఐసి అధికారులకు సూచించారు. కొత్తగా అభివృద్ధి చేసే సాఫ్ట్‌వేర్‌లో కోర్టు కేసుల మానిటరింగ్ విధానం ఉండేలా చూడాలన్నారు. నక్షా లేని ఐదు గ్రామాలలో రీసర్వే కొలిక్కివచ్చిన నేపథ్యంలో మిగిలిన 408 గ్రామాల్లో మరి కొద్దిరోజుల్లోనే రీ సర్వేను ప్రారంభించబోతున్నామని తెలిపారు. భవిష్యత్తులో తెలంగాణ రాష్ట్రంలో భూవివాదాల పరిష్కారానికి ఈ సర్వే మార్గదర్శకంగా ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్, స్టాంప్స్,రిజిస్ట్రేషన్ ఐ.జి రాజీవ్‌గాంధీ హనుమంతు, సిసిఎల్ఎ కార్యదర్శి మంధా మకరంద్. ఎన్.ఐ.సి. ఎస్.ఐ.ఒ ప్రసాద్, విజయమోహన్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వయోధిక పాత్రికేయులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని వినతి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వయోధిక పాత్రికేయులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ తెలంగాణ మీడియా అకాడమీ ఛైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డికి వయోధిక పాత్రికేయుల సంఘం వినతిపత్రం సమర్పించింది. సంఘం ప్రతినిధులు ఈ మేరకు ఒక విజ్ఞప్తిని అందజేశారు. సంఘం కార్యదర్శి లక్ష్మణరావుతో పాటు సీనియర్ జర్నలిస్టులు వేణుగోపాల్, ఫాజిల్, మల్లయ్య, మధు వాకిటి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెన్షన్ సౌకర్యం కల్పించడం వల్ల వృద్ధాప్యంలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక భద్రత లభిస్తుందని, తద్వారా వారు గౌరవప్రదమైన జీవితం గడపవచ్చని ప్రతినిధులు పేర్కొన్నారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిశీలిస్తామని శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు.

## కెసిఆర్, హరీశ్ రావులకు ఇక జైలే..

### టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి, లక్ష కోట్లు దోచుకున్న కెసిఆర్, హరీశ్ రావు, ఇతర బిఆర్‌ఎస్ నాయకులకు ఇక మిగిలింది జైలు మాత్రమేనని టిపిసిసి అధికార ప్రతినిధి బండి సుధాకర్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఈ కుంభకోణంపై సిబిఐ విచారణకు ఆదేశించడం ద్వారా, సిఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అసాధారణమైన నిర్ణయం తీసుకున్నదన్నారు. కెసిఆర్ కుటుంబీకులు దోచుకున్న లక్ష కోట్లను తెలంగాణ ప్రభుత్వం రెవెన్యూ రికవరీ చట్టం కింద తిరిగి వసూలు చేస్తుందని ఆయన తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో కెసిఆర్, హరీశ్‌రావులు ఏ తప్పు చేయకుంటే.. స్టే కోసం కోర్టును ఎందుకు ఆశ్రయించారని ఆయన ప్రశ్నించారు. కాళేశ్వరం కుంభకోణానికి బాధ్యత వహిస్తూ కేసీఆర్, హరీశ్‌రావులు వెంటనే తమ పదవులకు రాజీనామాలు చేసి, అమరవీరుల కుటుంబాలకు క్షమాపణ చెప్పాలని బండి సుధాకర్ గౌడ హెచ్చరించారు. కాళేశ్వరం అవినీతిలో బీఆర్‌ఎస్‌ను బీజేపీ కాపాడుతున్నదని, ఇవి రహస్య మిత్రులని, అవినీతి వ్యవహారాల్లో ఒకరికొకరు సహకరించుకుంటున్నాయని, ఈ నిజాన్ని ప్రజలు తెలుసుకోవాలని బండి సుధాకర్ కోరారు.

## మున్సిపల్ ఎన్నికలెప్పుడు?

### ప్రభుత్వ వివరణ ఇవ్వాలన్న హైకోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని పాలకవర్గాల గడువు పూర్తి అయిన మున్సిపాల్టీలకు ఎన్నికల నిర్వహణకు తాము సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) చెప్పింది. అయితే, ఎన్నికలకు ముందుకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల అనుమతులు లభిస్తే తాము ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలియజేసింది. మున్సిపల్ చట్టంలోని సెక్షన్ 195 ప్రకారం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తే, ఎన్నికల నిర్వహణకు అవసరమైన తగిన సమయాన్ని తీసుకుని ఎన్నికలు జరపగలమని ఎస్ఈసీ లాయర్ సోమవారం హైకోర్టుకు చెప్పారు. మున్సిపాల్టీల్లోని వార్డుల విభజన, మున్సిపాల్టీల ఏర్పాటు వంటివి ప్రభుత్వం చేసి తుది జాబితా ఎస్ఈసీకి ఇవ్వాల్సివుందని చెప్పారు. నిర్మల్ మున్సిపాల్టి పాలకవర్గం గడువు ఈ ఏడాది మార్చి 25తో ముగిసినప్పటికీ ఎన్నికలు నిర్వహించడం లేదంటూ దాఖలైన పిటిషన్‌ను సోమవారం జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి మరోసారి విచారణ చేపట్టారు. రాజ్యాంగంలోని 243యు, 243జెడ్.ఎ అధికరణాల ప్రకారం పాలకవర్గాల గడువు ముగిసేలోగా ఎన్నికలు నిర్వహించాలని పిటిషనర్ వాదన. దీనిపై ఎస్ఈసీ లాయర్ స్పందిస్తూ, నిర్మల్ మాత్రమే కాదని, రాష్ట్రంలో పాలకవర్గాల గడువు అయ్యాక ఎన్నికలు జరపాల్సిన అన్ని మున్సిపాల్టీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తే, ఎస్ఈసీ ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉందన్నారు. దీనిపై ప్రభుత్వ వైఖరిపై మంగళవారం విచారణ చేస్తామని న్యాయమూర్తి ప్రకటించారు.

**తూప్రాన్ మున్సిపాలిటీ కార్యాలయం : మెదక్ జిల్లా**
ఇ-మెయిల్: municipalitytoopran@gmail.com ఫోన్: 9849069769/9490066885/9866296751

Lr.No.E1/79/2025 — కొటేషన్ టెండర్ నోటీసు — తేది: 01.09.2025

మున్సిపల్ జనరల్ ఫండ్ ద్వారా తూప్రాన్ మున్సిపాలిటీలోని బతుకమ్మ ఘాట్స్ వద్ద **బతుకమ్మ & దసరా పండుగల ఏర్పాట్ల పనులు** అనగా బ్లింకింగ్ లైట్లు, టెంట్లు, ఫ్లడ్ లైట్లు, VIP కుర్చీలు, గ్రీన్ కార్పెట్, రౌండ్ టెంట్, సౌండ్ బాక్స్, జనరేటర్, స్టేజ్ అన్ని టెంట్ హౌస్ వస్తువులు మరియు ఎంగేజింగ్ JCB, కలరింగ్ స్టెప్స్ నిమిత్తం రిజిస్టర్డ్ కాంట్రాక్టర్ & ఏజెన్సీల నుండి కొటేషన్లను ఆహ్వానించడమైనవి. **కొటేషన్ బిడ్ డాక్యుమెంట్ సమర్పించు ప్రారంభ తేదీ** : 02.09.2025న ఉ.11.25గం.లకు, **కొటేషన్ బిడ్ డాక్యుమెంట్ ముగింపు తేదీ** : 06.09.2025 సా.3.10గం.ల వరకు, **బిడ్ల స్వీకరణకు చివరి తేదీ & సమయం:** 06.09.2025న మ.3.25గం.ల వరకు, **కొటేషన్ బిడ్ ప్రారంభ తేదీ (ఆర్థిక బిడ్ దశ):** 06.09.2025 మ.3.40గం.లకు. మరిన్ని వివరాలు మరియు వివరణలను అన్ని పని దినాలలో కార్యాలయ వేళల్లో కమిషనర్ లేదా మున్సిపల్ ఇంజనీర్, తూప్రాన్ మున్సిపాలిటీ నుండి పొందవచ్చు.

సం/- మున్సిపల్ కమిషనర్
తూప్రాన్ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 7451-PP/CL/ADVT/1/2025-26, Date: 01-09-2025

## మున్నూరు కాపు అభ్యున్నతికి కృషి

**మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ**

**ప్రజాపక్షం/హాలియా:** మున్నూరు కాపుల అభ్యున్నతికి కాపు సంఘం నాయకులు నిరంతరం కృషి చేయాలని మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కోశాధికారి కంచి సత్యనారాయణ అన్నారు. సోమవారం హాలియాలోని ఉద్యోగుల విశ్రాంతిభవనంలో తెలంగాణ మున్నూరు కాపు సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం కోశాధికారి కంచి సత్యనారాయణ,జిల్లా అధ్యక్షులు వాసుదేవుల వెంకట నరసయ్య పాల్గొని వారు మాట్లాడుతూ మండలంలోని మున్నూరు కాపు సంఘం బలోపేతం కోసం ఈ సభ్యత్వ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు.జిల్లా లోనే అత్యధికంగా అనుముల మండలం నుండే సభ్యత్వాలు నమోదు కావాలని, సంఘం బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగార్జునసాగర్ నియోజకవర్గ సంఘం అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, హాలియా పట్టణ అధ్యక్షులు గోపి శెట్టి నరసింహ, సుగురు నారాయణ , అనేబోయిన వెంకటయ్య, వనమాల కోటి,గోపిశెట్టి మధు, ఎల్ల సోమయ్య, నంద్యాల జానయ్య, ముత్యాల జానయ్య తదితరులు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసిదే అగ్రస్థానం

**ప్రజాపక్షం/కోదాడ:** భారతదేశ ఆర్థిక వ్యవస్థలో ఎల్ఐసి అగ్రస్థానంలో నిలుస్తుందని కోదాడ ఎల్ఐసి బ్రాంచ్ మేనేజర్ భానుకుమార్, లియాఫి అధ్యక్షులు కంజుల మోహనరెడ్డి లు అన్నారు. సోమవారం ఎల్ఐసి 69వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోదాడ బ్రాంచ్ కార్యాలయంలో జ్యోతి ప్రజ్వలన చేసి ఘనంగా జరుపుకున్నారు. పాలసీదారులకు గత 69 సంవత్సరాలుగా నమ్మకమైన సేవలు అందిస్తూ వారి మన్ననలు పొందిందని, గ్రామీణ, పట్టణ ప్రాంతాల ప్రజలకు ఇన్సూరెన్స్ పాలసీ ప్రాముఖ్యతను పెంచి దేశ ఆర్థిక వ్యవస్థకు చేయూతనిస్తుందని తెలిపారు. ఎల్ఐసిపై ప్రజల్లో పూర్తి నమ్మకం విశ్వాసం ఉందన్నారు. అనంతరం కార్యాలయ ఉద్యోగులు స్వీట్లు పంపిణీ చేసి ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి పట్టికోటి మల్లేష్, విజయ, శంకర్, సువర్ణ రాణి, కస్తయ్య, కాటేపల్లి సూర్యనారాయణ, వెంకటాద్రి, ప్రభాకర్‌రెడ్డి, బాల వెంకటేశ్వర్లు, మదన్‌మోహన్‌రావు, సత్యనారాయణ, వందనపు దయాకర్, పాలసీదారులు పాల్గొన్నారు.



## ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు విస్తరణతో సొంత భూములు కోల్పోతున్నాం

**తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ఆందోళన**

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు విస్తరణ పనుల కారణంగా రైతులు తమ సొంత భూములు కోల్పోతున్నామని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని సర్వేల్, లింగం వారి గూడెం గ్రామాల రైతులు తహసీల్దార్ కార్యాలయం ముందు పెద్ద ఎత్తున ఆందోళన చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ట్రిబుల్ ఆర్ భూ బాధితుల రైతు సంఘం నాయకుడు పుష్పారెడ్డి మాట్లాడుతూ సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూములు ప్రభుత్వ స్వాధీనంలోకి వెళుతుండడంతో భూములపై ఆధారపడి జీవనోపాధి నడుపుతున్న రైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ప్రభుత్వం గతంలో ఓఆర్ఆర్ నుండి భూసేకరణకు 40 కిలోమీటర్ల పరిధి మేరకే ట్రిబుల్ ఆర్ భూ సేకరణ చేపట్టాలని నిబంధనలు ఉన్న వాటిని తుంగలో తొక్కారని మాట్లాడారు. పరిశ్రమల యజమానుల మెప్పు పొందేందుకే ప్రభుత్వం అంతర్గత ఒప్పందాలు చేసుకొని ఇలాంటి నిర్ణయాలు తీసుకోవడం పట్ల రైతులు తీవ్ర నష్టపోతున్నారని ప్రభుత్వాన్ని కోరారు. పేద రైతులకు అన్యాయం జరగకుండా చూడాలని కోరారు. పుష్ప రెడ్డి, పల్లె శేఖర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, యాదిరెడ్డి, లక్ష్మయ్య, గాలయ్య, సత్యనారాయణ, బి శంకర్, నాగార్జున రెడ్డి, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

**విద్యాశాఖ మంత్రిని తక్షణమే నియమించాలి: మురళీ కృష్ణ**



**ప్రజాపక్షం/ నాంపల్లి:** రాష్ట్రం లో విద్యారంగా సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం నాంపల్లి మండల పరిధిలోని పెద్దాపురం గ్రామంలోని ప్రభుత్వ మోడల్ స్కూల్లో విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు లేక సమస్యలతో సతమతమవుతున్నాయని అన్నారు. పాఠశాల భవనాలు శిథిలావస్థలో ఉండి వర్షానికి కూలిపోతున్నాయని వాపోయారు. విద్యార్థులకు మంచినీరు, లైబ్రరీ, ల్యాబ్స్, మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు పడుతున్నారని వెంటనే సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, మధ్యాహ్నం భోజనం సంబంధించి మెస్ చార్జీలను 30 రూపాయలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేక విద్య వ్యవస్థ కుంటుపడుతుందని వెంటనే విద్యాశాఖ మంత్రి కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎఐఎస్ఎఫ్ నాయకులు ప్రవీణ్, సాయి, మహేష్ తరుణ్, శరత్ పాల్గొన్నారు.

## మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలకు పోలీసు శాఖ అండ



**ప్రజాపక్షం/సూర్యాపేట :** సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులు, సమస్యలపై పోలీసు శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, మహిళా సిబ్బంది స్పందించి సహాయ సహకారాలు అందించాలని జిల్లా ఎస్పి కె నరసింహ సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పని ప్రదేశంలో ఆత్యాచార, వేధింపులు నిరోధక చట్టంకు సంబంధించి మహిళా పోలీసు అధికారులకు, మహిళా రక్షణ విభాగం సిబ్బందికి, మహిళా శిశు సంక్షేమం వారికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పి నరసింహ హాజరై శిక్షణను ఉద్దేశించి మాట్లాడారు. వేధింపులపై ధైర్యంగా ఫిర్యాదు చేసి వాటి నిర్మూలనకు పాటుపడాలన్నారు. మహిళా పోలీసు యూనిఫాం ధరించి రోడ్డుపై కనిపిస్తే ఆకతాయిల మదిలో అలజడి, భయం కలిగేలా ఉండాలని సూచించారు. సూర్యాపేట జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ అధికారి మంజుభార్గవి ఆధ్వర్యంలో ఒక ఇంటర్నల్ కమిటి కూడా ఏర్పాటు చేశామన్నారు. జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నందు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కమిటి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా సంక్షేమ అధికారి దయానందరాణి, బెటి బచావో బెటి పడావో నిర్వాహకురాలు చైతన్య, పోలీసు కార్యాలయం ఏఓ మంజుభార్గవి, జిల్లా మహిళా బరోసా సెంటర్ ఎస్ఐ మౌనిక, జిల్లా షీ టీమ్స్ ఎస్ఐ నీలిమ, బరోసా సెంటర్ లీగల్ అడ్వైజర్ జ్యోతి, కరుణశ్రీ, మహిళా ఏఎస్ఐ సైదాబి, జ్యోతి, అరుణ, కవిత పాల్గొన్నారు.

## లక్ష్మయ్య మృతి సిపిఐకి తీరని లోటు



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** అనారోగ్యంతో అకాల మరణం చెందిన సిపిఐ పీఏ పల్లి ఉమ్మడి మండల మాజీ కార్యదర్శి ఎర్ర లక్ష్మయ్య మృతి పార్టీకి తీరని లోటు అని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి,కలకొండ కాంతయ్యలు అన్నారు. సోమవారం మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద గల తన స్వగృహంలో లక్ష్మయ్య భౌతికకాయంపై ఎర్ర జెండా కప్పి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతాల కోసం 1975లో సిపిఐ జెండాను పట్టిన లక్ష్మయ్య దాదాపు 50 సంవత్సరాల పాటు అనేక పదవులు చేపట్టి పార్టీ పిలుపు అనేక కార్యక్రమాలలో పాల్గొని పోరు బాటలో నడిచారన్నారు. వారి వెంట మం డల కార్యదర్శి కుంభం జయరాములు గౌడ్,సహాయ కార్యదర్శి నూనె కాంతరావు, మండల సీనియర్ నాయకులు అలుగుబెల్లి భాస్కర్ రెడ్డి,పాల్వాయి రంగారెడ్డి,జిల్లా కౌన్సిల్ సభ్యులు గుమ్మంకొండ వెంకటేశ్వర రెడ్డి,పల్లా రంగారెడ్డి,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు వల్లమల్ల ఆంజనేయులు, కల్లు చరణ్ రెడ్డి,వాల్య నాయక్ తదితరులు ఉన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులకు తక్షణ పరిష్కారం

**నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమ వారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.ఈ సోమవారం మొత్తం 99 ఫిర్యాదులు రాగా, అందులో జిల్లా అధికారులకు 30 ,రెవెన్యూ శాఖకు 69 ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామ రావు, గృహ నిర్మాణ శాఖ పిడి రాజకుమార్ , ఆర్‌డిఓలు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

**వీధి కుక్కలపై విస్తృత ప్రచారం కల్పించాలి**

మున్సిపల్ పట్టణ ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలలో వీధి కుక్కలపై పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు.ఈ విషయమై సోమ వారం ఆమె సంబంధిత అధికారులు, మండల ప్రత్యేక అధికారులు, డిఆర్ డి ఓలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు వీధి కుక్కల పై కరపత్రాల ద్వారా అవగాహన కల్పించాలని ,దినపత్రికల ద్వారా తల్లిదండ్రులకు సమాచారం చేరవేయాలని, అలాగే విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీలు నిర్వహించాలని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో హోర్డింగ్ లు ఏర్పాటు చేసి ప్రజలకు వీధి కుక్కల వల్ల కలిగే నష్టాలు, వీధి కుక్కల స్టెరిలైజేషన్,వాక్సినేషన్, దత్తత తదితర అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. జాతీయ కుటుంబ ప్రయోజన పథకం కింద దరఖాస్తుల పరిశీలనలో వెనుకబడిన తహసిల్దారులు దరఖాస్తుల పరిశీలనను ఆన్లైన్ ద్వారా డిఆర్ఓ పంపించాలని చెప్పారు.



## పెండింగ్ ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం

**జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశం**

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి ఫిర్యాదులను జిల్లా అధికారులు చొరవ తీసుకొని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశించారు. సోమ వారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ వివిధ అంశాలను సమీక్షిస్తూ కొన్ని శాఖల్లో ఎక్కువ రోజుల నుండి ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాంటి శాఖల అధికారులు పెండింగ్ ఫిర్యాదులపై దృష్టిసారించి తక్షణం పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. కాగా 76 ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. వీటన్నింటిని సంబంధిత శాఖల అధికారులకు పంపడం జరిగిందని, జాగ్రత్తగా అన్నిటిని పరిశీలించి జాప్యం లేకుండా వేగంగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. డిఆర్‌డిఓ పిడి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎఓ శ్రీధర్ రెడ్డి, డిపిఓ పద్మ, డిఈఓ అశోక్, డిఎంహెచ్‌ఓ చంద్రశేఖర్, డిఎస్‌ఓ మోహన్‌బాబు, ఈడి ఎస్సీ కార్పొరేషన్ శ్రీనివాస్ నాయక్, సంక్షేమ అధికారులు శంకర్, దయానందరాణి, పరిపాలన అధికారి సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## ఇందిరమ్మ ఇండ్లల్లో పెయింటింగ్ వర్కర్స్‌కు ప్రాధాన్యత

**ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్**

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పంపిణీలో పెయింటింగ్ వర్కర్స్‌కు ప్రధమ ప్రాధన్యతను ఇవ్వాలని ఏఐటియూసి సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం హుజూర్‌నగర్‌లోని ఏఐటియూసి కార్యాలయంలో జరిగిన పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇండ్లు లేని నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను నిర్మించడం చాలా సంతోషకరమన్నారు. కార్మికుల హక్కుల సాధనకై కార్మికుల పక్షాన ఏఐటియూసి ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు,ధూళిపాళ ధనుంజయ్ నాయుడు,జెట్టి ప్రసాద్,తమ్మిశెట్టి రవి, తురక అంజయ్య,జక్కుల రమణ,రమేష్,విజయ్,రాము,శ్రీను,వెంకటేశ్వర్లు, కుమార్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# మార్బుల్ గ్రానైట్ వర్కర్లకు పెన్షన్ సౌకర్యం కల్పించాలి

**ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపు**

**ప్రజాపక్షం/నల్లగొండ(నకిరేకల్) :** మార్బుల్ గ్రానైట్ అండ్ టైల్స్ రంగంలో పనిచేసే కార్మికులకు 50 సంవత్సరాలు దాటిన వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని ఎఐటియుసి బిల్డింగ్ అండ్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం నకిరేకల్ లోని మార్కెట్ యార్డ్ లో జరిగిన మార్బుల్ గ్రానైట్స్ అండ్ టైల్స్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ నిర్మాణ రంగం లో పనిచేస్తున్న కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు నిర్వహించి 1996లో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్ని తీసుకురావడం కోసం కృషి చేయటం జరిగింది. నిజమైన కార్మికులు సంక్షేమ బోర్డులో పేర్లు నమోదు చేసుకునే విధంగా లేబర్ అధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్ల బోగస్ కార్మికులకు కూడా లేబర్ కార్డు తీసుకొని లబ్ధి పొందుతున్నారని పేర్కొన్నారు.ఆన్లైన్ విధానం ప్రవేశపెట్టిన తర్వాత పని చేసే కార్మికులకు తంబూ పడక తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కావున తంబూ విధానం రద్దు చేసేందుకు పోరాటం నిర్వహించాలనీ అన్నారు. 50 ఎండ్లు దాటిన నిర్మాణరంగ కార్మికులకు నెలకు రూ. 5వేల పెన్షన్ ఇవ్వాలని, కార్మికుల అడ్డాల వద్ద షెల్టర్ నిర్మించి మంచినీరు, బాత్రూం సౌకర్యం కల్పించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త లేబర్ చట్టాల వల్ల కార్మికులు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంక్షేమ బోర్డుని ఎత్తివేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తుందని ఆరోపించారు. ఈ సమావేశంలో యూనియన్ నకిరేకల్ డివిజన్ అధ్యక్షులు శంకర్, రమేష్, లింగయ్య మహేష్ ,నగేష్, నాగయ్య ,అయోధ్య, యాదగిరి సత్యనారాయణ బాబు ఏలియా, నగేష్, వెంకటేశ్వర్లు, వెంకన్న, శ్రీను, చంటి, సివిల్ సప్లై హమాలి యూనియన్ జిల్లా నాయకులు అశోక్ పాల్గొన్నారు.






## రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను అందించాలి

**తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షుడు బొల్లు ప్రసాద్**

**ప్రజాపక్షం/కోదాడ:** గత నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా యూరియా కోసం రైతులు రోజుల తరబడి ఇబ్బంది పడుతున్నారని, కావున రైతులకు ఇబ్బంది లేకుండా యూరియాను అందించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఉపాధ్యక్షులు బొల్లు ప్రసాద్ అన్నారు. సోమవారం రైతు సంఘం ఆధ్వర్యంలో కోదాడ ఆర్డీవో కార్యాలయం ముందు నిరసన తెలిపి అనంతరం కోదాడ ఆర్డీవో సూర్యానారాయణకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోజుల తరబడి రైతులు పిఎసిఎస్ కేంద్రాల వద్ద గంటల తరబడి క్యూ లైన్‌లో ఉంటున్నారని, ఒక్కో రైతుకు ఒక బస్తా యూరియా కూడా అందటం లేదని అన్నారు ఖరీఫ్‌లో ఎన్ని లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరమో ఉందో దానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలు పంపించినా సరిపడిన యూరియాని సరఫరా చేయడంలో కేంద్ర ప్రభుత్వం పక్షపాత దోరణి అవలంభిస్తుందని అన్నారు. రైతులు సకాలంలో పంటలకు యూరియా చల్లలేక పోతున్నారని అన్నారు. ఇలా జరిగితే రైతుల పంట దిగుబడితగ్గి రైతులు ఆర్థికంగా నష్టపోతారని అన్నారు. గతంలో కురిసిన వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం కింద ఎకరానికి వరికి రూ.20వేలు, వేసంగిలో ప్రభుత్వం కొనుగోలు చేసిన సన్న రకం వరి ధాన్యానికి 500 చొప్పున బోనస్ చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దొడ్డ వెంకటయ్య, సిపిఐ తమ్మర నాయకులు మాతంగి ప్రసాద్, కనగాల కొండయ్య, నాగేశ్వరరావు, బి.గోపాల్, ఎం.రాజు, పుల్లయ్య, నర్సింహరావు పాల్గొన్నారు.

## బిసి రిజర్వేషన్లకు బిఎస్‌పి సంపూర్ణ మద్దతు

**ప్రజాపక్షం/ఎర్రవల్లి :** 42 శాతం బీసీ రిజర్వేషన్లకు బీఎస్పీ సంపూర్ణ మద్దతు ఇస్తోందని బహుజన సమాజ్ పార్టీ ఎర్రవల్లి మండల అధ్యక్షులు ధర్మవరం రాముడు అన్నారు. వెంటనే చట్టం చేసి అమలు చేయాలని డిమాండు చేశారు. ఈ మేరకు సోమవారం మండల కేంద్రంలోని తాహసిల్దార్ నరేష్ కు వినతిపత్రంను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పేరిట కాంగ్రెస్, బిఆర్ఎస్ , బిజెపి పార్టీలు ఆడుతున్న డ్రామాలను బీఎస్పీ ఖండిస్తోందన్నారు. ఎన్నికలు వచ్చిన ప్రతిసారి ఈ డ్రామా నడుస్తోంది తప్పితే చట్టం రావడం లేదన్నారు. బీసీలు ఇక్కడో విషయం గమనించాలన్నారు. వినతిపత్రం సమర్పించిన వారిలో దేవన్న, శివన్న ఉన్నారు.

# అబార్షన్ చేస్తుండగా గర్భిణి మృతి కేసులో ముగ్గురి నిందితుల అరెస్టు

**డిఎస్‌పి ప్రసన్న కుమార్ వెల్లడి**




**ప్రజాపక్షం/సూర్యాపేట :** సూర్యాపేట పట్టణములోని శ్రీరామలింగేశ్వర థియేటర్ సమీపంలో ఉన్న ఒమెగా హాస్పటల్‌లో 17.05.2025న లింగ నిర్ధారణ పరీక్షలు చేసి ఆడ శిశువని తేలడంతో గర్భిణీకి అబార్షన్ చేస్తుండగా మోతె మండలం రాఘవాపురం గ్రామానికి చెందిన బయ్య అనూష మృతి చెందిన విషయం అందరికి తెలిసిందే. ఈ కేసులో మొత్తం పది మంది ప్రమేయం ఉన్నట్లు తేల్చిన పోలీసులు ఇందులో ఇప్పటికే ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. తాజాగా మరో ముగ్గురు నింధితులను పట్టణంలోని రితిక హోటల్ సమీపంలో సోమవారం అరెస్టు చేశారు. వీరిలో హాస్పటల్ నిర్వాహకుడు ఏ1 నింధితుడు గోరెంట్ల సంజీవ, మరో మేనేజ్‌మెంట్ పార్టనర్ ఏ6 వీరబోయిన వేణు, స్కానింగ్, అబార్షన్ చేయడానికి ఏర్పాటు చేసిన గామీణ వైద్యుడు ఏ2 నింధితుడు జాల జానయ్య అరెస్టు అయిన వారిలో ఉన్నారు. మృతురాలి భర్త బయ్య నగేష్ నుండి డబ్బులు తీసుకొని స్కానింగ్ చేసి ఆడపిల్ల అని తేలడంతో అబర్షన్ చేస్తుండగా తీవ్ర రక్తస్రావం జరిగింది. ఆమెను మెరుగైన చికిత్స కోసం ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బయ్య అనూష మృతి చెందింది. ఈ విషయం బయటకు పొక్కకుండా హాస్పటల్ నిర్వాహకులు అనూష కుటుంబ సభ్యులతో బేరసారాలకు దిగగా పత్రికల్లో వచ్చిన వార్తకథనాలకు స్పందించిన వైద్య ఆరోగ్య శాఖ అధికారులు సూర్యాపేట పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు డిఎస్‌పి ప్రసన్న కుమార్ తెలిపారు. నింధితులపై 197/2025 ప్రకారం సెక్షన్ 105, 90 భారతీయ న్యాయ సంహిత బిఎన్ఎస్, మెడికల్ టెర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ యాక్ట్ 23, ప్రి కన్సెప్షన్ ప్రి నటల్ దయాగ్నటిక్ టెక్నిక్స్ ఆక్ట్ 1994 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. లింగ నిర్ధారణ చట్టరిత్యా నేరమని, ఇలాంటి నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో సూర్యాపేట పట్టణ సిఐ వెంకటయ్య, ఎస్ఐ ఏడుకొండలు, సిబ్బంది ఉన్నారు.

## నెలలు గడిచినా ప్రజలకు అందని హోమియో వైద్యం

**వైద్యుడు లేక ఇంగ్లీష్ మందులే దిక్కంటున్న రోగులు**

**ప్రతిరోజూ పడిగాపులు కాసి వెను తిరిగి పోతున్న ప్రజలు**



**ప్రజా పక్షం/నల్లగొండ:** దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వ్యాదిగాస్తులు హోమియో మందులకు అలవాటు పడి తమ రోగాలను నయం చేసుకుంటున్నారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న దీర్ఘకాలిక రోగస్తులు నల్లగొండ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గల హోమియో వైద్యశాలకు వచ్చి వైద్యం పొందుతున్నారు. ప్రతి రోజు సుమారు 70 నుంచి 100 మంది వరకు ఓపి ద్వారా వైద్యం పొందుతుంటారు.ఇంతవరకు బాగానే ఉన్నది కానీ గత కొన్ని నెలల నుండి ఈ హోమియో ఆసుపత్రిలో వైద్యం అందిచేందుకు వైద్యుడు,ఫార్మసిస్ట్ లేక రోగులకు వైద్యం అందడం లేదు. ఈ ఆసుపత్రిలో పనిచేస్తున్న సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు గత మూడు నెల క్రితం పదవి విరమణ పొందారు ఆయనతో పాటు పనిచేస్తున్న ఫార్మసిస్టు కూడా పదవి కాలం ముగియడంతో పదవి విరమణ పొందారు. అయితే నాటి నుంచి నేటి వరకు సీనియర్ మెడికల్ ఆఫీసర్,కానీ ఫార్మాసిస్ ను కానీ నియమించకపోవడం వల్ల హోమియో వైద్యం పొందుతున్న రోగులు వైద్యం అందుకోలేకపోతున్నారు. ప్రతిరోజు డాక్టర్ వస్తుడని దూర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో రోగులు ఆసుపత్రి వచి డాక్టర్‌లేక నిరాశతో చేసేది ఏమీ లేక తమ రోగాలను కంట్రోల్ చేసుకోవడానికి,నయం చేసుకోవడానికి ఇంగ్లీష్ మందులు వాడక తప్పడం లేదు,హోమియో వైద్యశాలకు డాక్టర్‌తో పాటు ఫార్మసిస్ట్ ని నియమించి తమకు వైద్యం అందించాలని ప్రజలు రోగులు కోరుకుంటున్నారు. రోగుల బాధలు దృష్టిలో పెట్టుకొని హాలోపతి ఆసుపత్రికి వైద్యుని ఫార్మసిస్ట్ ను నియమిస్తారని ఆశిద్దాం.

# కప్పల నరసింహాకు కన్నీటి వీడ్కోలు

**సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు**



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** జనగాం సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి కప్పల నరసింహ మృతదేహంపై యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పూలమాలలు అర్పించి అంతిమయాత్రలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కప్పల నరసింహ ప్రజా సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేసిన నాయకుడని కప్పల నరసింహకు కన్నీటి వీడ్కోలు పలికారు. సామాజిక న్యాయం కోసం రైతు కూలీల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటాలు మరువలేనివని గుర్తు చేశారు. మృతదేహాన్ని జనగాం ఆయన నివాసం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయన వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. చివరి యాత్రలో సిపిఐ జిల్లా మండల సిపిఐ కార్యకర్తలు ఇతర పార్టీ నాయకులు, బంధుమిత్రులు, ఆయన కుటుంబ సభ్యులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆయనపై ఉన్న గౌరవం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చెడే చంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బచ్చునగోని గాలయ్య, పల్లె శేఖర్ రెడ్డి, కురిమిద్ద శ్రీనివాస్, గురుజ రామచంద్రం, తీర్పారి వెంకటేశ్వర్లు, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, జిల్లా సమితి సభ్యులు చిలువేరు అంజయ్య, కలకొండ సంజీవ, అన్నెపు వెంకట్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకుడు రెహమాన్, ఎమ్మెల్యే గాలయ్య, ప్రజానాట్యమండలి నాయకుడు బి.జగన్, కొండూరు విప్లవం, మంచాల జంగయ్య, సైదులు, రాజు, లోడ యాదయ్య, కొండూరి మల్లేష్, స్వామి, శనిగల జంగయ్య, ఏఐవైఎఫ్ మండల కన్వీనర్ నరేష్, యువజన నాయకులు ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. ప్రజానాట్యమండలి ఆలపించిన అమరవీరుల గీతాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

**నరసింహ సేవలు మరువలేనివి: గోదా శ్రీరాములు**

అమరుడు కప్పల నరసింహ మృతదేహానికి సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు గోదా శ్రీరాములు ఎర్రజెండా కప్పి నివాళులు అర్పించి ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం గ్రామ అభివృద్ధి కోసం నరసింహ చేసిన సేవలు మరువలేని అని అన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం సిపిఐ శాఖ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ఇ–20 పెట్రోల్‌పై పిటిషన్ కొట్టేసిన 'సుప్రీం'

**న్యూఢిల్లీ:** ఇరవై శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ 20 పెట్రోలు) సురక్షితం కాదంటూ కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఈ 20 పెట్రోల్ వాడకాన్ని సవాల్ చేస్తూ న్యాయవాది అక్షయ్ మల్హోత్రా వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ముడి చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని, వాహన ఉద్గారాలు తగ్గించడం, ఇంధన భద్రత, పర్యావరణ సంరక్షణ వంటి లక్ష్యాలు చేరుకోవడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ తీర్పుతో దేశవ్యాప్తంగా ఈ 20 పెట్రోల్‌ను వినియోగించాలనే ప్రతిపాదన కార్యరూపం దాల్చడానికి ముందడుగు పడింది. 20 శాతం ఇథనాల్ కలిపినపెట్రోల్‌సురక్షితంకాదంటూ కొన్ని కథనాలు వెలుగులోకి వచ్చాయి. ఈ 20 ఇంధనం పాత వాహనాల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందా? డ్రైవింగ్‌ను దెబ్బతీస్తుందా? అని వాహనదారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సహజవాయువు మంత్రిత్వశాఖ ఇటీవల వివరణాత్మక స్పష్టతనిచ్చింది. ఆ భయాలన్నీ నిరాధారమైనవని పేర్కొంది. శాస్త్రీయ ఆధారాలు, నిపుణుల విశ్లేషణకు అనుగుణంగా లేవంది. ఇథనాల్ కలిసిన పెట్రోల్‌తో ఎలాంటి ఇంజిన్ సమస్యలు తలెత్తవని మంత్రిత్వశాఖ వెల్లడించింది.

### భారత్–చైనా సహకారం...సానుకూల పరిణామం

## శాంతి, స్థిరత్వం, అభివృద్ధికి దోహదం

**సిపిఐ ఉద్ఘాటన**

**న్యూఢిల్లీ:** భారత్‌చైనా మధ్య సహకార పురోగతిని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) స్వాగతించింది. ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య జరిగిన సమావేశంసానుకూల ఫలితం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు పార్టీ జాతీయ సమితి ఓ ప్రకటనలో పేర్కొంది. రెండు దేశాల ప్రజలమధ్య రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు సహా ఇతర అన్ని స్థాయిలలో మెరుగైన అవగాహన వైపు ముందుకు సాగడానికి ఈ చర్చలు నిబద్ధతను చాటాయి. ఇటువంటి సహకారం మన రెండు దేశాలకు మాత్రమే కాకుండా, గ్లోబల్ సౌత్ ఐక్యతను బలోపేతం చేయడానికి, అంతర్జాతీయ సంబంధాలలో బహుళ ధ్రువణత పురోగతికి కూడా చాలా ముఖ్యమైనదని సీపీఐ తెలిపింది. వలస శక్తుల వారసత్వం అయిన దీర్ఘకాలిక సరిహద్దు సమస్యలను శాంతియుత చర్చల ద్వారా పరిష్కరించడానికి రెండు దేశాలు రాజకీయ సంకల్పాన్ని ప్రదర్శించాయని తెలిపింది. ఈ పరిణామంమనప్రాంతంలో శాశ్వత శాంతి, స్థిరత్వం, అభివద్ధిని నిర్మించడానికి దోహదపడుతుంది. సామ్రాజ్యవాద శక్తులు ప్రపంచాన్ని విభజించి ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో భారత్ చైనాల ఐక్యత, సహకారం... దేశాల మధ్య సమానత్వం, న్యాయం, పరస్పర గౌరవంఆధారంగా ప్రత్యామ్నాయ ప్రపంచ క్రమానికి శక్తివంతమైన ప్రేరణనిస్తాయి. భారత్‌చైనా సంబంధాలలో సానుకూల పరిణామానికి మద్దతు ఇవ్వాలని సీపీఐ ప్రజలకు పిలుపునిచ్చింది.

**మేం పార్లమెంట్‌లో అభ్యర్థిస్తే బిజెపి అవమానించింది...**

**కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి బినోయ్‌విశ్వం**



**తిరువనంతపురం :** చైనా, రష్యా దేశాలతో భారతదేశం 'మంచి సంబంధాలను' నిర్మించుకోవాలని తనతో పాటు వామపక్ష సహచరులు గతంలో పార్లమెంట్‌లో అభ్యర్థించినందుకు బిజెపి తనను, వామపక్ష పార్లమెంటేరియన్లను తీవ్రంగా అవమానించి విమర్శల దాడికి దిగారని, చైనాలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఇప్పుడు చేస్తున్నదేమిటి? అని కేరళ రాష్ట్ర సిపిఐ కార్యదర్శి, రాజ్యసభ మాజీ ఎంపి బినోయ్ విశ్వం ప్రశ్నించారు. కమ్యూనిస్టు దేశమైన చైనాలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను కలిసి చర్చలు జరుపుతున్న సందర్భంగా బినోయ్ విశ్వం గత సంఘటనలను గుర్తు చేశారు. ఆయన ఈ విషయాన్ని 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. చైనా, రష్యాలతో మెరుగైన సంబంధాలు నిర్మించుకోవాలని హితవు చెప్పినందుకుబిజెపి నాయకులు అప్పట్లో తనపై, వామపక్ష ఎంపీలపై తీవ్రస్థాయిలో అరిచి, అవమానపరిచి'చైనా,రష్యా ఏజెంట్లుగా' ముద్రవేశారని గుర్తు చేశారు.'శాంతి,చర్చల కోసం మేం అభ్యర్థించడమే నేరమా' అని బినోయ్ విశ్వం అన్నారు. కేవలం వాదనలు,సంభాషణల కోసమే బిజెపి నాయకులు మమ్ములను లక్ష్యంగా చేసుకున్నారని, బిజెపి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై ఎక్కువ విశ్వాసం ఉంచుతూ వారి నిబద్ధత గతల భారతదేశాన్ని విస్మరిస్తోందని ధ్వజమెత్తారు. మీ సహచరులు చైనారష్యాకు కూడా మద్దతు ఇచ్చారు!. మీరు మా నిబద్ధతను మర్చిపోయారు. 'ట్రంప్‌లో మీరు మీకు రక్షకుడు గానే చూసుకున్నారు' అనిబినోయ్'ఎక్స్'పోస్ట్‌లో రాశారు.

### సెప్టెంబర్ 1 నుంచే అమలులోకి వచ్చిన...

## కొత్త ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం-2025

**హోంమంత్రిత్వ శాఖ నోటిఫికేషన్ వెల్లడి**

**న్యూఢిల్లీ:** భారతదేశం వీడి విదేశాలకి వెళ్లేందుకు, భారతదేశానికివచ్చేందుకు నకిలీ పాస్‌పోర్టు, వీసా సృష్టిస్తేఏమవుతుంది అని లైట్‌గా తీసుకునే వాళ్లకు భారత ప్రభుత్వం చుక్కలు చూపించేందుకు సిద్ధమైంది. భారతదేశం కఠిన నిబంధనలతో కూడిన చట్టాన్ని రూపొందించడమే కాదు అమలు కూడా ప్రారంభించింది. విదేశీయులు, ఇమ్మిగ్రేషన్(వలస)కుసంబంధించిన విషయాలను నియ ం త్రించే కొత్త ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం2025ను సోమవారం (సెప్టెంబరు1) నుంచి అమలులోకి తీసుకొచ్చింది. ఈ నూతన చట్టం ప్రకారం నకిలీ పాస్‌పోర్ట్ లేదా వీసా తీసుకెళ్లినందుకు భారీ శిక్ష విధించే నిబంధనలు ఈ కొత్త ఇమ్మిగ్రేషన్, విదేశీయులచట్టంలో పొందుపరచబడ్డాయి. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల సమయంలో ఈ ఇమ్మిగ్రేషన్, విదేశీయులచట్టం2025ను ఆమోదించగా, 2025 ఏప్రిల్ 4న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తన ఆమోద ముద్ర వేసింది. 'ఇమ్మిగ్రేషన్, విదేశీయుల చట్టం 2025(2025లో 13) సెక్షన్ 1 యొక్క సబ్‌సెక్షన్ (2) ద్వారా కసరత్తు అధికారాలను వినియోగించుకునేలా కేంద్ర ప్రభుత్వం 2025 సెప్టెంబర్ 1ను ఈ చట్టంలోని నిబంధనలు అమలులోకి వచ్చే తేదీగా నియమిస్తుంది' అని హోం మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి నితీష్ కుమార్ వ్యాస్ జారీ చేసిన నోటిఫికేషన్ తెలిపారు. ఈ నూతన చట్టం ప్రకారం ఇకపై భారతదేశంలోకి ప్రవేశించడానికి లేదా దేశంలో ఉండటానికి లేదా దేశం నుండి బయటకు వెళ్లడానికి నకిలీ పాస్‌పోర్ట్ లేదా వీసా కలిగిఉన్నట్లుతేలితే 7ఏళ్ల పాటు జైలుశిక్ష, రూ.10 లక్షల వరకు జరిమానా విధించబడుతుంది. విదేశాలలో ఎక్కువ కాలం ఉంటున్న వారిని ట్రాక్ చేయడానికి వీలుగా హోటళ్లు, విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థలు, ఆసుపత్రులు, నర్సింగ్ హోమ్స్ విదేశీయుల గురించి సమాచారాన్ని తప్పకుండా నివేదించాలని కూడా ఈ చట్టం చెబుతోంది. అన్ని అంతర్జాతీయ విమానయాన సం స్థలు లేదా నౌకలు భారతదేశంలోని ఓడరేవు లేదా ప్రదేశంలో పౌర అధికార సంస్థ లేదా ఇమ్మిగ్రేషన్‌కు ప్రయాణికులు,సిబ్బంది మేనిఫెస్టోను అటువంటి విమానం, నౌక లేదా ఇతర రవాణా విధానంలో ప్రయాణికులు, సిబ్బందిముందస్తు సమాచారాన్ని సమర్పించాల్సి ఉంటుంది. ఈ కొత్త చట్టం ప్రకారం...భారతదేశంలో నివసించడానికి లేదా నిష్క్రమించడానికి నకిలీ లేదా మోసపూరితంగా పొందిన పాస్‌పోర్టు లేదా ఇతర ప్రయాణ పత్రం లేదా వీసాను తెలిసి ఎవరైనా ఉపయోగించినా లేదా సరఫరా చేసినా రెండు సంవత్సరాల కంటే తక్కువ కాకుండా ఏడు సంవత్సరాలకూజైలుశిక్షపొడిగించవచ్చు. రూ. 10లక్షలకంటేతక్కువకాకుండా జరిమానా కూడా విధించబడుతుంది. చెల్లు అయ్యే పాస్‌పోర్టు లేదా ఇతర ప్రయాణ పత్రం లేకుండా భారతదేశంలోని ఏ ప్రాంతానికి ప్రవేశించే విదేశీయుడైనాఅలాంటి ప్రయాణానికి అవసరమైన వీసాతో సహా చట్టంలోని నిబంధనలను ఉల్లంఘించడం,దాని ప్రకారం ఇవ్వబడిన ఏదైనా నియమం లేదా ఉత్తర్వులను ఉల్లంఘించినట్లయితే 5సంవత్సరాల వరకు జైలుశిక్ష లేదా రూ.5లక్షల వరకు జరిమానా లేదా రెండూ విధించబడతాయని నూతన చట్టం తెలియజేసింది.ఏదైనా విదేశీయుడు తరచుగా సందర్శించే ప్రదేశాలపై నియంత్రణను విధించే అధికారాన్ని ఈ కొత్త చట్టం ఇస్తుంది. యజమాని ఆ ప్రాంగణాన్ని మూసివేయాలని, నిర్దిష్ట పరిస్థితులలో ఆ వినియోగాన్ని అనుమతించాలని, అన్ని లేదా నిర్దిష్ట తరగతి విదేయులకు ప్రవేశాన్ని నిరాకరించాలని కోరుతుంది. విదేశీయుల, వలసలకు సంబంధించిన అన్ని విషయాలను నియంత్రించడానికి ఇది సమగ్ర చట్టం. ఇవి ఇప్పటివరకూ అంటే పాస్‌పోర్టు (భారతదేశంలోకి ప్రవేశం) చట్టం, 1920, విదేశీయల రిజిస్ట్రేషన్ చట్టం, 1939, విదేశీయుల చట్టం, 1946 మరియు ఇమిగ్రేషన్ (కెరీర్స్ బాధ్యత) చట్టం 2000 ద్వారా నిర్వహించబడ్డాయి. ఇప్పుడు ఈ చట్టాలన్నీ రద్దు చేయబడ్డాయి.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia
దక్షిణమధ్య రైల్వే టెండరు నోటీసుల వివరాలను మా వెబ్‌సైట్: www.scr.indianrailways.gov.inలో చూడగలరు.

**ఇ-టెండర్ నోటీసు నెం. 30-2025 తేది: 30 / 08 / 2025** PUB/1063

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఇంజనీర్ / కోఆర్డినేషన్ / గుంతకల్ ఈ క్రింది పనులకు ఇ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు. **ముగింపు తేదీ & సమయం: 26.09.2025 15:00 గంటలకు.**

**1. టెండర్ నంబర్:** ఇంజినీరింగ్-జిటిఎల్-నార్త్-1920 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: గూటీ-కుప్పగల్ (యుపి&డిఎన్) :- 90.08 కి.మీ. ఫెన్సింగ్ పొడవు (పిహెచ్-II) కోసం NHAI యాంటీ-క్రాష్ బారియర్/డబ్ల్యూ-బీమ్ స్టీల్ ఫెన్సింగ్ ఉపయోగించి 130 కి.మీ. మరియు అంతకంటే ఎక్కువ ట్రాక్ వెంట భద్రతా ఫెన్సింగ్ ఏర్పాటు. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 30,25,97,405.89 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 16,63,000.00

**2. టెండర్ నంబర్:** ఇంజినీరింగ్-జిటిఎల్-నార్త్-1921 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: గూటీ - వాడి విభాగం (DEN/నార్త్/GTL): 6.1/2 కి.మీ. (ఫేజ్ - II) (ADEN/నార్త్) కోసం 130 కి.మీ. మరియు అంతకంటే ఎక్కువ వేగంతో ట్రాక్ వెంట సరిహద్దు గోడ. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 6,11,42,178.78 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 4,55,700.00

**3. టెండర్ నం.:** Engg-GTL-Central-1922 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: ధోన్ - ABS దశ-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్గ్రేడ్.(1) ఎక్సి కాన్కోర్స్ పునరుద్ధరణ (2) PF 2&3లో కొత్త వెయిటింగ్ హాల్, రిటైరింగ్ గదులు మరియు గ్రానైట్ ఫ్లోరింగ్ ఏర్పాటు (3) ఇరువైపులా సర్క్యులేటింగ్ ప్రాంతాలలో మెరుగుదలలు (4) PF 2 & 3 మరియు 4 & 5 మరియు (5) PF నం.1లో కొత్త ఉన్నత తరగతి వెయిటింగ్ హాల్ COP కేటాయింపు,(6) తక్కువ ఎత్తు ఉన్న పాత కార్యాలయాలను కూల్చివేయడం (రెండు ప్యాకెట్లు)లో. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 11,33,45,544.3 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 7,16,700.00

**4. టెండర్ నెం:** Engg-GTL-West-1923 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: పాకాల: ABS దశ-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్గ్రేడ్. (1) స్టేషన్ భవనం బ్యాలెన్స్ పనులు (2) సర్క్యులేటింగ్ ప్రాంతానికి మెరుగుదలలు, (3) ప్రవేశ ద్వారం ఏర్పాటు, (4) ఐసోలేటెడ్ COP(5) దివ్యాంగ్ టాయిలెట్లు మొదలైనవి. (రెండు ప్యాకెట్). **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 10,52,22,823.7 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 6,76,100.00

**5. టెండర్ నెం.:** ఇంజినీరింగ్-జిటిఎల్-వెస్ట్-1924 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: ధర్మవరం: ABS దశ - II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్‌గ్రేడ్. (1) సర్క్యులేటింగ్ ఏరియాకు ప్రాధాన్యమిచ్చారు, (2) కాన్కోర్స్ ప్రాంతానికి మెరుగుదలలు, (3) అప్రోచ్ రోడ్డు ఏర్పాటు, (4) డ్రైనేజీ ఏర్పాట్లలో మెరుగుదలలు, (5) పూర్తి నిడివి గల పోలీసు అధికారి, (6) పిఎఫ్ నెం.1 & దివ్యాంగ్ టాయిలెట్లలో కొత్త టాయిలెట్ బ్లాక్ (7) కొత్త టిటిఇ స్లీపర్ ఆఫీస్ & మహిళా టిటిఇ విశ్రాంతి గృహం ఉన్నదాన్ని సరిగ్గా కూల్చివేయడం, (8) పిఎఫ్ నెం.1లో (రెండు ప్యాకెట్లు) సమీపంలో కొత్త ఎంట్రీ / ఎగ్జిట్. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 10,57,57,982.25 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.లో) 6,78,800.00

**6. టెండర్ నం.:** Engg-GTL-West-1925 **పని వివరణ:** గుంతకల్ డివిజన్: SWI-పైలర్ - ABS ఫేజ్-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్గ్రేడేషన్(1) ముఖభాగం మెరుగుదలలు (2) కాన్కోర్స్కు ఇంప్రి(3) 2&4 కోసం పార్కింగ్ సదుపాయం వీలర్లు(4) అప్రోచ్ రోడ్లలో ఫుట్‌పాత్‌ల ఏర్పాటు(5) బ్యాలెన్స్ డ్రైనేజీ ఏర్పాట్లు SWII కదిరి: (1) ప్రవేశ ద్వారం ఏర్పాటు, (2) సర్క్యులేటింగ్ ఏరియాకు మెరుగుదలలు మరియు (3) ప్లాట్ఫార్మ టాయిలెట్ల ఏర్పాటు మొదలైన వాటితో స్టేషన్ను అప్‌గ్రేడ్ చేయడానికి ప్రతిపాదించబడింది. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 6,39,18,451.69 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.) 4,69,600.00

**7. టెండర్ నెం.:** ఇంజినీరింగ్-జిటిఎల్-వెస్ట్-1926 **పని వివరణ :** గుంతకల్ డివిజన్: అనంతపురం : ABS దశ-II కింద స్టేషన్ యొక్క ప్రతిపాదిత అప్‌గ్రేడ్.1) పోర్టికో నుండి RBG గదికి Stn భవనం యొక్క కూల్చివేత, 2) PF నంబర్ 1లో హాల్లో ప్రీపెయిడ్ AC ఏర్పాటు, 3) భవనం యొక్క కూల్చివేత భాగంలో ఓపెన్ వెయిటింగ్ హాల్ మరియు PF గోడ ఏర్పాటు, 4) పూర్తి COP మరియు 5) PF నంబర్ 1లో కొత్త టాయిలెట్ బ్లాక్ & GRP సమీపంలోని PF నంబర్ 4లో పాత టాయిలెట్లను కూల్చివేయడం. **ప్రకటించబడిన విలువ (రూ.లో)** 8,89,39,760.01 **ఎర్నెస్ట్ మనీ డిపాజిట్:** (రూ.) 5,94,700.00.

ఏదైనా సవరణ ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది.
**డివిజనల్ రైల్వే మేనేజర్/వర్క్స్/గుంతకల్**

**సవరణ నెం. E-03-CPOH-RYP-2025, తేది: 14.07.2025** PUB/1064

ఇ-టెండర్ నోటీసు కింద ఆహ్వానించబడిన టెండర్ నెం. E-03-CPOH-RYP- 2025. నం. 03/DY.CE/CPOH/RYP/2025, తేది: 14.07. 2025 ఇందుమూలంగా రద్దు చేయబడింది. దయచేసి గమనించండి www.ireps.gov.inలో మా వెబ్సైట్ను సందర్శించండి
**డిప్యూటీ చీఫ్ ఇంజనీర్/CPOH/రాయనపాడు**


### పంజాబ్, హిమాచల్, ఉత్తరాఖండ్‌కు రెడ్అలర్ట్

**న్యూఢిల్లీ:** భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు వాతావరణ శాఖ సోమవారం రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాఖండ్‌లో 48 గంటలపాటు తీవ్రంగా వర్షాలు కురిసే అవకాశమున్నందున ప్రజలు జాగ్రత్తగా ఉండాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి సూచించారు.


**ఓపెన్ ఇ-టెండర్ నోటీసు నెం. DRM/ Works/BZA/19/2025 తేది:29.08.2025** PUB/1062

భారత రాష్ట్రపతి తరపున, సంతకం చేసిన వారు ఈ క్రింది పనుల కోసం 15-00 గంటల వరకు మరియు ప్రతిదానికీ ఎదురుగా పేర్కొన్న తేదీ వరకు E-టెండర్లను ఆహ్వానిస్తారు.

**1. టెండర్ నం.:** E-36-East-BZA-2025 **పని పేరు :** BZA డివిజన్ - ADEN/BVRM సబ్-డివిజన్ కింద SSE/W/BVRM విభాగంలో ఉన్న FOB లకు కనెక్ట్ చేయడానికి TNKU (2 సంఖ్యలు), AKVD (2 సంఖ్యలు) & KKLR (2 సంఖ్యలు) స్టేషన్లలో 6 లిఫ్ట్‌ల ఏర్పాటు. **పూర్తయిన వ్యవధి:** 06 (ఆరు నెలలు) **టెండర్ విలువ (రూ.)** 1,17,88,107/- **ఇఎండి (రూ.)** 4,26,200/- **ముగింపు తేదీ:** 19/09/2025

**2. టెండర్ నంబర్:** E-20-సెంట్రల్-BZA-2025 **పని పేరు:** BZA డివిజన్: GDRBZA సెక్షన్ - SW-I) TRR(P) - 1.706 కి.మీ నుండి కి.మీ: 366.370 - 368.076 ADEN/BPP సబ్-డివిజన్లోని APL-NDO మధ్య కట్ & కనెక్షన్ ద్వారా డౌన్ లైన్ నుండి అప్ లైన్‌కు కొత్త డైవర్షన్ కోసం. SW-II) TRR(P) - 1.700 కి.మీ నుండి కి.మీ: 364.670 - 366.370 ADEN / BPP సబ్-డివిజన్లోని APL-NDO మధ్య కట్ & కనెక్షన్ ద్వారా డౌన్ లైన్ నుండి అప్ లైన్‌కు కొత్త డైవర్షన్ కోసం. (DEN/సెంట్రల్/BZA అధికార పరిధి). **పూర్తయిన వ్యవధి:** 06 (ఆరు నెలలు) **టెండర్ విలువ (రూ.)** 1,59,24,417/- **ఇఎండి (రూ.)** 2,29,600/- **ముగింపు తేదీ:** 24/09/2025

**3. టెండర్ నం.:** E-21-Central-BZA-2025 **పని పేరు:** SW I: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ADEN/BPP సబ్ డివిజన్ కింద SSE/W/BPP విభాగంలోని బాపట్ల స్టేషన్ వద్ద PF నం.4 & 5లో లిఫ్ట్ ఏర్పాటు కోసం బ్యాలెన్స్ పని. SW II: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ADEN/BPP సబ్ డివిజన్ కింద SSE/వర్క్స్/BPPవిభాగంలోని ప్లాట్‌ఫారంలపై చిరాలా స్టేషన్ వద్ద ఎస్కలేటర్ల ఏర్పాటు కోసం బ్యాలెన్స్ పని (3 సంఖ్యలు). SW III: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ADEN/EE సబ్-డివిజన్ కింద SSE/వర్క్స్/EE విభాగంలోని ప్లాట్‌ఫారంలపై ఏలూరు స్టేషన్లో (2 సంఖ్యలు) ఎస్కలేటర్ల ఏర్పాటు. SW IV: అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ADEN/BPP సబ్-డివిజన్ కింద SSE/వర్క్స్/TEL విభాగంలోని ప్లాట్‌ఫారంలపై తెనాలి స్టేషన్లో (3 సంఖ్యలు) ఎస్కలేటర్ల ఏర్పాటు. **పూర్తయిన కాలం :** 12 (పన్నెండు నెలలు ) **టెండర్ విలువ (రూ.)** 1,47,62,141/- **ఇఎండి (రూ.)** 2,23,800./- **ముగింపు తేదీ:** 24/09/2025

**4. టెండర్ నం.:** E-16-బ్రిడ్జెస్-BZA-2025 **పని పేరు :** BZA డివిజన్: BZAVSKP విభాగం: ADEN/Br/N/BZA అధికార పరిధిలోని SSE/Br/I/RJY&SSE/Br/II/RJY విభాగం సుందర్ ADEN/Br/N/BZA అధికార పరిధిలోని సెక్షనల్ వంతెనల మెటలైజేషన్. **పూర్తయిన కాలం :** 12 (పన్నెండు నెలలు) **టెండర్ విలువ (రూ.)** 2,16,66993/- **ఇఎండి (రూ.)** 258300/- **ముగింపు తేదీ:** 24/09/2025

1) టెండర్ నిబంధనలు / పూర్తిగా పని పేరు వివరాలు, పైన పేర్కొన్న పనుల సారూప్యత, అర్హత ప్రమాణాలు మొదలైన వివరాలు www.ireps.gov.in వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో అందుబాటులో ఉన్నాయి.
2) కాబోయే టెండరుదారులు ఏదైనా టెండర్‌కు సంబంధించిన ఏవైనా మార్పులు / సవరణను గమనించడానికి టెండర్ ముగింపు తేదీకి ముందు www.ireps.gov.in వెబ్సైట్‌ను సందర్శించాలని సూచించారు.
3) టెండర్ నోటీసు విజయవాడ డివిజన్లోని డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), ఎస్.సి.రైల్వే, విజయవాడ మరియు ADEN సబ్-డివిజనల్ కార్యాలయాలలో ఉన్న నోటీసు బోర్డులో కూడా ప్రదర్శించబడుతుంది, దీనిని చూడవచ్చు.
4) ఎటువంటి కారణం చూపకుండా టెండర్‌ను రద్దు చేసే హక్కు రైల్వేకు ఉంది.

**డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), విజయవాడ**
A1325

మరిన్ని టెండర్ షరతులు / వివరాల కోసం మరియు టెండర్ పత్రాలను డౌన్‌లోడ్ చేసుకోవడానికి, దయచేసి http://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించండి.


## రూ.141 కోట్లు కట్టాలని ఆదాయపు పన్ను నోటీస్

**కిరాణా షాపు యజమాని షాక్!**

**బులంద్‌షహర్ :** సామాన్యుల పేరిట వేలు, లక్షలాది రూపాయల ఇన్కమ్ టాక్స్ నోటీసులు రావడం గురించి మనం తరచూ వింటూ ఉంటాం. అచ్చం అలాంటిదే ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్ జిల్లాలో జరిగింది. ఓ సామాన్య కిరాణా షాపు యజమానికి వేలు, లక్షలు కాదు ఏకంగా రూ.141 కోట్లు చెల్లించాలంటూ ఇన్కమ్ ట్యాక్స్ నోటీసు వచ్చింది. దీనితో అతను ఒక్కసారిగా షాక్‌లోకి వెళ్లిపోయాడు. సాంకేతికత పెరుగుతున్న కొలది సామాన్య ప్రజల ఆధార్, పాన్ కార్డులను ఉపయోగించి మోసాలకు పాల్పడుతున్న కేసులు బాగా పెరిగిపోతున్న విషయం తెలిసిందే. ఇప్పుడు ఇలాంటిదే తమ ఊళ్లోని కిరాణాషాపు యజమానికి జరగడంతో, కొత్వాలి ప్రాంతంలోని నాయగంజ్ ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. మొదట్లో పోలీసులు కూడా దీనిని నమ్మకపోవడం గమనార్హం. బులందర్ షహర్ జిల్లాలోని కొత్వాలి గ్రామానికి చెందిన సుధీర్ ఒక సాధారణ కిరాణా దుకాణం యజమాని. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇది ఇలా ఉండగా, ఒక రోజు సుధీర్ గుప్తాకు ఆదాయ పన్ను శాఖ నుంచి నోటీసు వచ్చింది. అందులో సుమారు రూ. 141,38,47,126 మేర పన్ను ఎగవేసినట్లు ఉంది. దానిని గడువులోగా ఆదాయ పన్ను శాఖ వారికి చెల్లించాలని అందులో ఉంది. దీనితో అతని కింద భూమి కంపించినట్లు అయ్యింది. ఒక్కసారిగా షాక్‌లోకి వెళ్లిపోయాడు. ఎందుకంటే ఒక సామాన్య కిరాణా దుకాణం నడుపుకుంటున్న వ్యక్తికి అన్ని కోట్ల రూపాయల మేర లావాదేవీలు చేయడం ఎలా సాధ్యం. అందుకే ఇన్కమ్ ట్యాక్స్ నోటీస్‌ను చూసి సుధీర్ గుప్తా ఒక్కసారిగా షాక్ అయ్యారు. ఆ తరువాత కాస్త తేరుకుని, ఆ నోటీసు చదివితే అందులో తన పాన్ కార్డును ఢిల్లీలోని 6 కంపెనీలు వాడుతున్నట్లు సుధీర్ గుర్తించారు. అంతేకాదు ఆ కంపెనీలు ఉపయోగిస్తున్న బ్యాంకు ఖాతాలు తనవి కాదని తెలుసుకున్నాడు. దీనితో అతను కొత్వాలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మొదట్లో దీనిని పోలీసులు కూడా నమ్మలేకపోయారు. కానీ బాధితుడు చూపించిన ఇన్కమ్ ట్యాక్స్ నోటీసులు చూసి, వారు కూడా ఆశ్చర్యపోయారు. బాధిత వ్యక్తికి తెలియకుండా, అతని పాన్ కార్డును వినియోగిస్తున్న ఆరు కంపెనీలపై కేసు నమోదు చేశారు.

### మరాటా కోటా ఆందోళనలతో..

## ముంబయి స్తంభించింది

**పరిస్థితిని చక్కదిద్దేందుకు అన్ని వీధులను ఖాళీ చేయాలని నిరసనకారులకు హైకోర్టు ఆదేశం**


**ఉద్యమనేత జరంగే నిరాహారదీక్షతో పరిస్థితి దారుణంగా మారిందని వ్యాఖ్య**



ముంబయి: మరాఠా కోటా ఆందోళన కారణంగా ముంబయి నగరం స్తంభించిపోయిందని, రిజర్వేషన్ ప్రచారకర్త మనోజ్ జరంగే దీక్షలో భాగంగా నాలుగో రోజు పచ్చి నీటిని కూడా తీసుకునేందుకు నిరాకరించడంతో పరిస్థితి దారుణంగా మారిందని బాంబే హైకోర్టు సోమవారం పేర్కొంది. నిరసన శాంతియుతంగా లేదని, ఆందోళనకు ముందు ఉన్న అన్ని పరిస్థితులను ఉల్లంఘించిందని గమనించిన హైకోర్టు, ముంబయిలో సాధారణ పరిస్థితులు పునరుద్ధరించాలని కోరిం ది. పరిస్థితిని చక్కదిద్దేందుకు అన్ని వీధులను ఖాళీ చేయాలని ఆందోళనకు నాయకత్వం వహించిన జరంగే, అతని మద్దతుదారులకు మంగళవారం మధ్యాహ్నం నాటికి అవకాశం ఇచ్చింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి ముంబయికి వచ్చిన ఆందోళనకారులుఆక్రమించిన వీధులను ఎందుకు తొలగించడం లేదని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మరికొంతమంది నిరసనకారులు మహానగరంలోకి ప్రవేశించకుండా చూసుకోవాలని ఆదేశించింది. కోటా ఆందోళన, దాని పర్యవసానాలను హైకోర్టులో వాదించబడుతున్నప్పటికీ, 43ఏళ్ల కార్యకర్త పట్టు విడవకుం డా సంఖ్యాపరంగా బలంగా ఉన్న మరాఠా సామాజికవర్గానికి కోటా డిమాండ్లను ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ వినకపోతే ఐదు కోట్లకు పైగా మరాఠాలు మహానగరంలోకి వస్తారని హెచ్చరించారు. ప్రతిష్టంభన మధ్య మరాఠా రిజర్వేషన్లపై క్యాబినెట్ సబ్‌కమిటీకి నాయకత్వం వహిస్తున్న సీనియర్ మంత్రి రాధాకృష్ణ విఖే పాటిల్ ప్రకటన చేస్తూ మహాయుతి ప్రభుత్వం న్యాయస్థానంలో నిలబడేపరిష్కారం కోసం పనిచేస్తోందని చెప్పారు. కాగా, ఇతర వెనుకబడిన తరగతుల (ఒబిసి) కేటగిరీ కింద ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యలో మరాఠా సామాజికవర్గానికి10శాతం రిజర్వేషన్లు డిమాండ్ చేస్తూ శుక్రవారం (ఆగస్టు 29) నుండి జరంగే ఆజాద్ మైదాన్‌లో నిరాహార దీక్ష చేస్తున్నారు. సోమవారం నుండి ఆయన మంచినీటిని కూడా తీసుకోవడం నిలిపివేసినట్లుమద్దతుదారులు పేర్కొన్నారు. అయితే నిరసనకారులు ఆజాద్ మైదానంలోనే కాకుండా దక్షిణ ముంబయిలోని అనేక ముఖ్య ప్రాంతాలను దిగ్బంధించారని ప్రత్యేక విచారణలో జస్టి స్ రవీంద్ర ఘుగే, గౌతమ్ అంఖద్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్, చర్చిగేట్ రైల్వే స్టేషన్లు, మెరైన్ డ్రైవ్ ప్రొమెనేడ్, హైకోర్టు భవనం వంటి ముఖ్యమైన ప్రదేశాలలో నిరసనకారులు గుమిగూడారని తెలిపింది. ఆందోళనశాంతియుతంగాజరగడంలేదని, ఆజాద్ మైదాన్‌లో శాంతియుత నిరసన నిర్వహించడానికి అనుమతి ఇచ్చినప్పుడు అధికారులు విధించిన ప్రతి షరతునుజరంగే,నిరసనకారులు ఉల్లంఘించారని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. జరంగే పేర్కొన్నట్లుగాఇకపై నిరసనకారులు ఎవరూ నగరంలోకి ప్రవేశించకుండా ప్రభు త్వం చూసుకోవాలని ఆదేశించింది. తదుపరి విచారణకు మంగళవారం వాయిదా వేస్తూ, అప్పటిలోపు జరంగే ఆరోగ్యం మరింతదిగజారితే,ప్రభుత్వం అతనికి వైద్య సహా యం అందించాలని ధర్మాసనం పేర్కొంది. లక్షలాది మంది నిరసనకారులు వస్తారని జరంగే ప్రకటన చేస్తే, రాష్ట్ర ప్రభుత్వం పరిస్థితిని ఎలా ఎదుర్కోవాలని యోచిస్తోందని కోర్టు ప్రశ్నించింది.

### ప్రాంతీయ,ప్రపంచ స్థిరత్వం,శాంతికి

## భారత్–రష్యా బంధం మూలస్తంభం



**తియాన్‌జిన్‌లో పుతిన్–మోదీ ద్వైపాక్షిక చర్చలు**

**డిసెంబరులో పుతిన్ భారత్ పర్యటన!**

**తియాన్‌జిన్:** దశాబ్దాలుగా భారత్–రష్యా మధ్య కొనసాగుతున్న మైత్రీబంధాన్ని ఇరు దేశాల అగ్రనాయకులు పునరుద్ఘాటించారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఓ) 25వ వార్షికోత్సవ సదస్సు సందర్భంగా చైనా పురపాలక నగరం తియాన్‌జిన్‌లో భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ, రష్యా అధ్యక్షుడు పుతిన్ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. చర్చల సందర్భంగా మోదీని పుతిన్ ''డియర్ ఫ్రెండ్'' అని సంబోధించి ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో భారత్‌కు రక్షణ కవచంగా ఉన్నట్లు పరోక్షంగా చెప్పారు. సదస్సు ప్రాంగణంలో చైనా అధ్యక్షుడు జీ జిన్ పింగ్‌వెంటపుతిన్–మోదీభుజం భుజం కలిపి ముందుకు నడిచారు. ఈ దృశ్యాలను అంతర్జాతీయ మీడియా ప్రముఖంగా చూపించింది. సోమవారం ఎస్‌సిఓ సదస్సు పూర్తయిన తర్వాత జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో కూడా మోదీ దీనినే ప్రతిబింబిస్తూ, ''ఎంతో సంక్లిష్ట సమయాలలో కూడా భారత్–రష్యా ఎల్లప్పుడూ భుజం భుజం కలిపి నడిచాయి''అనిపుతిన్‌తోఅన్నారు. ఆర్థికరంగంలో ద్వైపాక్షిక సహకారం, పెట్టుబడులు, ఇంధన రంగంలో సహకారాలను మరింత విస్తరించడంపైనే చర్చల్లో ప్రధానంగా పుతిన్–మోదీ దృష్టి కేంద్రీకరించారు. అదేవిధంగా డిసెంబరులో పుతిన్ భారతదేశ పర్యటన గురించి కూడా ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. 140 కోట్ల మంది భారతీయులు మీకు స్వాగతం పలికేందుకు ఎంతో ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని చెప్పారు. భారత్–రష్యా ద్వైపాక్షిక సంబంధాలను ప్రత్యేక ప్రాధాన్యత గల వ్యూహాత్మక భాగస్వామ్యస్థాయికి పెంచేవిధంగా రెండు దేశాలు ఒక ఉమ్మడి ప్రకటన విడుదల చేసి ఈ ఏడాది డిసెంబరు 21వ తేదీ నాటికి 15 సంవత్సరాలు పూర్తవుతాయి. ఆ సమయానికి పుతిన్ భారత్ పర్యటన చేస్తారని భావిస్తున్నారు. ''ప్రత్యేక,ప్రాధాన్యతగల ఎంతో లోతుగా వేళ్ళూనుకున్న మన వ్యూహాత్మక భాగస్వామ్యానికి ఇది ప్రతిబింబం, ఈ పర్యటన ఒక ప్రత్యేక అవకాశం,సంక్లిష్ట సమయాలలో కూడా మన రెండు దేశాలు ఎల్లప్పుడూ కలిసే ముందుకు నడిచాయి'' అన్నారు. ''మన సన్నిహిత సహకారం రెండు దేశాల ప్రజలకు మాత్రమే ముఖ్యం కాదు, ప్రపంచశాంతికి, స్థిరత్వానికి, ప్రపంచ సౌభాగ్యానికి కూడా ఎంతో ముఖ్యం'' అని పుతిన్‌కు మోదీ చెప్పారు. పుతిన్ కూడా చర్చల్లో మాట్లాడుతూ, ఇరు దేశాలూ వ్యూహాత్మక భాగస్వామ్య సూత్రాలద్వారా సహకారాన్ని ప్రోత్సహిస్తాయన్నారు.సూత్రాల ఆధారంగానే రెండు దేశాలమధ్యా బ హుముఖరంగాలలోబంధంబలోపేతంఅవుతోందన్నారు.

**త్వరగా ఉక్రేన్ యుద్ధం ముగించే మార్గం చూడండి : మోదీ**

ఉక్రేన్‌లో శాంతి సాధనకు ఇటీవల జరిగిన అన్ని ప్రయత్నాలను పుతిన్‌తో చర్చల సందర్భంగా మోదీ ప్రస్తావించారు. యుద్ధ విరమణకు జరుగుతున్న కృషిపట్ల మోదీ హర్షం ప్రకటించారు. ఉక్రేన్‌తో శత్రుత్వాన్ని ముగించి, యుద్ధం విరమించేందుకు వీలైనంత త్వరగా ఒక మార్గాన్ని కనుగొనాలని ఆయనకు మోదీ విజ్ఞప్తి చేశారు. వీలైనంత త్వరగా శత్రుత్వాలకు తెరదించేందుకు ఒక మార్గం కనుగొనాలనేది మానవాళి ఇస్తున్న పిలుపుగాపేర్కొన్నారు. ''ఉక్రేన్‌లో కొనసాగుతున్న యుద్ధంపై మేం రోజువారీ చర్చలు చేస్తున్నాం, శాంతి సాధనకోసం ఇటీవల జరిగిన అన్ని ప్రయత్నాలనూ మేం స్వాగతిస్తున్నాం, దీనితో ముడిపడి ఉన్న వారంతా రాబోయేకాలంలో నిర్మాణాత్మకంగా ముందుకు వెళతారన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం, శాశ్వత శాంతి సాధనకు ఒక మార్గం కనుగొనాల్సి ఉంది, ఇది యావత్ మానవాళి ఆకాంక్ష'' అని మోదీ చెప్పారు. ఈ ద్వైపాక్షిక సమావేశానికి ముందుగా గడచిన శనివారం మోదీకి ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ ఫోన్‌చేసి పుతిన్‌తో సంభాషణల్లోయుద్ధం విరమించేందుకు కృషి చేయాలని కోరారు. భారత్ ఈ విషయంలో సహకరించాలని కోరారు. ఈ విషయాన్ని కూడా పుతిన్‌వద్ద మోదీ ప్రస్తావించారని తెలుస్తున్నది. ప్రపంచంలో అతిపెద్ద చమురు ఎగుమతి దేశాల్లోరెండోస్థానంలోఉన్నరష్యాకుచైనా,భారత్ రెండూ అతిపెద్ద కొనుగోలుదారులుగా ఉన్నాయి. ఈ వాణిజ్య బంధాన్నితెంచేందుకు టారిఫ్‌ల భారంతో డోనాల్డ్ ట్రంప్ ప్రయత్నాలు చేస్తున్న తరుణంలో ఎస్‌సిఓ సదస్సులో జిన్‌పింగ్,పుతిన్,మోదీల కలయిక సందడి, ముఖాముఖీ భేటీలపరిణామాలుఅమెరికాకుచెంపపెట్టుగా మారాయి.

**ఒకే కారులో వెళ్ళేందుకు మోదీకోసం 10 నిమిషాలు ఎదురుచూసిన పుతిన్**

నాయకులు ఇద్దరూ అధికారికంగా ద్వైపాక్షిక సమావేశం జరపడానికి ముందుగా, లాంఛనపూర్వకంగా సంభాషణ జరిపారు. సోమవారం అధికారికంగా జరిగిన ఎస్‌సిఓ సదస్సు ప్రారంభానికి ముందుగా నాయకులు అందరూ ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. పుతిన్–మోదీ ఆలింగనం చేసుకుని పలకరింపులు పూర్తయ్యాక సదస్సు ప్రారంభమైంది. సదస్సు అనంతరం వారిద్దరూ ద్వైపాక్షిక చర్చలు జరిపే ప్రాంగణానికి వెళ్ళేందుకు ఒకే కారులో ప్రయాణం చేశారు. మోదీ,పుతిన్ వేరు వేరు కార్లలో ప్రయాణం చేయకుండా ఒకే కారులో పక్కపక్కనే కూర్చుని ప్రయాణించారు. ఈ విషయాన్ని సోషల్ మీడియా ద్వారా మోదీ ప్రత్యేకంగా అందరికీ తెలియజేశారు. రెండు దేశాల నాయకుల మధ్యా సంబంధాలు, చర్చలు ఎప్పుడూ ఎంతో లోతుగా ఉభయతారకంగా జరుగుతాయని ట్విట్టర్‌లో రాశారు. పుతిన్‌తో చర్చలు అద్భుతంగా జరిగాయన్నారు. ఐతే పుతిన్ కారు దగ్గరకు చేరుకునేందుకు మోదీకి కొంత ఆలస్యమైంది. కానీ పుతిన్ తనొక్కరే కారులో ద్వైపాక్షిక సమావేశ ప్రాంగణానికి వెళ్ళిపోకుండా 10 నిమిషాల సేపు మోదీకోసం ఎదురుచూశారు. మోదీ వచ్చిన తర్వాత ఇద్దరూ కలిసి కారు ఎక్కి పక్కపక్కనే కూర్చుని చర్చల ప్రాంగణానికి చేరుకున్నారు. అన్నింటికంటే ముఖ్యమైన విషయం మరొకటి ఏమిటంటే, కారులో ప్రయాణం చేసి చర్చల ప్రాంగణానికి చేరుకున్న తర్వాత కూడా వారిద్దరూ మరో 45 నిమిషాలపాటు గడిపారని ఈ విషయాన్ని సన్నిహితంగా పరిశీలించినవారు పేర్కొన్నారు. 3000 మంది పాత్రికేయులు, మీడియా సిబ్బంది ప్రత్యేకదృష్టి కేంద్రీకరించారు.

ప్రజాపక్షం
మంగళవారం, 02 సెప్టెంబరు

# సరైన దిశలో మోదీ–జిన్‌పింగ్ చర్చలు

చైనాలోని తియాన్‌జిన్‌లో షాంఘై సహకార సంస్థ (ఎస్‌సిఒ) అగ్రనాయక సమావేశం సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య ఆదివారం జరిగిన సంభాషణలు సానుకూల దృక్పథంతో సంబంధాల వృద్ధి దిశలో ఉండటం హర్షించదగింది. ఈ ఇరుగుపొరుగు దేశాల అధినేతలు 7 సంవత్సరాల తదుపరి ముఖాముఖీ చర్చలు జరిపారు. 2020లో గాల్వాన్‌లో సరిహద్దు ఘర్షణల దరిమిలా ఇరుదేశాల మధ్య పూర్తిగా క్షీణించిన సంబంధాలు, గత సంవత్సరం కజాన్‌లో వారిరువురి భేటీ తర్వాత వేగంగా మెరుగుపడుతున్నాయి. అందువల్ల సరిహద్దు సమస్య పరిష్కారానికి కృషి కొనసాగిస్తూనే, వాణిజ్యం, పెట్టుబడులు, ప్రజల మధ్య సంబంధాలను ఆ సమస్యతో ముడిపెట్టకూడదని నిర్ణయించారు. అయితే సరిహద్దు వెంట ప్రశాంతతకుగల ప్రాముఖ్యతను వారు విస్మరించలేదు.

అధ్యక్షుడు ట్రంప్ వాణిజ్య యుద్ధం నేపథ్యంలో ప్రస్తుత చర్చలు జరిగాయి. ఆసియాలో ఏ దేశంపై లేనంతగా భారత్‌నుంచి దిగుమతులపై 50శాతం సుంకాలు విధించటం తెలిసిందే. ఆ తర్వాత భారత విదేశాంగ విధానంలో మార్పు వచ్చిందన్న భావన లేకపోలేదు. మోదీ గత కొద్ది సంవత్సరాలుగా అమెరికా విదేశాంగ విధానంతో భారత్ వైఖరులను జతచేశాడన్న భావన వర్ధమాన ప్రపంచంలో లేకపోలేదు. ఆకస్మిక నిర్ణయాలు తీసుకునే ట్రంప్ భారత్‌పై విధించిన సుంకాలు తగ్గిస్తే, రష్యన్ ఆయిలు కొంటున్నందుకు విధించిన 25 శాతం పెనాల్టీ ఎత్తివేస్తే మోదీ వైఖరి మారుతుందా అనే సందేహాలు లేకపోలేదు. అయితే 'వ్యూహాత్మక స్వయం ప్రతిపత్తి'ని మోదీ–జిన్‌పింగ్ గుర్తించటం, రెండు దేశాల మధ్య సంబంధాలను మూడవదేశం కళ్లద్దాలనుంచి చూడరాదన్న నిర్ణయాన్ని చిత్తశుద్ధితో అమలు చేస్తే అపోహలకు, అపార్థాలకు అవకాశాలు తగ్గుతాయి. పోటీదారులుగా గాక భాగస్వాములుగా పరస్పరం పరిగణించుకోవాలని భావించారు.

దక్షిణ చైనా సముద్రంలో చైనాను నియంత్రించేందుకు అమెరికా ఏర్పాటు చేసిన క్వాడ్‌లో భారత్ సభ్యురాలిగా ఉండటం భారత్–చైనా మధ్య సంబంధాల మెరుగుదలకు పెద్ద అవరోధంగా ఉంది. అయితే ప్రతి ఒక్క దేశం 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి' కలిగి ఉంటుందని జిన్‌పింగ్ అంగీకరించటం మోదీకి ఊరట ఇచ్చింది. ఎందుకంటే ఈ ఏడాది చివర క్వాడ్ అగ్రనాయక సమావేశానికి మోదీ ఆతిథ్యం ఇవ్వాల్సి ఉంది. అయితే ట్రంప్ ఈ సమావేశానికి రావటం లేదని ప్రకటించటం, జపాన్ లాంటి మూడో దేశంలో ఆ సమావేశం జరగవచ్చన్న వార్తలు మోదీకి నెత్తిమీద పాలుపోసిన చందమైంది. భారత్, చైనాలు స్వతంత్ర విదేశాంగ విధానాన్ని వక్కాణించినందున ఇండియా క్వాడ్‌లో కొనసాగుతూనే అదే సమయంలో చైనా, రష్యాలతో సంబంధాలు కొనసాగించే సౌలభ్యం ఏర్పడింది. చైనాకు నేరుగా విమాన సర్వీసులు నడపటం, చైనీయులకు టూరిస్టు వీసాలను మరింత సులభతరం చేయటం, మానస సరోవర్ యాత్రకు చైనా అనుమతించటం, పరస్పరం జర్నలిస్టులను నియమించుకోవటం ఈ చర్చల సానుకూల ఫలితాల్లో ఉన్నాయి. చైనా పెట్టుబడులను భారత్ అనుమతించటం, భారత్‌నుంచి వ్యవసాయోత్పత్తులు, తయారీ వస్తువుల దిగుమతిని చైనా పెంపుచేయటం పరస్పర వాణిజ్యాభివృద్ధిలో ఉభయతారకంగా ఉంటుంది.

టెర్రరిజంపై వైఖరుల్లో తేడాలు ఇరుదేశాల మధ్య మరో వివాదాంశం. అయితే ఎస్‌సిఒ సంయుక్త ప్రకటన పహల్గాం హత్యలను ప్రస్తావించింది, వాటిని ప్రోత్సహించిన వారిపై చర్యలను కోరటం విశేషం. పాకిస్థాన్ పేరు ఎత్తుకపోయినా, తీర్మానంలోని భాష ఎస్‌సిఒ రక్షణ మంత్రుల ప్రకటనకన్నా పదునుగా ఉంది. ఆ ప్రకటనపై మన రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సంతకం చేయలేదు.

భారత్, చైనాల మధ్య ద్వైపాక్షిక సంబంధాల మెరుగుదల ఇప్పుడు ప్రారంభమవుతుంది, ప్రజలమధ్య సంబంధాలు మొదలవుతాయి. ప్రధాని మోదీ అమెరికా పట్ల మొగ్గు తగ్గించి విదేశాంగ విధానంలో 'వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి'ని కచ్చితంగా పాటిస్తే అమెరికా, రష్యా, చైనాలతో ఏకకాలంలో వ్యావహారిక సంబంధాలు నెరపటం సాధ్యమే!

# ప్రజలు కమ్యూనిస్టుల అవసరం గుర్తిస్తున్నారు

తమదాకా వస్తే కానీ విలువ తెలియదన్నట్లు ఇప్పుడు పెట్టుబడిదారి మతోన్మాదశక్తులు పెచ్చరిల్లుతూ ప్రజల జవజీవాలను శాసించేందుకు ప్రయత్నిస్తు న్న వేళ వీటిని ఎదుర్కొనేందుకు ఓ శక్తి అవసరం అన్న భావన రోజు రోజుకు బలపడుతుంది. కార్పొరేట్లు, మతోన్మాదులు, నయా పెట్టుబడిదారి వర్గా లు హక్కులను, ఆస్తులను, స్వేచ్ఛను హరించేందుకు బరితెగించిన సమయంలో వీళ్లను నిలువరించగలిగేది కమ్యూనిస్టులు మాత్రమేనన్న మాటలు ఇప్పుడు సర్వత్రా వినపడుతున్నాయి. ఒకప్పటి కమ్యూనిస్టు కుటుంబాల నేపథ్యం ఉన్నవారో, అభ్యుదయ వాదులో, అధికారం కోసం కమ్యూనిస్టులను కోరుకుంటున్న వారో అంటే చర్చనీయాంశం కాదు. బూర్జువా రాజకీయ పార్టీలలో పుట్టి అదే రాజకీయాలలో కొనసాగుతున్న వారు, పెట్టుబడి దారి వారసత్వం కలిగిన వారు, గతంలో ఎన్నడు కమ్యూనిస్టులతో సన్నిహిత్యం లేని వారు, కొద్దో, గొప్పో ప్రజల పక్షాన ఆలోచించే వారు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారు. అంతే కాదు కమ్యూనిస్టుల అవసరాన్ని ఆయా సందర్భాలలో ప్రజలకు విడమడిచి వివరిస్తున్నారు. ఇష్టాను సారంగా లంచాలు తీసుకుంటూ పైసలు ఇస్తే తప్ప పనులు చేయని అధికారులను చూసిన ప్రతిసారి సామాన్యుడు సైతం కమ్యూనిస్టులు బలంగా ఉంటే అధికారులు ఇలా బరితెగించే వారా, ఇలా జరగనిచ్చే వారా అని మదనపడుతున్నాడు.

కమ్యూనిస్టులు బలంగా ఉంటే యూరియా కొరత గురించి ఎంతగా కొట్లాడే వారు రాష్ట్రమే స్తంభించేది అంటూ యూరియా కోసం క్యూలో నిలబడ్డ రైతు ఆవేదనతో కమ్యూనిస్టులను గుర్తు చేసుకుంటున్నాడు. కమ్యూనిస్టులంటే ద్వేషభావంతో చూసిన వారు సైతం ఇప్పుడు కమ్యూనిస్టులను గుర్తు చేసుకుం టూ వారుంటే బాగుండేదన్న భావన వ్యక్తపరుస్తున్నారు. అవకాశవాద రాజకీయాలకు పెటెంట్‌గా చెప్పుకునే అనేక మంది నేతలు సైతం కమ్యూనిస్టులు బలంగా ఉంటే బాగుంటుందన్న భావనకు రావడంతో పాటు రాజకీయాలు బాగుండేవి అంటుండటం విశేషం. నక్సల్స్ ఉన్నప్పుడు లేచింది మొదలు వారి వినాశనాన్ని కోరుకున్న వారు నయా అవకాశవాదులను చూసి నక్సల్స్ ఉంటే వీళ్ల పని ఇంత జోరుగా ఉండేదా అంటున్నారు. అధికారులపై రాజకీయ ఒత్తిడి పెరిగి స్వేచ్ఛగా విధులు నిర్వర్తించలేక సామాన్యుడి ఆవేదనను విని కనీసం ఏ సహాయం చేయలేని నిస్సహాయస్థితిలో గ్రామ పంచాయతీ కార్యదర్శి చేయాల్సిన పని గురించి ఉన్నతాధికారికి అమాత్యులు ఫోన్ చేసినప్పుడు ఆ అధికారి మదిలోనూ కమ్యూనిస్టుల అవసరం మెదులాడుతుంది. ఒక్క మతోన్మాద శక్తులు వారి అండతో లక్షల కోట్లు ప్రజా ధనాన్ని దోపిడీ చేసిన వారు రాజకీయాలను ఆదాయ మార్గాలుగా ఎంచుకుని కోట్లకు పడగలెత్తిన వారు తప్ప మిగిలిన వారు ప్రస్తుత పరిస్థితుల్లో కమ్యూనిస్టులు ఉండాలి అని బహిరంగంగా వ్యాఖ్యానిస్తున్నారు. కొందరైతే గొంతెత్తి అరుస్తున్నారు. కమ్యూనిస్టులను బలపర్చండి అని పిలుపునిస్తున్నారు.

కమ్యూనిస్టులు ఈ అవసరాన్ని అందిపుచ్చుకోవాలి . ప్రజలు ఏమి కోరుకుంటున్నారో ఆ దిశగా ఆలోచనలు చేయడం చైతన్యవంతుల లక్షణం. కొన్ని చోట్ల సమాజాన్ని, రాజకీయాలను ప్రభావితం చేస్తూ మరికొన్ని చోట్ల ఉనికిని చాటుకున్న కమ్యూనిస్టులు రాజకీయ, సైద్ధాంతిక అవగాహనను ప్రజలకు కల్పించాలి. విరివిగా సభలు, సమావేశాలు, సదస్సులు నిత్య సంబంధాలతో ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ఎన్నికల్లో డబ్బులు అలవాటు చేసిన బూర్జువా పార్టీలు ఎన్నికల రీత్యా కమ్యూనిస్టులను బలహీన పరిచాయి. ఎన్నికల నాటి లాభమే చూసుకున్నారే తప్ప తర్వాతి పరిణామాలను ప్రజలు ఆలోచించ లేదు. ఇప్పటికీ మెజార్టీ ప్రజల మదిలో నష్టపోయామన్న ఆలోచన పురుడు పోసుకోలేదు. కమ్యూనిస్టులు ప్రజలను చైతన్యపరచాలి. సుదీర్ఘ రాజకీయ ప్రయాణం, ఉన్నత లక్ష్య సాధనలో ఎన్నికలే సర్వస్వం కాదని అది ఒక భాగమేనన్న ఆలోచన ముందుగా కమ్యూనిస్టు నాయకుల్లో బలపడాలి. గెలుపు లేని ఓటమితో ఎలా పనిచేస్తామన్న నైరాశ్యాన్ని వీడి ప్రజల్లోకి వెళ్లి ప్రజలతో ఓట్ల వేళ పెరిగిన దూరాన్ని ఓటు లేని సమయంలో దగ్గర చేసుకోవాలి.

రాజకీయ అవగాహనను కల్పిస్తూనే స్థానిక సమస్యలను గుర్తించడం వాటి పరిష్కారానికి మార్గాలను అన్వేషించడం కమ్యూనిస్టుల బలోపేతం కోరుకునే వారి లక్ష్యం కావాలి. దూరంగా వందమంది మరణించిన ఘటన కంటే స్థానికంగా ఒకరికో ఇద్దరికో ప్రమాదం జరిగితే స్థానిక ప్రమాదంపైనే ప్రజల ఆలోచన ఉంటుందన్న దాని ని ప్రామాణికంగా తీసుకుని మతోన్మాద ప్రమాదం జాతీయ, అంతర్జాతీయ పరిస్థితులను వివరిస్తూనే స్థానిక సమస్యలకు అత్యంత ప్రాధాన్యతనివ్వాల్సి ఉంది. అందుకు కమ్యూనిస్టు పార్టీలు ఒక కార్యాచరణను రూపొందించుకోవాలి. స్థానిక సమస్యలపై స్పందన పెరగాలి. ఒకప్పుడు ప్రభుత్వ కార్యాలయాల వద్ద కమ్యూనిస్టు నాయకులు ఉండి అక్కడకు వచ్చే వారిని పరిచయం చేసుకుని సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా కమ్యూనిస్టు పార్టీ విస్తరణకు కృషి చేసేవారు. కమ్యూనిస్టు పార్టీతో సంబంధాల ఏర్పాటుకు ఇది ఒక మార్గంగా ఉండేది. కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన వేళ రాజకీయంగా సైద్ధాంతికంగా ప్రజల్లోకి వెళ్లడమే కర్తవ్యం కావాలి. నిత్యం అందుబాటులో ఉండటం కూడా ప్రజలను చైతన్య పరిచే మార్గాలలో ఒకటి. కమ్యూనిస్టుల బలోపేతమే లక్ష్యం కావాలి. ఇదే సమయంలో కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తించిన వారి దన్ను కమ్యూనిస్టులకు కావాలి.

ఏనుగు వెంకటేశ్వరరావు, ఖమ్మం

# భారత కమ్యూనిస్టు పార్టీ ఆరంభకాలం

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) 1925 డిసెంబర్ 25న కాన్పూర్‌లో ఏర్పడింది. అప్పటినుండి అనేక కాంగ్రెస్‌లు, సభలు జరుపుకుంది. అవి ఆ కాలమాన పరిస్థితులను అంచనావేసి అనేక రాజకీయ, సైద్ధాంతిక, కార్యక్రమ సంబంధవైఖరులు రూపొందించుకున్నాయి. అహ్మదాబాద్ కాంగ్రెస్ సెషన్(1921)లో మౌలానా హస్రత్ మొహాని అనే కమ్యూనిస్టు 'సంపూర్ణ స్వాతంత్ర్య' తీర్మానం ప్రతిపాదించిన విషయం ఎప్పుడూ గుర్తుంచుకోవలసిన అంశం. అన్ని రకాల విదేశీ నియంత్రణ నుంచి పూర్తి స్వేచ్ఛను కోరింది ఆ తీర్మానం. అయితే ఓటింగ్‌లో ఆ తీర్మానం వీగిపోయింది. సిపిఐ సంస్థాపన మహాసభ నుంచి ఇప్పటికి 24 కాంగ్రెస్‌లు (జాతీయ మహాసభలు) జరుపుకుంది. ఈ సెప్టెంబర్ 21–25 తేదీల్లో చండీఘడ్ (పంజాబ్)లో 25వ పార్టీ కాంగ్రెస్ జరుపుకుంటున్న సందర్భంగా ఆ మహాసభలు, పార్టీ అగ్రనాయకత్వం గూర్చి సూక్ష్మంగా తెలుసుకుందాం.

**సిపిఐ సంస్థాపన మహాసభ – కాన్పూర్, 1925**

సిపిఐ సంస్థాపన మహాసభ 1925 డిసెంబర్ 25–29 తేదీల్లో కాన్పూర్‌లో జరిగింది. ఆ మహాసభ కన్వీనర్ సత్యభక్త. 1925 జూన్ 18న ఆయన పంపిన సర్క్యులర్ లేఖలో కమ్యూనిస్టు పార్టీ అంతిమ ధ్యేయం ''భారతదేశంలో సంపూర్ణ స్వేచ్ఛ స్థాపన. న్యాయమైన సమాజ నిర్మాణం'' అని తెలిపారు.

కాన్పూర్‌లో కమ్యూనిస్టుల మహాసభకు చైర్మన్‌గా వ్యవహరించిన సింగారవేలు ఎం.చెట్టియార్ తమ ప్రసంగంలో : ''....అన్ని సబబైన మార్గాల ద్వారా స్వరాజ్యం లేదా సంపూర్ణ స్వాతంత్ర్య స్థాపన పార్టీ తక్షణ ధ్యేయం'' అన్నారు. కాగా మొహాని, సింగారవేలు ఇరువురూ తమ ప్రసంగాల్లో స్వరాజ్యం అంటే సంపూర్ణ స్వాతంత్ర్యం అని స్పష్టంగా భాష్యం చెప్పారు.

కాన్పూర్ మహాసభ (1925)లో సిపిఐ ఆమోదించిన కాన్‌స్టిట్యూషన్ (నిబంధనావళి) ఆర్టికల్ 1 ''బ్రిటీష్ సామ్రాజ్యవాద ఆధిపత్యం నుండి దేశాన్ని విముక్తి చేయటం పార్టీ లక్ష్యాల్లో ఒకటిగా'' పేర్కొన్నది. తమ సభ్యులు కాంగ్రెస్ లోపల కూడా ఉండాలని పార్టీ నిర్ణయించింది.

ఎస్.వి.ఘాటె, జె.పి.బాగెర్‌హట్టలను ప్రధాన కార్యదర్శులుగా, సింగారవేలును చైర్మన్‌గా మహాసభ ఎన్నుకుంది.

**1927లో బొంబాయిలో సిఇసి విస్తృత సమావేశం**

1927 మే 29–31 తేదీల్లో బొంబాయిలో జరిగిన పార్టీ కేంద్ర కమిటీ విస్తృత సమావేశం (జనరల్ బాడీ అని కూడా అనేవారు) పార్టీ నిబంధనావళి, కార్యక్రమం(ప్రోగ్రాం)ను సవరించింది. సిపిఐ నిబంధనావళి ప్రోగ్రాంకు సంబంధించిన పేరా 6లో ''(ఎ)(1) సంపూర్ణ జాతీయ స్వాతంత్ర్యం, సార్వజనీన ఓటు హక్కు ప్రాతిపదికపై ప్రజాతంత్ర రిపబ్లికన్ స్థాపన'' లక్ష్యాన్ని ప్రతిపాదించింది.




కమ్యూనిస్టులు ఎఐసిసి లోపల దాని అతివాద విభాగం సహకారంతో రిపబ్లికన్‌వాదుల విభాగాన్ని ఏర్పాటు చేయతలపెట్టారు. ఎస్‌వి ఘాటేను ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకుంది.

**1933లో కలకత్తా మహాసభ**

1933లో మీరట్ కుట్రకేసు ఖైదీలు విడుదలైనాక, 1933 డిసెంబర్‌లో కలకత్తాలో సిపిఐ చిన్నపాటి మహాసభ (కాన్ఫరెన్స్) జరిగింది. అది రాజకీయ తీర్మానాన్ని, పార్టీ కొత్త నిబంధనావళిని ఆమోదించింది. డాక్టర్ జి.అధికారి ప్రధాన కార్యదర్శిగా కొత్త కేంద్ర కమిటీని ఎన్నుకుంది. ఆయన అరెస్టు అయినాక, ఎస్.ఎస్.మిరాజ్‌కర్ ప్రధాన కార్యదర్శిగా వ్యవహరించారు. తర్వాత కొంతకాలానికి ఆయన స్థానంలో సోమనాథ్ లాహిరి ప్రధాన కార్యదర్శి బాధ్యతలు చేపట్టారు.

భారతదేశం స్వాతంత్ర్యం సంపాదించుకోవలసిన అవసరాన్ని ఆ మహాసభ వక్కాణించింది.

**సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానం ఆమోదించిన కాంగ్రెస్**

భారత జాతీయ కాంగ్రెస్ (ఐఎన్‌సి)మద్రాసు(1927),కలక త్తా (1928), లాహోర్ (1929) సభలు సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని లక్ష్యం గా ఆమోదించటంలో ముఖ్యమైనవి. సిపిఐ, డబ్ల్యుపిపి (వర్కర్స్–

పెజెంట్ పార్టీ) కీలకమైన పాత్ర పోషించాయి. మద్రాసు సభలో విషయ నిర్ణాయక కమిటీ సమావేశంలో సంపూర్ణ స్వాతంత్ర్య తీర్మానాన్ని కెఎన్.జోగ్లేకర్ (సిపిఐ) ప్రతిపాదించగా, జవహర్‌లాల్ నెహ్రూ బలపరిచారు. తీర్మానం ఆమోదం పొందింది. బహిరంగ సమావేశంలో ఆ తీర్మానాన్ని నెహ్రూ ప్రతిపాదించగా, జోగ్లేకర్ బలపరుస్తూ మాట్లాడారు. అది ఏకగ్రీవామోదం పొందింది.

కలకత్తా కాంగ్రెస్ సమావేశంలో (1928) సిపిఐ, డబ్ల్యుపిపి నాయకత్వాన 50వేలమందితో పెద్ద ఊరేగింపు కాంగ్రెస్ పెండాల్‌లో ప్రవేశించింది. ప్రెసిడెంట్ మోతీలాల్ నెహ్రూ అందుకు అనుమతి ఇచ్చారు. జోగ్లేకర్, జవహర్‌లాల్ ప్రసంగించారు. సంపూర్ణ స్వాతంత్ర్యానికి మద్దతుగా ఆ ర్యాలీ జరిగింది. పర్యవసానంగా, సంపూర్ణ స్వాతంత్ర్యం లక్ష్యాన్ని సంవత్సరం లోపు ఆమోదించటానికి కాంగ్రెస్ నిర్ణయించింది. అంతిమంగా, 1929 డిసెంబర్ 31న దాని లాహోర్ సభ ఆ తీర్మానం ఆమోదించింది. అందులో ఇలా చెప్పింది.

''గత సంవత్సరం కలకత్తా కాంగ్రెస్ సభలో ఆమోదించిన తీర్మానం ప్రకారం, ఈ కాంగ్రెస్, కాంగ్రెస్ కాన్‌స్టిట్యూషన్ ఆర్టికల్ 1లో పొందుపరిచిన ''స్వరాజ్'' పదానికి అర్థం సంపూర్ణ స్వాతంత్ర్యం అని ప్రకటిస్తున్నది''

**పార్టీ ప్రధాన కార్యదర్శిగా పి.సి.జోషి 1935**

పిసి.జోషి 1935 లో సిపిఐ ప్రధాన కార్యదర్శిగా నియమించబడ్డారు. నేషనల్ ఫ్రంట్ పేరుతో విశాలమైన సామ్రాజ్యవాద వ్యతిరేక ఫ్రంట్ ఏర్పాటు చేయటం ద్వారా సంపూర్ణ స్వాతంత్ర్య సాధన నినాదాలను ఆయన ముందుకు తెచ్చారు.

**(సిపిఐ తొలి చైర్మన్, ప్రధాన కార్యదర్శుల జీవిత సంగ్రహాలు రేపు తెలుసుకుందాం – సం॥)**

# యూరియా కోసం ఎందుకీ పడరాని పాట్లు?



ఉజ్జిని రత్నాకర్ రావు
9490952646

రాష్ట్రంలో గత వారం, పది రోజులుగా యూరియా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పిఏసిఎస్) ముందు వందల సంఖ్యలో పాస్ పుస్తకాలు, ఆధార్ కార్డు జిరాక్స్ లతో క్యూ లైన్ లో గంటల తరబడి ఉంటున్న పరిస్థితులు చూస్తుంటే.. చాలా బాధ కలుగుతుంది. ఆరుగాలం కష్టం చి దేశానికి అన్నం పెట్టే రైతులకు ఈ పరిస్థితి ఎందుకు వచ్చింది. యూరియా సరఫరా లేదా! కేంద్రం సరఫరా చేయటం లేదా! ప్రభుత్వం ఏం చేస్తుంది! ప్లానింగ్ లేదా! కృత్రిమ కొరత ఉందా! బ్లాక్ జరుగుతుందా! పక్క రాష్ట్రాలకు పోతుందా! అధిక ధరలకు అమ్ముతున్నారా! వంటి సందేహాలు రాకమానవు. రైతుల బాధలు వర్ణనాతీతం. ఏది ఏమైనా రైతులకు యూరియా అందించాల్సిన బాధ్యత ప్రభుత్వం పై ఉన్నది. యుద్ధ ప్రాతిపదికపై ఎరువులను తెప్పించి రైతాంగాన్ని ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

యూరియాకోసం అర్ధరాత్రి నుంచే రైతు లు వ్యవసాయ గోదాముల వద్ద లైన్‌లో ఉంటూ అరిగోస పడుతున్నారు. ఒక బస్తా అయినా దొరక్కపోదా అంటూ జాగారం చేస్తున్నారు. కొన్నిచోట్ల యూరియా లేదని చెప్పడంతో రైతులు రోడ్డెక్కుతున్నారు. గత కొద్ది రోజులుగా రాష్ట్రంలో వివిధ జిల్లా, మండల కేంద్రాల్లో యూరియా కోసం రైతులు పడుతున్న పాట్లు చెప్పరానివిగా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా దుబ్బాక ప్రాథమిక సహకార సంఘానికి యూరియా లారీ వస్తుందని తెలియగానే అర్ధరాత్రి నుంచే రైతులు క్యూ కట్టారు..అక్కడే నిద్రించారు.7 గంటలు నిరీక్షిస్తే ఒక యూరియా బస్తా దక్కిందని రైతులు వాపోయారు. నల్లగొండ జిల్లా నిడ్మానూరు మండల కేంద్రంలో యూరియా వస్తుందని తెలిసి తెల్లవారుజాము నుంచే క్యూ లైన్ ఉన్న రైతులు.. యూరియ రాక పోవడం తో రోడ్డెక్కారు. రెండు గంటలపాటు జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. మిర్యాలగూడ లో.. సూర్యాపేటలో ఇదే పరిస్థితి. ఉత్తర తెలంగాణ జిల్లాలో ఇప్పటికే ప్రాథమిక సహకార సంఘాల వద్ద ఎరువుల కోసం కుస్తీలు పడుతున్న సంగతి చూస్తున్నాం.

**ఎందుకు ఈ పరిస్థితి దాపురించింది!**

తెలంగాణలో గత కొన్ని సంవత్సరాలుగా వరి సేద్యంతో పాటు పంటల విస్తీర్ణం పెరుగుతూ వస్తుంది. దీని కనుగుణంగా ఈ సంవత్సరం 20 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. కేంద్రం 9.5 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తామని 8.5లక్షల మెట్రిక్ టన్నులు కేటాయించింది. కానీ ఆగస్టు చివరి నాటికి రాష్ట్రానికి చేరింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. డిమాండ్ ఎక్కువగా ఉండటం సరఫ రా తక్కువగా ఉండటం..ఈ సీజన్‌లో వర్షాలు ముందుగానే రావడంతో జూన్ జులై లోనే పంటల సేద్యం మొదలుపెట్టారు. దీనితో ఎరువుల కోసం ముఖ్యంగా యూరియా కోసం రైతులు గోదాముల చుట్టూ తిరుగుతున్నారు.డబ్బులు ఉన్న రైతులు.. ముందుచూపుతో వీలున్న కాడికి అదనంగా కొనుగోలుచేసి పెట్టుకుంటున్నారు. దీనితో మార్కెట్లో ఎరువుల కొరత మొదలైంది. ఇదే అదు ను చూసి కొంతమంది డీలర్లు, ప్రైవేట్ ఏజెన్సీలు వివిధ మార్గాల ద్వారా సేకరించుకొని బ్లాక్‌లో ఎక్కువ ధరకు అమ్ముతున్నారని రైతులు వాపోతున్నారు. గత్యంతరంలేని పరిస్థితుల్లో రూ.266 లున్న యూరియా బస్తాను రూ.400 లకు కొంటున్నామని..డబ్బులు లేని రైతులు ఉద్దెరతో రూ.450లకు డీలర్ల వద్ద పంట మీద ఇస్తామని తీసుకుంటున్నామనీ తెలుపుతున్నారు. ఎరువులు అందుబాటులో లేకపోవడంతో రైతాంగంలో ఆందోళన మొదలైంది.

**యూరియా కోసం పార్లమెంట్ సభ్యులు ధర్నా**

రాష్ట్రంలోఎరువులకోసం రైతులు పడుతున్న పాట్లను కేంద్రం దృష్టికి తీసుకుపోవడానికి.. కాంగ్రెస్ పార్లమెంట్ సభ్యులు పార్లమెంటు ఆవరణలో ఆగస్టు 20న తక్షణమే ఎరువులు కేటాయించాలని ధర్నా చేపట్టిన నేపథ్యంలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి 50 వేల మెట్రిక్ టన్నులు 10 రోజులలో పంపిస్తామని వాగ్దానం చేసి ఆగస్టు 25న 30 వేల టన్నులు వచ్చిందని.. అయినా డిమాండ్ ఎక్కువగా ఉందని తక్షణమే 2.9 లక్షల టన్నులు పంపించాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తుంది.

**పంటల విస్తీర్ణంలో వరి ప్రథమ స్థానం**

రాష్ట్రంలో పంట విస్తీర్ణాలు ఏటేటా పెరగడంతో ఎరువుల డిమాండు పెరుగుతుంది. ఈ సంవత్సరం 1.32 కోట్ల ఎకరాలు సేద్యం జరుగుతుందని వ్యవసాయ శాఖ తెలుపుతుంది. ప్రధానంగా యూరియాను ఎక్కువగా వాడే పంటల్లో వరి ప్రథమ స్థానంలో ఉంది. ఏటా వరి విస్తీర్ణం పెరుగుతూ వస్తుంది. మొక్కజొన్న సైతం ఈసారి భారీగా పెరిగింది. దాని సాధారణ విస్తీర్ణం 5.21 లక్షల ఎకరాలు కాగా..ఈసారి 6.48 లక్షలు ఎకరాల్లో వేశారు. పత్తి గత సంవత్సరం 42.07 లక్షల ఎకరాల్లో సాగు చేయ గా, ఈసారి అది 44.91లక్షల ఎకరాలకు చేరింది. దీనితో ఎరువుల వాడకం బాగా పెరిగింది.

రాష్ట్రానికి ఏటా రెండు సీజన్లకు కలిపి 14 లక్షల టన్నుల మేర ఎరువులు సరఫరా అవుతుండగా.. వానా కాలంలో 9లక్షల టన్నుల కంటే అధికంగా యూరియా ను వినియోగిస్తున్నారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలలు యూరియాకు కీలకమైనవి. ఇప్పటికే 3 లక్షల టన్నుల కొరత ఉండగా..ప్రాజెక్టులు పూర్తిగా జలకళలతో నిండి ఉన్నా యి. వరి సేద్యం పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీనితో సెప్టెంబర్‌లో యూరియా మరింత పెరిగే అవకాశం ఉంది

**కేంద్రం రసాయన ఎరువులు తగ్గించాలనీ కోరుతుంది!**

దేశంలో రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమైన యూరియా ఉత్పత్తి ని, సరఫరాని తగ్గిస్తుండగా.. మరోవైపు మన రాష్ట్రంలో వినియోగం భారీగా పెరుగుతుంది. రాష్ట్ర అవసరాల మేరకు కేంద్రం ఎరువులను సరఫరా చేయలేని పరిస్థితి నెలకొనగా.. రైతు లు ఇబ్బందులు పడుతున్నారు. యూరియా డిఏపి, ఎంఓపి, ఎస్ఎస్‌పి కాంప్లెక్స్ ఎరువులను కేంద్రప్రభుత్వం రాష్ట్రాలకు సరఫరా చేస్తుంది. ఇందులో యూరియా వినియోగం ఎక్కువ. గత ఏడాది ఏప్రిల్, మే మాసాలకు కలిపి దేశంలో, 50.36 లక్షల టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది. ఈ ఏడాది అది 44.25 లక్షల టన్నులకు తగ్గింది. యూరియా ఉత్పత్తి తగ్గుదలతో పాటు రష్యా – ఉక్రేన్ యుద్ధం, చైనా ఆంక్షలతో దిగుమతులు తగ్గిపోయాయి. దీంతో కేంద్రం రాష్ట్రాలకు నిర్ణయించి కేటాయింపులు మేరకు సరఫరా చేయడం లేదు. యూరియా ఎరువులు సరిపోను అందుబాటులో లేవు. దీనికి బాధ్యులు మీరంటే.. మీరు అన్నట్లు అధికారంలో ఉన్న.. కేంద్ర రాష్ట్ర మంత్రుల ఆరోపణలు చూస్తూంటే.. రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షం బిఆర్ఎస్ నాయకులు..పాలకుల వైఫల్యమే అంటూ.. ఎరువులు సరఫరా చేయలేని చేతకాని ప్రభుత్వాలంటూ విమర్శనాస్త్రా లు గుప్పిస్తున్నారు. విమర్శలు మాటలు పక్కకు పెట్టండి రైతాంగానికి యుద్ధ ప్రాతిపదికన ఎరువులు సరఫరా జరిగే విధంగా చూడండి అంటూ రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు.

**ఎందుకీ కొరత ఏర్పడింది,ఎవరు కారణం?**

ఎందుకీ అగచాట్లు వస్తున్నాయని పరిశీలించితే.. కొన్ని విషయాలను తెలుసుకోవలసిన అవసరం ఉంది. రాష్ట్రాలకు యూరియా కేటాయింపులు, సరఫరా పూర్తిగా కేంద్ర ఎరువుల రసాయనాల మంత్రిత్వ శాఖ పరిధిలో ఉంటాయి.

రాష్ట్రంలో గత సంవత్సరంలో వేసిన పంటలు దృష్టిలో పెట్టుకుని 10 శాతము విస్తీర్ణం పెరుగుతుందని అంచనా వేస్తూ కేంద్ర ప్రభుత్వానికి ఖరీఫ్ సీజన్ రాకముందే ప్లాన్ రూపొందించి రాష్ట్రానికి 20 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులు కావాలని కోరినామని ప్రభుత్వం చెబుతుంది.కానీ రాష్ట్రానికి కేంద్రం కేటాయించింది 9.80 లక్షల మెట్రిక్ టన్నులు. కానీ ఇస్తానన్నది 8.30 లక్షల మెట్రిక్ టన్నులు. నేటికి సరఫరా అయినవి 5.66 మెట్రిక్ టన్నులు మాత్రమే.

**ఎరువుల కేటాయింపులో వివక్ష ఉందా!**

కేంద్రం ప్రభుత్వం రాష్ట్రాలకు కేటాయించిన ఎరువులు పరిశీలించితే తెలంగాణపై కొంత వివక్ష చూపిస్తున్నట్టుగానే కనిపిస్తుంది. తెలంగాణకు కేటాయించిన పూర్తి కోట ఇవ్వాలని ఈనెల 20న పార్లమెంట్ భవనం ముందు తెలంగాణ పార్లమెంటు సభ్యులు ధర్నా చేస్తే 50 వేల టన్నులు మాత్రమే పది రోజుల్లో ఇస్తామని హామీ ఇచ్చారు.

జూన్, జులై, ఆగస్టు ఆఖరినాటికి 8.30 లక్షల టన్నులు సరఫరాచేయాల్సిఉండగా, ఈ నెల ఆఖరికి వచ్చింది 5.66 లక్షల టన్నులు మాత్రమే. ఆ వివరాలు వ్యవసాయ శాఖ మంత్రి పత్రికా ముఖంగా వివరించారు. ఇంకా సుమారు 3 లక్షల టన్నులు లోటు ఉండటం.. సకాలంలో కేంద్రం సరఫరా చేయకపోవటంతో రాష్ట్రవ్యాప్తంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఎప్పటికప్పుడు వస్తున్న ఎరువులను మ్యానిటరింగ్ చేస్తూ యూరియాను డిమాండ్ ఉన్న ప్రాంతానికి పంపిస్తున్నామని.. రైతులు ఎరువులు దొరకవని ఆందోళన చెందనవసరం లేదని ప్రభుత్వం ప్రకటిస్తుంది.



కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ గతంలో ఇచ్చిన 2 లక్షల టన్నులు ఇప్పటికే రాష్ట్ర వద్ద నిల్వలు ఉన్నాయని.. ఎప్పటి కప్పుడు పంపుతున్నామని.. రూ.80,000కోట్లు సబ్సిడీ భరించామని చెప్పడం హాస్యా స్పదంగా ఉంది.

యూరియాపై ప్రభుత్వం భరిస్తున్న సబ్సిడీ ఎక్కువగా ఉంది. ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకోవాలి.. చైనా నుండే 20 శాతం దిగుమతి చేసుకోవాలి. సబ్సిడీని తగ్గించుకొనే ఎత్తులో భాగంగా తక్కువలో తెప్పించుకొనే ప్రయత్నం చేస్తుందని కేంద్రం పై విమర్శలు ఉన్నాయి.

పారిశ్రామిక అవసరాల కోసం వ్యవసాయ యూరియాను దారి మళ్ళిస్తున్నట్టు ఇటీవల వెలుగులోకి వచ్చింది. సరిహద్దు రాష్ట్రాల్లో కూడా ఎరువుల కొరత ఉండటంతో సరిహద్దు జిల్లాల నుండి కర్ణాటకకు, మహారాష్ట్రకు, ఎపికి దొంగచాటుగా తరలిస్తున్నట్టు ఇటీవల చెక్ పోస్టుల వద్ద బయటపడింది.

తెలంగాణ వ్యవసాయ జిడిపికి వరి, పత్తి, మొక్కజొన్న, పప్పులు గింజ పంటలే మూలాధారం. రాష్ట్రంలో సగం సాగు భూముల్లో 1.5 శాతం ఉండాల్సిన సేంద్రీయ కర్బనం వాస్తవంగా 0.5 శాతమే ఉంది. జింకు 50 శాతం, బోరాన్ 25 శాతం, ఇనుము 8 శాతం మేరకు మొదలైన సూక్ష్మ పోషకాల కొరత బాగా నెలకొంది. అందుకు అతిగా రసాయన ఎరువులు, క్రిమిసాశక మందులు తగ్గించాలని వ్యవసాయ శాఖ కోరుతుంది.

**పార్లమెంటరీ స్థాయి సంఘ సిఫార్సులు అమలు చేయాలి**

ఎరువుల కొరత రైతులు పడుతున్న ఇబ్బందులపై పార్లమెంటరీ స్థాయి సంఘం గతంలో ఆవేదన వ్యక్తం చేసింది. రాష్ట్రస్థాయిలో ప్రత్యేక బృందాలను నెలకొల్పి సరఫరాలను పర్యవేక్షించాలని సూచించింది. రసాయనాల ఎరువుల వాడకాన్ని తగ్గిస్తూ ప్రత్యామ్నాయ వనరుల ఉపయోగించేలా రైతులను చైతన్యం చేయాలని.. రైతులకు అందించే సబ్సిడీ యూరియాను ఇతర అవసరాలకు.. పరిశ్రమలలో వాడకంపై నిఘా పెంచాలని సూచించింది.

రైతులు ఎదుర్కొంటున్న తక్షణ అవసరమైన యూరియాను యుద్ధ ప్రాతిపదికన అందించాలని.. అందుకు అన్ని పార్టీలు ప్రతినిధులు కృషి చేయాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

# ఆయిల్ పామ్ సాగుకు రైతుల ఆసక్తి

మార్కెటింగ్, కోతులు, కూలీల ఇబ్బందులు లేని ఆయిల్ పామ్ పంట సాగు విస్తీర్ణం జిల్లాలో క్రమంగా పెరుగుతున్నది. పంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం సబ్సిడీలు, మద్దతు అందిస్తూ భరోసా ఇస్తున్నది. అంతర పంటల సాగుతో రైతులకు అదనపు ఆదాయం సమకూరుతున్నది. జిల్లాలోని పలు మండలాల్లో పంటచేతికి రావడంతో రైతుల్లో మరింత ఆత్మవిశ్వాసం పెరుగుతున్నది. దేశంపై దిగుమతుల భారం తగ్గి.. నూనె గింజల సాగులో స్వయం సమృద్ధి సాకారమవుతున్నది. ప్రపంచంలో అత్యధిక దిగుబడిని ఇచ్చే నూనె గింజల పంటలో ఆయిల్ పామ్ పంట ఒకటి. మన దేశంలో వంటలో ఉపయోగించే నూనెలో పామ్ ఆయిల్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇంతగా డిమాండ్ ఉన్నా మన దేశంలో పామ్ ఆయిల్ సాగు బాగా తక్కువ ఉంది. దీంతో మలేషియా, ఇండోనేషియా నుంచి దిగుమతి చేసుకుంటున్నాము. దేశం ముడి చమురు (పెట్రోల్, డీజిల్) తర్వాత ఎక్కువగా పామ్ ఆయిల్ (ఆయిల్ పామ్ చెట్ల నుంచి వచ్చిన గెలలతో తీసిన ఆయిల్)ని దిగుమతి చేసుకుంటుంది. వంట నూనెలో దీనివాటా ఎక్కువగానే ఉంటుంది.

**4వ సంవత్సరం నుంచి దిగుబడి...** ఆయిల్ పామ్ సాగు మొదలు పెట్టిన 4వ సంవత్సరం నుంచి దిగుబడి వస్తుంది. 4 నుంచి 6వ సంవత్సరం వరకు 5 నుంచి 7 టన్నులు దిగుబడి వస్తుంది. 7వ సం. నుంచి 10–15 టన్నులు దిగుబడి వస్తుంది. ప్రీయునిక్ కంపెనీ వారు పంట గెలలు కొనుగోలు చేస్తారు.

**బంగారు పంట మీద ఎక్కువగా శ్రద్ధ..** ఇంత డిమాండ్ ఉన్న పంట కాబట్టే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ బంగారు పంట మీద ఎక్కువగా శ్రద్ధ చూపించి రైతులకు తోడ్పాటుగా మొక్కలు, డ్రిప్ మీద సబ్సిడీపై అందిస్తున్నాయి. ఆయిల్‌పామ్ పంట సాగు నిర్వహణ చాలా సులువు. చీడ, పీడల, కోతులు, ఇతర అటవీ జంతువుల బెడద ఉండదు. ఉద్యానవన శాఖ అధికారుల సూచనలు, సలహాల మేరకు పంట సాగుచేస్తే అధిక దిగుబడి, ఆదాయం సొంతం చేసుకోవచ్చు. ఎన్ని ఎకరాల్లో అయినా సాగుచేసే వారికి సబ్సిడీ అందుతుంది. ఎస్సీ, ఎస్టీ రైతులకు డ్రిప్ పరికరాలకు 100 శాతం సబ్సిడీ, చిన్న, సన్నకారు రైతులకు 90 శాతం సబ్సిడీ, ఒసిలకు చెందిన రైతులకు 80 శాతం సబ్సిడీ అందజేయనున్నారు. ఎకరం విస్తీర్ణంలో 50 మొక్కలు నాటుతారు. ఒక్కో మొక్క విలువ మార్కెట్లో రూ.200 ఉండగా, రైతులందరికీ 90 శాతం సబ్సిడీ వర్తింపజేస్తూ కేవలం రూ.20కే అందజేస్తారు. మొక్కలు, డ్రిప్, ఇతర సహాయం అన్ని కలిపి ఒక ఎకరానికి ప్రభుత్వం రూ.52వేల వరకు సబ్సిడీ నాలుగు ఏండ్లపాటు అందజేస్తుంది.

## పాఠశాలకు బోర్డు ఏర్పాట్లు చేయండి సార్!

పట్టించుకోని ఎంఇఒ

**ప్రజాపక్షం/ముత్తారం :** ఇది ఏదో మారుమూల అటవీ ప్రాంతము కాదండి సాక్షాత్తు మండల కేంద్రానికి అధికారులకు కనుచూపుకు దగ్గర్లో ఉన్న పాఠశాల ముత్తారం మండల కేంద్రంలో ఉంది. ఈ పాఠశాల పేరును తెలిపే బోర్డు లేకుండా ఉండడంతో అధికార యంత్రాంగం తీరుపై పలువురు ఆస్యం వ్యక్తం చేస్తున్నారు. ఎంఈఓ కార్యాలయానికి దగ్గరలో ఉన్న ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకే పేరు లేకుండా ఉండడంతో అధికారుల తీరుపై పలువురు ఆస్యం వ్యక్తం చేస్తున్నారు. ప్రైమరీ పాఠశాలన లేక జడ్పీ పాఠశాలన అని తెలిపే పాఠశాల బోర్డు లేకుండా ఉన్నప్పటికీ స్థానిక ఎంఈఓ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాఠశాల కి బోర్డు ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## సప్తగిరి కాలనీ ఆరోగ్య కేంద్రాన్ని ప్రభుత్వ భవనంలోకి మార్చాలి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** సప్తగిరికాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ప్రభుత్వభవనంలోకి మార్చాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. అద్దెభవనాల్లో నిర్వహిస్తున్న ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, అంగన్ వాడీ పాఠశాలలను ఖాళీగా ఉన్న స్థానిక ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఖాళీగా ఉన్న సప్తగిరి కాలనీ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల భవనాన్ని ఆధునీకరించారు. ఈ భవనంలో సప్తగిరి కాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహించనున్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఈ భవనాన్ని పరిశీలించారు. ఆధునీకరణ పూర్తి పనులు పూర్తయినందున వెంటనే అద్దె భవనంలో కొనసాగుతున్న సప్తగిరికాలనీ అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఈ ప్రభుత్వ భవనంలోకి మార్చాలని ఆదేశించారు. విశాలంగా ఉన్న ఈ భవనంలో ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని శుక్రవారం సభ నిర్వహించాలని సూచించారు.

## మట్టి తరలింపునకు అవసరమైన అనుమతులు పొందాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** జిల్లా లో రైల్వే లైన్ నిర్మాణానికి మట్టి తరలింపు అవసరమైన అనుమతులు పకడ్బందీగా పొందాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో రైల్వే లైన్ నిర్మాణ పనులకు అవసరమైన మట్టి అనుమతుల పై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల లో రైల్వే స్టేషన్ నిర్మాణం, రైల్వే లైన్ నిర్మాణం కోసం సమీపంలో గల పాయింట్ నుంచి అవసరమైన మట్టి తరలింపు కేటాయింపు చేయాలని, దీనికి తగిన విధంగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మట్టి తరలింపుకు తగిన విధంగా సినరేజి చార్జిలు వసూలు చేయాలని అన్నారు. నిర్దేశిత కేటాయింపుల మేరకు మాత్రమే మట్టి తరలింపు జరగాలని, అదనంగా మట్టి తరలించడానికి వీలు లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో రైల్వే శాఖ ఇంజనీరింగ్ అధికారి మూర్తి కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వాణి శ్రీ, విజయ భాస్కర్





**ప్రజాపక్షం/పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా ఇంచార్జి వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ వి.వాణిశ్రీ బాధ్యతలు స్వీకరించారు. అదే సమయంలో హన్మకొండ నుంచి పదోన్నతి పై వచ్చిన డాక్టర్ కె విజయభాస్కర్ జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారిగా బాధ్యతలు తీసుకున్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన జిల్లా అధికారులు సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షను మర్యాద పూర్వకంగా కలిశారు.

## ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి: కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఉపాధ్యాయులను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సోమవారం ఉదయం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం సిద్ధం చేసే గదికి వెళ్లారు. ఆహార పదార్థాలు సిద్ధం చేస్తుండగా, పరిశీలించారు. అనంతరం 6 నుంచి 10 తరగతి గదుల్లోని విద్యార్థుల ను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. విద్యార్థులకు ఉపాధ్యాయులు పాఠ్యాంశాలు బోధిస్తుండగా, పరిశీలించారు. 10 వ తరగతి విద్యార్థులకు ఫిజిక్స్ పాఠాలు బోదించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, అన్ని సబ్జెక్టుల పాఠ్యాంశాలు నిత్యం చదివించాలని, రాయించాలని సాధన చేయించాలని సూచించారు. విద్యాలయం ఆవరణ నిత్యం పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఆవరణ అంతా మున్సిపల్ సిబ్బందితో శుభ్రం చేయించాలని సూచించారు.

## చోరీ కేసులో మైనర్లు

22.71 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం

**ప్రజాపక్షం/ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణంలోని బట్టల వ్యాపారి కోలేటి మల్లిఖార్జున్ ఇంట్లో ఆగస్టు 30న జరిగిన దొంగతనం కేసులో ఇరువులు మైనర్లను అదుపులోకి తీసుకుని చోరీ చేసిన 22.71 తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం పరచుకున్నట్లు జగిత్యాల డిఎస్పీ పి. రఘు చందర్ తెలిపారు. ధర్మపురి సిఐ ఎలాపాటి రాం నర్సింహారెడ్డి, ఎస్సైలు పులిచెర్ల ఉదయ్ కుమార్, మిర్యాల రవీందర్‌లతో కలిసి సోమవారం పాత్రికేయుల సమావేశంలో డిఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. ధర్మపురికి చెందిన మల్లిఖార్జున్ ఆగస్టు 30న ఉదయం ఇంటికి తాళం వేసి షాపుకు వెళ్లాడు. తిరిగి రాత్రి ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగులగొట్టి ఉండడంతో పాటు లోపల ఉన్న బీరువా తెరిచి ఉండడంతో అందులో ఉంచిన 22.71 తులాల బంగారు ఆభరణాలు గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లుగా గుర్తించి ధర్మపురి పోలీసు స్టేషన్‌లో పిర్యాదు చేశారు. ఎస్సై పి. ఉదయ్ కుమార్ కేసు నమోదు చేయగా, సిఐ రాం నర్సింహ రెడ్డి విచారణ చేపట్టారు. ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు డిఎస్పీ రఘు చందర్ సూచనలతో రెండు బృందాలుగా ఏర్పడి సిసి టీవి పుటేజిలతోపాటు ఓ మహిళా ఇచ్చిన సమాచారంతో చోరికి పాల్పడింది సొంత అన్నదమ్ములైన ఇద్దరు మైనర్లుగా గుర్తించారు. నిందితులైన ఇరువురిని సోమవారం వారి ఇంటి వద్ద అదుపులోకి తీసుకుని వారి నుండి 22లక్షలు విలువ చేసే చోరీ సొత్తు 22.71 తులాల బంగారు ఆభరణాలను స్వాధీన పరుచుకున్నట్లు అనంతరం జగిత్యాల జువెలైన్ జస్టిస్ బోర్డు యందు హాజరు పర్చినట్లు డిఎస్పీ తెలిపారు. కేసును కేవలం రెండు రోజుల్లోనే చేధించిన ధర్మపురి సిఐ రాం నర్సింహ రెడ్డి, ఎస్సైలు ఉదయ్ కుమార్, రవీందర్ కుమార్, హెచ్‌సి రామస్వామి, కానిస్టేబుల్స్ బి. రమేష్ నాయక్, రణధీర్ గౌడ్, ఎం. రమేష్, ఆరిస్, మహేందర్‌లను ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు.

## ఫౌంటెన్‌లో పడి యువకుడు మృతి



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట పట్టణ కేంద్రంలోని బిజెఆర్ చౌరస్తాలో గల వాటర్ ఫౌంటెన్‌లో పడి యువకుడు మృతి చెందిన సంఘటన జరిగినట్లు సిద్దిపేట టూటౌన్ సిఐ ఉపేందర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టూటౌన్ సిఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామానికి చెందిన ఆకుల శశిధర్(21) తండ్రిపేరు రవి,అనునతను ఆదివారం రాత్రి సమయంలో తన మోటర్ సైకిల్‌పై వెళుతుండగా ప్రమాదవశాత్తు బిజెఆర్ చౌరస్తాలోని వాటర్ ఫౌంటెన్‌లో పడిపోయినట్లు,ఈ రోజు మధ్యాహ్నం ఎవరో చూసి పోలీసులకు తెలపగా ఎస్ఐ ముత్యంతో కలిసి సిఐ ఉపేందర్ సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి,ఎస్ఐ ముత్యం వాటర్ ఫౌంటెన్ లోపలికి దిగి మృతదేహాన్ని మార్చరీకి తరలించామన్నారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించినట్లు సిఐ ఉపేందర్ తెలిపారు.

# యూరియా కోసం రైతుల ధర్నా







### స్థంబించిన రవాణ సౌకర్యాలు

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** మండలానికి సరిపడ యూరియా సరఫరాచేయక పోవడంతో ఆగ్రహించిన రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో సోమవారం వ్యవసాయ సాహకార సంఘం ఆధ్వర్యంలో కూపన్ల ద్వారా యూరియా పంపిణీ చేస్తున్నట్లుగా ఎట ప్రసార మాధ్యమాల ద్వారా ఒక రోజు ముందే ప్రచారం చేశారు. దింతో ఉదయం నుండే పెద్ద సంఖ్యలో రైతులు పిఎసిఎస్ కార్యాలయంలో కూపన్ల కోసం బారులు తీరారు. మధ్యాహ్నం వరకు 560 యూరియా బస్తాలకు మాత్రమే కూపన్లు జారి చేసి యూరియా నిల్వలు లేవని మండల వ్యవసాయాధికారి రైతులకు సూచిందంతో కూపన్లు రాని రైతులు ఎఒపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. ఈ క్రమంలో ప్రతిపక్ష పార్టీఆయిన బిఆర్ఎస్ నేతలు రైతుల నిరసనకు మద్దతు తెలుపడంతో జగదేవ్‌పూర్ వినాయక గుడి వద్ద భువనగిరి గజ్వేల్ రొడ్డుపై బైటాయించి గంట పాటు ధర్నా నిర్వహించారు. దింతో రోడ్డుపై వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయి రవాణ సౌకర్యాలు స్థంబించాయి. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ధర్నా స్థలంకు చేరుకోని రైతులను సముదాయించి ధర్నాను విరమింప చేశారు.

### యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

**కొండపాక:** యూరియా కోసం రైతులు రోడ్డెక్కారు.కొండపాక, కుకునూరుపల్లి మండల కేంద్రాల్లో యూరియా కోసం రైతులు సోమవారం ఆందోళన బాట పట్టారు.కుకునూరుపల్లి కొండపాక క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు.యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులకు సోమవారం ఉదయం వస్తుందని అధికారులు చెప్పారని, దాంతో రైతులు యూరియా కోసం సోమవారం తెల్లవారు జాము నుంచే పడిగాపులు కాశారు.తీరా ఈ రోజు యూరియా రావడం లేదని అధికారులు వచ్చి తెలపడంతో ఆగ్రహించిన రైతులు ఆందోళన చేపట్టారు.వెంటనే రాజీవ్ రహదారి పైకి వచ్చి బైఠాయించి రాస్తారోకో చేశారు.కొండపాకలో రైతుల ఆందోళలనాలకు బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలిపారు.వెంటనే యూరియా అందివ్వాలని డిమాండ్ చేశారు. వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద గల ఆగ్రోస్‌లో యూరియా ఉందని తెలియడంతో వ్యవసాయ శాఖ అధికారి శివరామకృష్ణ చేరుకుని రైతులకు టోకెన్‌లు ఇచ్చి యూరియా అందజేశారు.దాంతో కొండపాకలో రైతులు ఆందోళన విరమించారు.

### వర్షంలో సైతం బారులు తీరిన అన్నదాత

**ముత్తారం:** పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయానికి యూరియా బస్తాల కోసం రైతులు సోమవారం ఉదయం బారులు తీరారు. యూరియా కోసం వచ్చిన రైతులు, మహిళలు సైతం ఒకే వరుసలో నిలబడి నిరీక్షించారు. సహకార సంఘం కార్యాలయంలో 270 బస్తాలు యూరియా నిల్వ ఉండగా యూరియా కోసం వచ్చిన రైతులకు ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున అందరికీ వచ్చే విధంగా ఏవో అనూష, కార్యనిర్వహణ అధికారి ప్రసాద్ గౌడ్, కార్యాలయం సిబ్బంది ఆధ్వర్యంలో రైతులకు అందించారు.

**శంకరపట్నం:** కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం మెట్టుపల్లి సహకార సంఘం గోదాం ఎదుట సోమవారం యూరియా కోసం వర్షంలో గొడుగులు పట్టుకుని రైతులు బారులు తీరారు. ఉదయం గోదాంకు యూరియా లారీ రాగా రైతులు చేరుకుని వర్షంలో తడుస్తూ గొడుగులు పట్టుకుని క్యూలో నిల్చున్నారు. 280 బస్తాల యూరియా రాగా ఆధార్‌కార్డు జిరాక్సులు సిబ్బందికి అందించడంతో ఒక్కో రైతుకు ఒక్క యూరియా బస్తాను పంపిణీ చేశారు. మండలంలోని ముత్తారం ఆగ్రోస్ కేంద్రానికి 280 బస్తాల యూరియా రాగా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున వ్యవసాయ అధికారుల పర్యవేక్షణలో పంపిణీ జరిగింది. యూరియా అందని రైతులకు మరో దఫాలో అందిస్తామని చెప్పడంతో వెనుదిరిగారు.



## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రజావాణి ఆర్జీలను సత్వమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ సోమవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి ఫిర్యాదులు వినతులను అదపు కలెక్టర్ , ఆర్డీవోలతో కలిసి స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యల పరిష్కరంం కోరతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాలలో నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని , అధికారులు వారి శాఖల వారిగా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.ఎస్ లత, జగిత్యాల , మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూధన్, శ్రీనివాస్, జివాకర్‌రెడ్డి, వివిధ జిల్లా అధికారులు తహాసీల్దార్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు సిబ్బంది పాల్గొన్నారు.

## పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



**ప్రజాపక్షం/చేర్యాల:** పంట నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో చేర్యాల పట్టణ కేంద్రంలోని స్థానిక ఎమ్మార్వో వద్ద తహాసీల్దార్‌కు కు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కత్తుల భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇటీవల వారం రోజుల పాటు కురిసిన భారీ వర్షాల వల్ల వరి, మొక్కజొన్న, పత్తి, కంది వంటి మొదలైన పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే క్షేత్రస్థాయిలో మండల వ్యాప్తంగా అధికారులు పంటలను పరిశీలించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి నష్టపోయిన రైతులకు ఎకరానికి 50 వేల పరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం మండల కార్యదర్శి పోనుగోటి శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లవ్వ, మల్లవ్వ, లక్ష్మి , రమేష్, నర్సింలు, కనకయ్య, మల్లేశం, ప్రశాంత్, రవి, తదితరులు పాల్గొన్నారు.

## సుధాకర్‌రెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసుకున్న సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్ రెడ్డి మృతి దేశానికే తీరని లోటు అని, వారి ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు అందె స్వామి, సిపిఐ మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డిలు పిలుపునిచ్చారు. కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ చిగురుమామిడి మండల శాఖ కార్యదర్శి లక్ష్మారెడ్డి ఆద్వర్యంలో సురవరం సుధాకర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్బంగా వారు మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా నిరంతరం శ్రమించిన సుధాకర్‌రెడ్డి మృతి దేశానికే తీరని లోటు అన్నారు. విధ్యార్థి దశ నుంచే ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని కమ్యూనిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తన సేవలు అందించారని చెప్పారు. నల్గొండ నుంచి రెండుసార్లు ఎంపిగా గెలిచి రాష్ట్ర సమస్యలను పార్లమెంటులో వినిపించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విద్యుత్ చార్జీల ఆందోళనలో సురవరం సుధాకర్‌రెడ్డి క్రియాశీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

చివరి శ్వాస వరకు కమ్యూనిస్టు పార్టీలో ఉండి పోరాడిన మహోన్నత వ్యక్తి సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు అందె స్వామి, గూడెం లక్ష్మి , సింగిల్ విండో డైరెక్టర్లు చాడ శ్రీధర్‌రెడ్డి, ముద్రకోల రాజయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు తేరాల సత్యనారాయణ, నాయకులు బూడిద సదాశివ, అందె చిన్నస్వామి, పైడిపల్లి వెంకటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ గోలి బాపురెడ్డి, పైడిపల్లి శశి, తాళ్లపల్లి చిన్నచంద్రయ్య, ఎన రాజు, ఉస్మాన్‌పాషా, వెంకన్న తదితరులున్నారు.

## ఎఐటియుసిని విమర్శిస్తే సమస్యలు పరిష్కారం కావు

ఎఐటియుసి నాయకులు సీతారామయ్య, రాజ్ కుమార్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** సింగరేణి లో గుర్తింపు సంఘం ఏఐటియుసి ని విమర్శించడమే కొన్ని యూనియన్‌లు పని పెట్టుకున్నాయని, ఏఐటియుసి ని విమర్శించడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, సింగరేణి లో రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిపోయిందని దానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయకుండా పైరవీలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నారని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి అధ్యక్షులు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ లు పేర్కొన్నారు. సోమవారం గోదావరి ఖని భాస్కర్ రావు భవన్ లో జరిగిన ఏఐటియుసి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ సింగరేణి లో గత ఆరు సంవత్సరాలుగా కార్మికుల సమస్యలు పరిష్కారం కావడం లేదని, గుర్తింపు సంఘం ఎన్నికలు పెట్టాలని ఏఐటియుసి డిమాండ్ చేస్తే, ప్రతి పక్ష యూనియన్ లు యాజమాన్యం సంకలో సొచ్చి అడ్డు కున్న ఈ సంఘాలు కార్మికుల హక్కుల కోసం సంస్థ పరిరక్షణ కోసం కృషి ఏఐటియుసి ని విమర్శించే అర్హత లేదని వారు పేర్కొన్నారు. ఏఐటియుసి గెలిచిన తరువాత కార్మికుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో యాజమాన్యం దృష్టికి తీసికెళ్ళి స్ట్రక్చర్ సమావేశాల్లో మాట్లాడి పరిష్కరించడం జరిగిందని అందులో కొన్నింటి పై సర్క్యులర్ లు జారీ చేశారని, కొన్ని కమిటీలు వేసి పరిష్కారం చేస్తామని చెప్పారని, ఇంకా కొన్ని ముఖ్యమైన సమస్యలు స్వంత ఇంటి పథకం, మారుపేర్లు, ఆదాయపు పన్ను, సింగరేణి లో కొత్త గనులు రావడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉన్నందున వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతున్నామని వారు తెలిపారు. ఇంకా ఈ సమావేశంలో ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లా గౌడ్, సిపిఐ నగర కార్యదర్శి కనకరాజు, నాయకులు సయ్యద్ సోహెల్, తాల్లపెల్లి మల్లయ్య, ప్రీతం, పర్లపెల్లి రామస్వామి, బుర్ర భాస్కర్, సిరిసిల్ల మల్లేష్, ఆర్ రాజేశ్వరరావు ఆఫీస్ కార్యదర్శి తొడుపునూరి రమేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతిగృహాల సౌకర్యాలపై నివేదిక సమర్పించాలి

కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్:** మండల ప్రత్యేక అధికారులు అన్ని ప్రభుత్వ వసతిగృహాలను సందర్శించి వసతులు, సౌకర్యాల నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ పరిధిలోని ప్రభుత్వభవనాలు, స్థలాల వివరాలను సమర్పించాలని అన్నారు. ప్రజావాణి అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారుతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. 15 సంవత్సరాలు నిండిన బాలికలు, 50 సంవత్సరాలు పైబడిన మహిళలు, దివ్యాంగులను స్వయం సహాయక సంఘాల్లో చేర్పించాలని డిఆర్డీవో, మెప్మా పిడిలను ఆదేశించారు. ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలో చదివే బాలికలను ఈ సంఘాల్లో చేరేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేషనల్ ఫ్యామిలీ బెనిఫిట్ స్కీంలో అర్హులంతా లబ్ది పొందేలా చూడాలని అన్నారు.

**ప్రజావాణికి 269 ధరఖాస్తులు**

కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 269 మంది అర్జీదారులు ధరఖాస్తులు సమర్పించారు. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ప్రజల నుంచి ధరఖాస్తులు స్వీకరించారు. వచ్చిన ధరఖాస్తులను సంబంధిత అధికారులకు బదిలీ చేస్తూ ధరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ శాఖల వారీగా పెండింగ్ ధరఖాస్తులను సమీక్షించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, లక్ష్మి కిరణ్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్‌వో వెంకటేశ్వర్లు, ఆర్డీవోలు మహేశ్వర్, రమేష్, బాబు పాల్గొన్నారు.

## పెన్షన్ భిక్ష కాదు.. ఉద్యోగుల హక్కు




**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణ రాష్ట్ర ఎంప్లాయిస్ జేఏసీ పిలుపుమేరకు సోమవారం స్థానిక కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా కరీంనగర్ జిల్లా ఉద్యోగుల జేఏసీ ఆద్వర్యంలో ఉద్యోగ ఉపాధ్యాయ, పెన్షనర్లందరూ పెన్షన్ విద్రోహక దినం సందర్భంగా నల్ల టీషర్టులు, బ్యాడ్జీలు ధరించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. సుమారుగా 200 మంది ఉద్యోగులతో నిరసన తెలుపుతూ తమ న్యాయమైన హక్కులను పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. ఈ సంధర్భంగా తెలంగాణ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ దారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ అనేది బిక్షకాదు.. ఉద్యోగుల హక్కు అన్నారు. 30 నుంచి 35 సంవత్సరాలు ప్రజలకు సేవ చేసిన తర్వాత వృద్దాప్యంలో వారికిచ్చే పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సహాయం కాదని ఒక సాంఘిక భద్రత చర్య అన్నారు. దీనిని సుప్రీం కోర్టు సైతం స్పష్టంగా గుర్తించిందని పేర్కొన్నారు. ఆ తీర్పును ప్రభుత్వాలు గౌరవించాల్సిన బాధ్యత ఉందన్నారు. ఒకసారి శాసనసభ్యుడిగా, ఎంపిగా, ఎమ్మెల్సీగా ఎన్నికైనవారికి జీవితకాలం పెన్షన్ లభిస్తోందని, ప్రజల సంక్షేమం కోసం అహర్నిషలు శ్రమించే ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమాన్ని సైతం ప్రభుత్వం పట్టించుకోవాలని కోరారు. ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ఉద్యోగ ఉపాధ్యాయులను కాపాడటం ప్రభుత్వ కర్తవ్యమన్నారు. దురదృష్టవశాత్తు తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగుల జీవితాలు బజారున పడడమే కాక దాచుకున్న డబ్బుల కోసం, మెడికల్ బిల్లులు, జిపిఎఫ్, పదవీ విరమణ పెన్షన్ బిల్లులు, హెల్త్ కార్డులు, పిఆర్‌సి కోసం ఉద్యోగులు ధర్నాలు చేయాల్సిన దౌర్భాగ్య దుస్థితి వచ్చిందన్నారు. అటెండెన్స్, బయోమెట్రిక్, ఫేస్ రికగ్నైజ్డ్ సిస్టమ్‌లతో ఉద్యోగులను అవమానపరుస్తున్నారని అన్నారు. ఉద్యోగులకు పనిగంటలతో సంబంధం లేకుండా ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. నిరంతరం ప్రజల కోసమే పనిచేస్తున్న ఉద్యోగులను గడియారాలతో కొలవడం అవమానకరమని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టిఎన్జీవోల జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కాళీచరణ్, లక్ష్మణ్‌రావు, గెజిటెడ్ అధికారుల అరవింద్ రెడ్డి, కేశవరెడ్డి, వేలదాసరి లింగయ్య, రఘుశంకర్ రెడ్డి, రవీంద్రచారి, ఈశ్వరయ్య, రామ్మోహన్, రోహిత్ కుమార్‌లున్నారు.

## దేశంలోనే రోల్ మోడల్ కాంగ్రెస్ ప్రభుత్వం



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితి నిబంధన ఎత్తివేస్తూ బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచేందుకు ఉద్దేశించిన పురపాలక చట్టసవరణ పంచాయితీరాజ్ చట్ట సవరణ బిల్లులకు రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించడం బిసిలకు పెద్ద పండుగ అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు. బిసిలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం శాసనసభలో ఆమోదం తెలపడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సోమవారం కరీంనగర్ పట్టణంలోని ఇందిరాచౌక్ వద్ద కాంగ్రెస్ బిసి సెల్ ఆద్వర్యంలో జరిగిన సంబరాల్లో రాజేందర్ రావు హాజరయ్యారు. ఈ సంధర్భంగా డప్పు వాయించి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. బిసిలకు విద్యాపరంగా ఉద్యోగపరంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు పోతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ మాట ఇస్తే వెనక్కి తగ్గే ప్రసక్తే ఉండదని, ఇచ్చిన మాటకు కట్టుబడి రిజర్వేషన్లు అమలు చేస్తున్నదని తెలిపారు. ఇందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, ఇతర మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ నాయకులు, మాజీ కార్పోరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ బిసి సెల్ ప్రతినిధులు, ముఖ్య నాయకులున్నారు.

## ధ్వంసమైన రోడ్లను పరిశీలించిన ఎంపి



**ప్రజాపక్షం/భీమ్‌గల్:**జిల్లా ఎంపిధర్మపురి అరవింద్, బాల్కొండ ఇన్‌చార్జి డాక్టర్ ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి సోమవారం భీమ్‌గల్ పట్టణంలోని అకాల వర్షాలకు ముంపు గురైన వ్యవసాయ క్షేత్రాలను ధ్వంసమైన రోడ్లను పరిశీలించి నష్టపోయిన రైతులతో మాట్లాడి వారికి న్యాయం జరిగేలా ప్రభుత్వాన్ని ప్రతిఒక్క నష్టపోయిన రైతుకు 50 వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మధు, రవీందర్, మోహన్‌రెడ్డి, శ్రీను, యోగేశ్వర, నర్సయ్య, లక్ష్మణ్‌గౌడ్, నవీన్, హరిప్రసాద్, ప్రవీణ్, అంజి నాయకులు పాల్గొన్నారు.

## నీటి సరఫరా పునః ప్రారంభం

**ప్రజాపక్షం / సిర్పూర్ (టి) :**మిషన్ భగీరథ పైపులైన్ మరమ్మతుల కోసం అధికారులు తక్షణమే స్పందించారు. మిషన్ భగీరథ నీరు రాక ప్రజల ఇబ్బందులు అనే శీర్షికతో 'ప్రజాపక్షం' పత్రికలో ప్రచురితమైన కథనంపై స్పందించి, సిర్పూర్ (టి) మండలంలోని ఎస్‌టి కాలనీలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. సోమవారం, అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుపతి, మాజీ వార్డు సభ్యులు ఇఫ్తాక్ హాసేన్ తో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పనులు వెంటనే ప్రారంభించి, పైపులైన్‌కు మరమ్మతులు చేశారు. దీంతో మిషన్ భగీరథ నీటి సరఫరా పునఃప్రారంభమైంది. ఈ సందర్భంగా తమ సమస్య పరిష్కారమైనందుకు కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ'ప్రజాపక్షం'పత్రికకు కృతజ్ఞతలు తెలిపా రు.




## అటవీ నేరాల అదుపునకు హంటర్ సేవలు



**ప్రజాపక్షం / కాసిపేట :**అటవీ నేరాలను అరికట్టేందుకు ఉపయోగిస్తున్న హంటర్ అనే బెల్జియం జాగిలం పనితీరు గురించి అటవీశాఖ అధికారులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. బెల్లంపల్లి రేంజ్ అధికారి పూర్ణచందర్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి రేంజ్ పరిధిలోని ముత్యంపల్లి, ధర్మారావుపేట సెక్షన్‌లోని బుగ్గగూడ, చింతగూడ, వెంకటాపూర్ గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ముత్యంపల్లి డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బి. ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ అక్రమంగా చెట్లు నరికే వారిని, వన్య ప్రాణులను వేటాడే వారిని హంటర్ వారి వెనుక వాసన ఆధారంగా పసిగట్టి పట్టుకుంటుందని తెలిపారు. ఇటీవల జన్నారం డివిజన్‌లో జరిగిన ఒక సంఘటనలో, చెట్లు నరికి పారిపోయిన నిందితుడిని హంటర్ ఐదు కిలోమీటర్ల దూరం వెంబడించి పట్టుకుందని వివరించారు. అటవీ నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. అడవులను, వన్యప్రాణులను రక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డాగ్ స్క్వాడ్ సిబ్బంది అనిల్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ సత్యనారాయణ, బీట్ ఆఫీసర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలను
# ఐక్యంగా తిప్పికొడదాం

### ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్




**ప్రజాపక్షం /సంగారెడ్డి :**కార్మికుల సమస్యల పరిష్కారానికి ఎఐటియుసిఆధ్వర్యంలో భవిష్యత్తులో మిలిటెంట్ ఉద్యమాలు కనీస వేతనం 26 వేల రూపాయలు ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని,స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఎఐటియుసిరాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ అన్నారు. ఎఐటియుసి కార్యాలయంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు కామ్రేడ్ రహమాన్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ మాజీ జాతీయ కార్యదర్శి మాజీ ఎంపి కార్మిక ఉద్యమ దిక్సూచి అయినటువంటి సురవరం సుధాకర్‌రెడ్డి సంగారెడ్డి జిల్లా సమితి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షుడు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో కార్మికుల సమస్యలు పరిష్కారం కోసం మిలిటెంట్ ఉద్యమాలు నిర్వహించాలని పరిశ్రమ కార్మికులు సంఘటిత స్కీమ్ వర్కర్ల సమస్యలపై ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్నటువంటి కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగాఎఐటియుసిగా మన సంఘం ఇంకా కార్యాచరణ రూపొందించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చినటువంటి కార్మిక చట్టాలను యథావిధిగా అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పది గంటల పని దినాన్ని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనేవెనక్కి తీసుకోవాలన్నారు. కార్మికులకు అనేక చట్టాలు తీసుకొచ్చినటువంటి కీర్తి ఘనత కేవలం ఎఐటియుసి ఫలితంగా వచ్చిందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం 26 వేలకు పెంచాలని ఆయన అన్నారు. స్కీం వర్కర్లు అంగన్వాడీ ఆశ మధ్యాహ్న భోజన నిర్వాహకులు కార్మికుల పరిశ్రమలలో పనిచేసే కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై వెంటనే ఆందోళన చేపట్టాలన్నారు. ఈసమావేశం కార్యాచరణ రూపొందించిందని ఆయన అన్నారు. హాస్పిటల్ కార్మికులకు కనీస వేతనం ఇచ్చేంతవరకు ఎఐటియుసి పోరాడుతుందని ఆయన అన్నారు. మున్సిపల్‌కార్మికులకు క్యాటగిరీగా హాయిగా వేతనాలు చెల్లించాలని కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. లేని యెడల పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు నీరుడి సాయిలు, కార్యదర్శి వెంకట రాజ్యం, ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి కోశాధికారి అంజనేయులు కార్యనిర్వాహక అధ్యక్షుడు నీరుడి సాయిలు కార్యదర్శి వెంకటరాజ్యం ఉపప్రధాన కార్యదర్శి చిరంజీవి కోశాధికారి అంజనేయులు కార్యనిర్వాహక అధ్యక్షుడు బోయిని ప్రసాద్ ఉపాధ్యక్షుడు ఆనంద్, సలీం, ఆర్ లక్ష్మి , ఎం. ఎఖాజా ,ప్రవీణ్, శివశంకర్ , మల్లేశం, శంకరప్ప మహబూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేటి ప్రజావాణికి 44 దరఖాస్తులు: కలెక్టర్ ప్రావీణ్య



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశమందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, నారాయణఖేడ్,సబ్ కలెక్టర్ ఉమా హారతి ,అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాదురి , డిఆర్‌ఓ పద్మజరాణి లకు విన్నవిస్తూ పిర్యాదులను సమర్పించారు.మొత్తం 44 ఫిర్యాదులు అందాయి. ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి సంబందిత శాఖల అధికారి వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అదికారులు సిబ్బంది. పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల సత్వర పరిష్కారంపై కలెక్టర్ ఆదేశం



**ప్రజాపక్షం / నస్పూర్ :**ప్రజావాణి కార్యక్రమ ంలో వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరి ంచాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారుల ను ఆదేశించారు. సోమవారం నస్పూర్‌లోని స మీకృత జిల్లా కార్యాలయ భవనంలో నిర్వహించి న ప్రజావాణిలో ఆయన అదనపు కలెక్టర్ (రెవె న్యూ) పి. చంద్రయ్య, మంచిర్యాల రెవెన్యూ మం డల అధికారి శ్రీనివాస్ రావుతో కలిసి ప్రజల ను ండి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. మంచిర్యాల పట్టణం సాయికుంట కాలనీలో కో తుల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారు. నస్పూర్ మండలం తీగల్‌పహాడ్‌కు చెందిన మండ రాయమల్లు, మండ శ్రీనివాస్ తమ ఇంటికి అసెస్‌మెంట్ రికార్డులు ఇప్పించాలని కోరారు. భీమారం మండలం అంకుసాపూర్‌కు చెందిన కామెర లక్ష్మి దివ్యాంగ పింఛను రిజెక్ట్ కావడంతో వితంతు పింఛను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మందమర్రి మండలం పొన్నారం గ్రామానికి చెందిన పుప్పాల సంతోష్ సాదా బైనామా భూమికి పట్టాదారు పాస్ పుస్తకాలు కోరారు. అంకుశం గ్రామానికి చెందిన పిట్టల సునంద, సుద్దాల గ్రామానికి చెందిన రామగిరి కిష్టయ్య ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నారు. గ్రౌండ్ బస్తీకి చెందిన కుక్కల అనసూయకు ఉపాధి కల్పించాలని, శ్రీపతినగర్‌కు చెందిన సముద్రాల సుజాత దివ్యాంగ పింఛను ఇప్పించాలని అర్జీలు సమర్పించారు. జైపూర్ మండలం ఇందారానికి చెందిన దగ్గుల వేణు తమ భూమిని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ రైల్వే ట్రాక్ కోసం తీసుకున్నందున ఉపాధి కల్పించాలని కోరారు. జిల్లాలో దళితులపై దాడులను అరికట్టేందుకు ఎస్‌సి, ఎస్‌టి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని దళిత సంఘాల ప్రతినిధులు బొజ్జ శరత్, నక్క శ్రీనివాస్, తీగల శ్రీనివాస్ కోరారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## వరద ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే, కలెక్టర్


### నీటమునిగిన పంటలు, కొట్టుకుపోయిన రోడ్ల పరిశీలన



**ప్రజాపక్షం/నిజామాబాద్ :**జిల్లాలో ఏకధాటిగా కురిసిన భారీ వర్షాలతో నష్టం వాటిల్లిన బోధన్ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో సోమవారం ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి అధికారులతో కలిసి పర్యటించారు. గోదావరి ఉధృతితో నవీపేట్ మండలం యంచ, అల్జాపూర్, మిట్టాపూర్, కోస్లీ తదితర ప్రాంతాల్లో నీటమునిగిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరద ప్రవాహం దాటికి కొట్టుకుపోయిన పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బి రోడ్లు, పడిపోయిన విద్యుత్ స్తంభాలు, ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు తదితర వాటిని పరిశీలించారు. కోస్లీ పుష్కరఘాట్ వద్ద గోదావరి నది వరద ప్రవాహాన్ని గమనించారు. వరదలతో వాటిల్లిన నష్టంపై ఎదుర్కొన్న ఇబ్బందులపై బాధిత రైతులు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎమ్మెల్యే కలెక్టర్లకు పరిస్థితి తీవ్రతను వివరిస్తూ ఆవేదన వెలిబుచ్చారు. వరదలతో నష్టపోయిన వారిని ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. వాతావరణ మార్పుల ప్రభావంతో అతి భారీ వర్షాలు కురిసిన కారణంగా శ్రీరాంసాగర్‌కు వరద పోటెత్తి గోదావరి పరివాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయన్నారు. వరద తాకిడికి గురైన పంటల విషయంలో వ్యవసాయాధికారులందించే సూచనలను పాటి స్తూ పంటలను కాపాడుకునే ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి రైతులకు సూచించారు. వీరి వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, అంతిరెడ్డి రాజిరెడ్డి, ఆర్‌డిఓ రాజేంద్రకుమార్, గోవింద్, అధికారులున్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42శాతం రిజర్వేషన్లు

### మంచిర్యాల ఎమ్మెల్యే నివాసం వద్ద కాంగ్రెస్ నాయకుల డిమాండ్



**ప్రజాపక్షం/మంచిర్యాలటౌన్:**స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంచిర్యాల ఎమ్మెల్యేనివాసం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమయ్యా రు. డిసిసి అధ్యక్షురాలు శ్రీమతి కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు ఆదేశాల మేరకు ఈ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి ప్రధాన కార్యదర్శి, పెద్దపల్లి పార్లమెంట్ ఇన్‌చార్జ్ రహమత్ హుస్సేన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడిన వారికి రాబోయే స్థానిక ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు, విద్యార్థి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## బిసిల రాజకీయ భవిష్యత్తుకు కాంగ్రెస్ వారధి

### జిల్లా ఇన్‌చార్జీ రామ్ భూపాల్



**ప్రజాపక్షం/నిర్మల్ :**స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు తెలంగాణ శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన సందర్భంగా నిర్మల్ జిల్లా డిసిసిఅధ్యక్షుడు కే.శ్రీహరి రావు,జిల్లా ఇన్‌చార్జ్ రామ్ భూపాల్ హర్షం వ్యక్తం చేశారు.సోమవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ,వెనుకబడిన వర్గాలకు మంచి రోజులు వచ్చాయని పేర్కొన్నారు.ఈ సందర్భంగా శ్రీహరి రావు,జిల్లా ఇన్‌చార్జ్ రామ్ భూపాల్ మాట్లాడుతూ,విద్య,ఉద్యోగాలు,స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.గాంధీ పార్క్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు,ఈ విజయం కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలకు ఇచ్చిన ప్రాధాన్యతకు నిదర్శనమని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసిప్రధాన కార్యదర్శి ఎంబడి రాజేశ్వర్,గ్రంథాలయ చైర్మన్ అంజుమం,మార్కెట్ కమిటీ చైర్మన్లు భీమ్ రెడ్డి,అబ్దుల్ ఆది,సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సాదా సుదర్శన్,మాజీ మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్,నిర్మల్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సమర సింహారెడ్డి,కాంగ్రెస్ నాయకులు గాజుల,పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నాందేడపు చిను,బిసి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సరిపడ ఎరువుల సరఫరా

### మండల వ్యవసాయాధికారి రామకృష్ణ



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ రూరల్:**రైతులకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉంచాలని, ఎరువులు అధిక ధరలకు అమ్మితే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కాగజ్‌నగర్ మండల వ్యవసాయధికారి జి. రామకృష్ణ హెచ్చరించారు. సోమవారం మండలంలోని పలు ఎరువుల దుకాణాలు, గోడౌన్‌లను ఆస్మిక తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రైతులకు కనిపించే విధంగా స్టాక్ బోర్డుపై రాసి పెట్టాలని సూచించారు. పిఓఎస్ మిషన్ ద్వారానే ఎరువుల పంపిణీ చేయాలని అన్నారు. తనిఖీలో భాగంగా అక్కడున్న రైతులకు నానో యూరియాపై అవగాహన కల్పించారు. రైతులు నానో యూరియా వాడటం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. నానో యూరియాపై దృష్టి సారించాలని కోరారు. డీలర్లు ఎవరైనా అధిక ధరలకు ఎరువులు అమ్మితే లేదా నాసి రకం పురుగు మందులు అమ్మితే వ్యవసాయ శాఖ వారికి ఫిర్యాదు చేయాలని అన్నారు. సొసైటీలకు కొన్ని రోజుల్లో ఎరువులను రైతులకు సరిపడ ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుని ప్రతీ రైతుకు ఎరువులు అందేలా కృషిచేస్తామని తెలిపారు. రైతులకు ఎలాంటి సందేహాలు ఉన్న వ్యవసాయ శాఖ వారిని సంప్రదించి సందేహాలు నివృత్తి చేసుకోవాలని కోరారు.

## ఐట్ల గంగారెడ్డి సేవలు మరవలేనివి



**ప్రజాపక్షం/ ఆదిలాబాద్:** సి పిఐ ఆదిలాబాద్ జిల్లా బోథ్ పట్టణసీనియర్ నాయకుడు ఐట్ల గంగారెడ్డి సేవలు మరవలేనివని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడుఎస్ విలాస్ గుర్తు చేసుకున్నారు. ఐట్ల గంగారెడ్డి అనారోగ్య కారణంగా సోమవారం ఉదయం 4గంటలకు తుది శ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి, రాష్ట్ర కౌ న్సిల్ సభ్యుడు ఎస్ విలాస్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ విలాస్ మాట్లాడుతూ ఇట్ల గంగారెడ్డి గత 70 సంవత్సరాల పాటు సిపిఐపార్టీ,ఎఐటియుసిలో సేవలందించారన్నారు.అంతిమ యాత్ర లో నాయకులు పాల్గొని నివాళులర్పించారు.

## పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం

### జిల్లా ఎస్‌పిపరితోష్ ఫంకజ్



**ప్రజాపక్షం /సంగారెడ్డి :** పోలీసు కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం నాడు నిర్వహించారు. ఈ ప్రజావాణి కార్యక్రమాన్నికి వివిద మండలాలనుండి జిల్లాపోలీస్ కార్యాలయానికి వచ్చిన పిర్యాదుదారుల నుండి పిర్యాదులను జిల్లా ఎస్పీ పరితోష్ ఫంకజ్ పిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ పిర్యాదుదారుల సమస్యలు ఓపికగా విని వారి సమస్య స్థితి జాప్యానికి గల కారణాలను సంబందిత ఎస్.హెచ్,. ఓకుపోన్ ద్వార మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. చట్టాన్ని అమలు పరచడం ఏలాంటి అలసత్వం చూపరాదని చట్టప్రకారం కేసులను పరిష్కరిచాల్సిందిగా ఎస్‌హెచ్ ఓలకు సూచనలు చేయడం జరిగింది. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానికంగా పరిష్కార దొరకని సందర్భంలో నిర్భయంగా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఏలాంటిపైరవీలకు తావు లేకుండా స్వచ్ఛందంగా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను వినియోగించుకోవాలన్నారు. సమస్యలను చట్ట ప్రకారం పరిష్కరించేందుకు సత్వర న్యాయం చేసేందుకు పోలీసు శాఖ ప్రజలకు మరింత దగ్గరయ్యేలా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుదని జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలసిందిగా జిల్లా ఎస్పీ సూచించారు.


## రైతు ప్రభుత్వం రైతులను కచ్చితంగా ఆదుకుంటుంది

### మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు



**ప్రజాపక్షం/పాపన్నపేట:**కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ప్రభుత్వమని, వర్షాలతో పంటలను నష్టపోయిన రైతులను క చ్చితంగా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎవరు అధైర్య పడద్దని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం మండల పరిధిలో నిగాంధారి పల్లిలో నష్టపోయిన వరి పంట పొలాలను ట్రాక్టర్ పై మండల నాయకు లతో కలిసి వెళ్లి పంట పొలాలను పరిశీలించారు. రైతుల ను ఓదార్చి ధైర్యం చెప్పారు.. అక్కడి నుండి జిల్లా కలెక్టర్ కు ఫోన్లో మాట్లాడి నష్టపోయిన రైతు వివరాలను త్వరగా సేకరించాలని ఆదేశించారు. సేకరించిన వివరాలను ము ఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా చూస్తానన్నారు. అంతకుముందు నా గుసాను పల్లిలోని ఇటీవల మరణించిన ఏడుపాయల మా జీ చైర్మన్ నరసింహులు గౌడ్ మాతృమూర్తి మాజీ సర్పంచ్ కర్నర్ల భూదేవి దశదినకర్మలు పాల్గొని ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శి ంచి ఓదార్చారు. ఇటీవల వచ్చిన వరదలతో జయరాం తా ండకు వెళ్లే దారిలో జ౦గరెడ్డి కుంట తెగి పోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. కుంటను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులకు ఆదేశించారు. అనంతరం కొంపల్లిలో సుమారు 15 మంది ఆయన సమక్షంలో కాంగ్రెస్ పార్టీ చేరారు. జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్ రెడ్డి, ప్రశాంత్ రెడ్డి, డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంత్, నాయకులు ,తదితరులు ఉన్నారు.

## చారుశీలను పరామర్శించిన ఎఐటియుసి నాయకులు



**ప్రజాపక్షం/ఆదిలాబాద్:** తెలంగాణ రాష్ట్ర అంగన్‌వాడీ టీచర్, హెల్పర్స్ అసోసియేషన్(ఎఐటియుసి) నాయకురాలు చారుశీల అనారోగ్యంతో బాధపడుతున్నారు. విష యం తెలుసుకున్న ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్ విలాస్ వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ విలాస్ మాట్లాడుతూ చారుశీల అంగన్‌వాడీ యూనియన్ అభివృద్ధికి చాలా పాటుపడిందని అన్నారు. వా రు ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. ఎళ్లవేళల తమ సహకారం ఉంటుందని హామి ఇచ్చారు. చారుశీల పదవీ విరమణ పొంది సంవత్సరం దాటిన ఇప్పటి వరకు ప్రభుత్వం విరమణ డబ్బులు చెల్లించలేదని, ప్రభుత్వం వెంటనే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు ఉన్నారు.

## కాళేశ్వరం ప్రాజెక్టును సిబిఐకి అప్పగించడం కుట్రపూరిత చర్య

### మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి ధ్వజం



**ప్రజాపక్షం/మెదక్ :**కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పై అసత్య ప్రచారం చేస్తూ కుట్రపూర్వక చర్యలకు పునుకుందని,కాళేశ్వరం ప్రాజెక్టును సిబిఐకి అప్ప చెప్పడం కుట్రపూరిత చర్య అని దీనికి నిరసనగా మెదక్ జిల్లా బిఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, నాయకులు మామిల్ల ఆంజనేయులు, మల్లికార్జున్ గౌడ్, బిఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి సోమవారం మెదక్ జిల్లా శంకరంపేట్ ఆర్ మండల కేంద్రం లోని తెలంగాణ అమరవీరుల స్థూపానికి కాళేశ్వరం జలాలతో జలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం మెదక్,శంకరంపేట్ రహదారిపై బిఆర్‌ఎస్ పార్టీ నాయకులతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా రాస్తారోకో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా పద్మా దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ, కాళేశ్వరం ప్రాజెక్టును కుట్రపూరితంగా సిబిఐకి కాంగ్రెస్ పార్టీ అప్పచెప్పుతుందని ఆరోపించా రు.తెలంగాణ ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టు ఒక దిక్సూచి లాంటిదన్నారు. కాళేశ్వరం కోసం మరో ఉద్యమం చేయడానికి అయినా సిద్ధమే అని అన్నారు. తెలంగాణ ప్రజలకు కాళేశ్వరం ప్రాజెక్టు కట్టి నీళ్లు తెచ్చిన ఘనత కేసిఆర్ గారిదే అన్నారు. ప్రాజెక్టు కోసం మరో ఉద్యమం చేయడానికి అయినా సిద్ధమే అని అన్నారు. మెడిగడ్డ రెండు పిల్లర్లు కొంగితే రిపేరు చేస్తే సరిపోతుంది . అసెంబ్లీలో మాజీ మంత్రి హరీష్ రావు అన్ని సాక్షాలతో సహా సమాధానాలు చెప్పిన రేవంత్ ప్రభుత్వం కుట్ర పూర్వకంగా కాళేశ్వరం సిబిఐ వికీ అప్పచెప్పడం దురదృష్టకరం అన్నారు.ఈ కార్యక్రమంలో శంకరంపేట మండల పార్టీ అధ్యక్షుడు పట్లోరి రాజు, పిఎస్‌ఎల్ చైర్మన్ అంజిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపిలు ,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గంగా నరేందర్, మాజీ సర్పంచ్ లు ,నాయకులు ,వివిధ మండలాల నాయకులు, మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, కార్యకర్తలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## నిజాంసాగర్ నుండి లక్ష క్యూసెక్కుల అవుట్‌ఫ్లో



**ప్రజాపక్షం/నిజాంసాగర్:**నిజాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తున్నందునా గత కొన్ని రోజులుగా లక్ష క్యూసెక్కులకు పైగా వరదనీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందని ప్రాజెక్టు ఏఈ సోమవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. కాగా నిజాంసాగర్‌లోకి సోమవారం 79,403 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లోగా వస్తుండగా ప్రాజెక్టు 14 వరద గేట్లు ఎత్తి 1,00,243 క్యూసెక్కుల నీరు దిగువన గల మాంజీరాలోకి వదిలిపెడుతున్నట్లు అధికారులు పేర్కొన్నారు. నిజాంసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 1405.00 అడుగులు, 17.802 టీఎంసీలకు గాను ప్రస్థుతం 1402.65 అడుగులు, 14.533 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు.

# క్రీడ



# ఒలింపిక్స్ పతకమే టార్గెట్

## రైజింగ్ షూటర్ తనిష్క్

తెలంగాణ యువ షూటర్ తనిష్క్ మురళీధర్ నాయుడు టాప్ షూటర్‌గా ఎదుగుతున్నాడు. ఈ హైదరాబాదీ క్రీడాకారుడు తాజాగా ముగిసిన ఆసియా జూనియర్స్ షూటంగ్ చాంపియన్‌షిప్‌లో రెండు పతకాలు సాధించాడు. ఒలింపిక్స్‌లో పతకమే టార్గెట్‌గా తనిష్క్ తన ట్యాలెంట్‌కు పదును పెడుతున్నాడు. కజకిస్తాన్‌లోని షిమ్‌కెంట్‌లో జరిగిన ఆసియా షూటింగ్ పోటీల్లో అతను 25 మీటర్ల స్టాండర్డ్ పిస్తోల్ వ్యక్తిగత, టీమ్ ఈవెంట్‌లో కాంస్య పతకాలు సాధించాడు. గత రెండేళ్ల నుంచి టాప్ ఫామ్‌లో ఉన్న ఆ షూటర్ ఇప్పుడు ఒలింపిక్స్‌ను టార్గెట్‌గా పెట్టుకున్నాడు. ప్రస్తుతం జూనియర్ స్థాయిలో ఆడుతున్న అతను.. త్వరలోనే సీనియర్స్ కేటగిరీలోకి ఎంట్రీ ఇవ్వనున్నాడు.

హైదరాబాద్‌లో ఉన్న ఒలింపిక్ షూటర్ గగన్ నారంగ్ అకాడమీలో తనిష్క్ శిక్షణ పొందుతున్నాడు. గన్ ఫర్ గ్లోరీ అకాడమీ నుంచి తనిష్క్ రాటుదేలుతున్నాడు. ఒలింపిక్స్‌లో ప్రాతినిధ్యం వహించడమే కాదు.. ఆ మెగా ఈవెంట్‌లో దేశానికి పతకాన్ని తీసుకురావాలన్న కాంక్షతో ట్రైనింగ్ తీసుకుంటున్నట్లు తనిష్క్ చెప్పాడు. నమస్తే తెలంగాణతో మాట్లాడిన తనిష్క్.. ఇటీవల ముగిసిన ఆసియా చాంపియన్‌షిప్ ఫలితంపై సంతోషం వ్యక్తం చేశాడు. తన ప్లానింగ్, ప్రిపరేషన్ గురించి అతను వెల్లడించాడు. చాలా నిలకడగా, ఫోకస్డ్‌గా షూటింగ్ ప్రాక్టీస్ కొనసాగిస్తున్నట్లు తనిష్క్ తెలిపాడు. ఖేలో ఇండియా, ప్రాజెక్టు లీప్ ప్రస్తుతం స్పాన్సర్‌షిప్ కల్పిస్తున్నాయన్నాడు. మునుముందు మరింత ప్రోత్సాహం లభిస్తే, షూటింగ్ ఫీల్డ్ మరిన్ని పతకాలు గెలవడం ఖాయమని తనిష్క్ చెప్పాడు. తనిష్క్ తండ్రి శ్రీనివాస్ రావు. ఆయన భారతీయ నౌకాదళంలో పనిచేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న రక్షణశాఖకు చెందిన డిజైన్ ఇంజినీర్ శాఖలో పనిచేస్తున్నారు. షూటర్ తనిష్క్ తల్లి అనురాధ. ఆమె ఇంటి పని చూసుకుంటూ.. కుమారుడిని తీర్చిదిద్దుతున్నారు. తనిష్క్‌కు అన్నిరకాలుగా ఆమె మనోధైర్యాన్ని ఇస్తున్నారు.

# కొత్త జర్నీకి శ్రీకారం

## ఇంటర్నేషనల్ టీ–20 లీగ్‌లో అశ్విన్

ఇండియన్ ప్రీమియర్ లీగ్‌కు వీడ్కోలు పలికిన రవిచంద్రన్ అశ్విన్ కొత్త జర్నీకి శ్రీకారం చుడుతున్నాడు. విదేశీ లీగ్స్‌లో ఆడేందుకే ఐపీఎల్ నుంచి వైదొలిగిన ఈ స్పిన్ ఆల్‌రౌండర్ వేలానికి సిద్ధమవుతున్నాడు. దుబాయ్ వేదికగా జరిగే ఇంటర్నేషనల్ టీ–20 లీగ్‌లో అశ్విన్ పేరు రిజిష్టర్ చేసుకున్నాడు. నాలుగో సీజన్ కోసం సెప్టెంబర్ 30న జరుగబోయే వేలం జరుగనుంది. ఈ ఆక్షన్‌లో మ్యాచ్ విన్నర్ అయిన యశ్ కోసం ఫ్రాంచైజీలు కోట్లు కుమ్మరించే అవకాశముంది. ఐపిఎల్‌కు అల్విదా పలికిన అశ్విన్ తన భవిష్యత్ ప్రణాళికలు.. తదుపరి ఆడబోయే లీగ్ గురించి క్రిక్‌బజ్‌తో పలు విషయాలు పంచుకున్నాడు. తాను ఇంటర్నేషనల్ టీ20 వేలంలో పేరు నమోదు చేసుకున్నానని భారత మాజీ స్పిన్నర్ వెల్లడించాడు. 'త్వరలోనే ఐఎల్‌టీ20 నాలుగో సీజన్ వేలం మొదలవ్వనుంది. కాబట్టి నా పేరును రిజిష్టర్ చేసుకున్నా. నన్ను ఎవరో ఒకరు కొంటారనే నమ్మకంతో ఉన్నాను' అని అశ్విన్ పేర్కొన్నాడు.





# మహిళా క్రికెట్‌కు కాసుల వర్షం

## విజేతకు భారీ ప్రైజ్‌మనీ ప్రకటించిన ఐసిసి!

మహిళా క్రికెటర్లు బూరెల బుట్టలో పడినట్లే. విజేతగా నిలిచిన జట్టుకు కాసుల వర్షం కురవనుంది. ఈ నెలాఖరు నుంచి మహిళల వన్డే ప్రపంచకప్ మొదలుకానుంది. ఆ టోర్నీ ప్రైజ్‌మనీని ఐసిసి ప్రకటించింది. పురుషుల వన్డే ప్రపంచకప్ 2023 కంటే ఈసారి ఎక్కువగా మహిళా వరల్డ్ కప్ కోసం కేటాయించడం గమనార్హం. గతంలో అందుకొన్న మొత్తం కంటే మూడు రెట్లు అధికంగా ఆయా జట్లకు ప్రైజ్‌మనీగా దక్కనుంది. మహిళల వన్డే ప్రపంచ కప్ ప్రైజ్‌మనీగా 13.88 మిలియన్ డాలర్లను ఐసిసి ప్రకటించింది. గత వరల్డ్ కప్ (3.5 మిలియన్ డాలర్లు) కంటే మూడు రెట్లు కావడం విశేషం. మన భారత రూపాయల్లో దాదాపు 122 కోట్లు. ఇప్పుడు విజేతగా నిలిచే టీమ్‌కు రూ.39.50 కోట్లు (4.4 మిలియన్ డాలర్లు) దక్కనున్నాయి. భారత్ వేదికగానే జరిగిన 2023 పురుషుల వన్డే ప్రపంచకప్ ప్రైజ్‌మనీ రూ. 88 కోట్లు (10 మిలియన్ డాలర్లు). అప్పుడు విజేతగా నిలిచిన ఆస్ట్రేలియాకు రూ.35 కోట్లు (4 మిలియన్ డాలర్లు) దక్కాయి. ఇప్పుడు అంతకంటే ఎక్కువే మహిళా టీమ్‌కు అందనుంది.

విజేతకు దక్కే మొత్తం: రూ.39.50 కోట్లు
రన్నరప్ ప్రైజ్‌మనీ: రూ.19.78 కోట్లు
సెమీఫైనలిస్టులు: రూ.9.75 కోట్లు
ఐదు, ఆరు స్థానాల్లో నిలిచే జట్లు: రూ.4.50 కోట్లు
ఏడు, ఎనిమిదో స్థానాల్లో నిలిచే జట్లు: రూ.2.20 కోట్లు
వరల్ కప్‌లో ఆడిన ప్రతి జట్టుకూ అదనంగా రూ.2 కోట్లు దక్కనున్నాయి.

**చరిత్రాత్మకం: జై షా**

ఐసిసి అధ్యక్షుడు జై షా ప్రైజ్‌మనీ పెంచడాన్ని మహిళల క్రికెట్ దిశగా ఓ చారిత్రాత్మక ముందడుగుగా అభివర్ణించారు. ఈ ప్రకటన మహిళల క్రికెట్ ప్రయాణంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని.. ప్రైజ్‌మనీ నాలుగు రెట్లు పెరుగడంతో క్రీడ దీర్ఘకాలిక వృద్ధికి తమ నిబద్ధతను ప్రతిబింబిస్తుందన్నారు. మహిళా క్రికెటర్లు క్రికెట్‌ను వృత్తిగా కొనసాగించిన సమయంలో.. పురుషులతో సమాన గౌరవం, అవకాశాలు లభిస్తాయని నమ్మకంగా ఉండాలని ఐసిసి సందేశం ఇస్తుందని స్పష్టం చేస్తుందన్నారు. ఈ మార్పు రాబోయే తరం మహిళా క్రీడాకారులు, అభిమానులకు స్ఫూర్తినిస్తుందని.. ప్రపంచవ్యాప్తంగా మహిళా క్రికెట్‌ను కొత్త శిఖరాలకు తీసుకెళుతుందని ఐసిసి పేర్కొంది.

# యువతరంగం

## ఫోకస్

# ప్రమాదంలో యువత భవిత




నేటి సమాజంలో సోషల్ మీడియా ప్రాధాన్యం ఎంతగా పెరిగిందో చెప్పనవసరం లేదు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్, ట్విట్టర్, వాట్సాప్ వంటి వేదికలు ప్రతి ఇంటిలోనూ, ప్రతి చేతిలోనూ లభ్యమవుతున్నాయి. జ్ఞానాన్ని పంచుకునే సాధనాలుగా సోషల్ మీడియా మారితే ఎంత మేలు? కానీ చాలా సందర్భాల్లో యువతను అవి వేరే దారిలోకి నడిపిస్తూ సమయాన్ని వృథా చేస్తూ, భవిష్యత్తుకు ముప్పుగా ప్రమాదకరంగా మారుతున్నాయి. సినిమా సెలబ్రిటీలు, రాజకీయ నాయకులు, క్రీడాకారులు అందరూ సోషల్ మీడియాలో చురుకుగా ఉంటున్నారు. వారు పెట్టే పోస్టులు, వీడియోలు యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. మొదట ఆరంభంలో వినోదం కోసం అయితే తర్వాత అది అలవాటుగా మారి గంటల తరబడి స్క్రోలింగ్ చేయడం, వీడియోలు చూడడం సర్వసాధారణమైంది. ఫలితంగా, జీవితంలో అత్యంత ముఖ్యమైన ఆస్తిగా పరిగణించాల్సిన సమయం వృథా అవుతున్నది. చదువుకోవడం, నైపుణ్యాలు పెంపొందించుకోవడం, భవిష్యత్ సాధన కోసం కేటాయించాల్సిన విలువైన సమయాన్ని యువత ఎక్కువ భాగం సోషల్ మీడియాలోనే గడుపుతున్నారు. ఒక గంట మాత్రమే అనుకున్నా అది రోజుకు నాలుగైదు గంటలుగా మారిపోతోంది. ఈ సమయాన్ని సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల వారు కెరీర్‌లో వెనుకపడే ప్రమాదం ఉంది. అధికంగా సోషల్ మీడియాను వాడటం వల్ల పోలికల మనస్తత్వం పెరుగుతుంది. ఇతరుల జీవితాన్ని చూసి, తమను తాము నిందించుకోవడం, తమ పరిస్థితి అధ్వాన్నంగా ఉందని కుంగిపోవడం వంటి లక్షణాలు పెరుగుతాయి. ఈ పోల్చుకోవడం అనే తత్వం ఒక్కోసారి వారి బలవన్మరణాలకు కూడా కారణమవుతున్నది. అత్యధిక 'స్క్రీన్‌టైమ్' వల్ల నిద్రలేమి, చదువుపై ఏకాగ్రత కోల్పోవడం వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఈ వ్యసనం ఒకసారి పెరిగితే, దాని నుంచి బయటపడటం చాలా కష్టం. సమయం వృథాతోపాటు తలెత్తే మరో పెద్ద ముప్పు భద్రతా లోపం. వ్యక్తిగత వివరాలు పంచుకోవడం, అనవసర వ్యక్తులతో పరిచయం కావడం ద్వారా మోసాలకు, మానసిక ఇబ్బందులకు గురయ్యే ప్రమాదం ఉంది. యువత వయసులో ఉండే అమాయకత్వాన్ని కొంతమంది దుర్వినియోగం చేస్తున్నారు. ఎంత మంది యువతీయువకులు ఈ కారణంగా జీవితాలను నాశనం చేసుకుంటున్నారో, కొంత మంది ఏ విధంగా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారో చూస్తునే ఉన్నాం. మహమ్మారిగా విస్తరిస్తున్న 'ఓవర్ స్క్రీన్ టైమ్' రుగ్మత నుంచి బయటపడాలంటే, ముందుగా సమయపాలన అవసరం. రోజుకు ఒక నిర్ణీత సమయం మాత్రమే సోషల్ మీడియాకు కేటాయించాలి. ఉపయోగకరమైన వనరులు మాత్రమే వాడుకోవడాన్ని అలవాటు చేసుకోవాలి. అధ్యయనం, నైపుణ్యాల అభ్యాసానికి సంబంధించిన వీడియోలు, సమాచారమనే వినియోగించుకోవడం ఉత్తమం. ఈ విషయాల్లో ప్రతి ఒక్కరూ స్వీయ నియంత్రణ పాటించాలి. నిర్దిష్ట లక్ష్యాలను నిర్ణయించుకుని వాటి సాధనపై దృష్టి పెట్టాలి. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం కూడా యువతకు అవసరమన్నది ప్రతి ఒక్కరూ గ్రహించాలి. యువతను సరైన దిశగా నడిపించే బాధ్యతను స్వీకరించాలి. ఏదిఏమైనా సోషల్ మీడియా వాడకాన్ని పూర్తిగా మానేయడం సాధ్యం కాని పని. కానీ దాన్ని సరైన రీతిలో, పరిమిత సమయంలో వాడడం మాత్రమే మన భవిష్యత్తును రక్షించే మార్గం. లేకపోతే విలువైన సమయం వృథా అవుతుంది, యువత భవితం ప్రమాదంలో పడుతుంది. సమయం విలువ తెలిసినవారే భవిష్యత్తు గెలుస్తారు అనే నిజం మనందరం గుర్తు పెట్టుకోవాలి.

# కృషి ఉంటే..

చంద్రుడిపైకి మనిషి వెళ్లక ముందే చంద్రయానం సాధించరాని స్వప్నం కాదని మహాకవి శ్రీశ్రీ చెప్పాడు. అసాధ్యమనేది లేనే లేదన్న ఆయన మాటలు అక్షరసత్యాలని అనేక సందర్భాల్లో రుజువైంది. అందుకు ఓ ఉదాహరణ ఉదయ్. సాధారణ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఐపిఎస్ అధికారిగా ఎదిగిన ఓ అసాధారణ పోరాటయోధుడు అతను. ఉదయ్ ఐపిఎస్‌కు సిద్ధమవుతున్నానని చెప్పినప్పుడు, సుమారు 60 మంది పోలీస్ ఆఫీసర్ల ముందు ఓ ఇన్‌స్పెక్టర్ అతనిని అవమానించాడు. 'మామూలు కానిస్టేబుల్‌వి. ఎప్పటికీ ఐపిఎస్ కాలేవు' అంటూ హేళన చేయడం ఉదయ్‌లో పట్టుదలను పెంచింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ఐపిఎస్ సాధించి తీరాలన్న తీర్మానం అతనిని ఏకదీక్షతో ముందుకు నడిపింది. 2018లో ఉదయ్ తన కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి, ఐపిఎస్ తయారీలో నిమగ్నమయ్యారు. నిజానికి అతని జీవితం సాఫీగా సాగలేదు. చిన్నతనంలోనే తల్లి మరణించింది, 17 ఏళ్ల వయసులో తండ్రి కూడా కన్నుమూయడంతో అనాథ అయ్యాడు. నాయనమ్మ వద్ద పెరిగాడు. ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నారు. భవిష్యత్తుపై తాను పెట్టుకున్న ఆశలకు కూడా ఆరంభంలో ఎదురుదెబ్బలు తప్పలేదు. ఐపిఎస్ అధికారిగా ఎదగాలనుకున్న ఆయన తొలి ప్రయత్నం (2019) విఫలమైంది. ఈ చేదు అనుభవానికి సమాధానంగా, పరీక్షలో ఉత్తీర్ణుడు కావాలన్న లక్ష్యంతో చదివారు. కానీ, 2020లో కొవిడ్ కారణంగా ఐపిఎస్ పరీక్షకు బ్రేక్ పడింది. 2021, 2022 సంవత్సరాల్లోనూ పరాజయాలు తప్పలేదు. చివరికి 2024లో ఐపిఎస్ నెగ్గాడు. ఆల్‌ఇండియా 358 ర్యాంక్ సాధించి, తన కలలు నెరవేర్చుకున్నాడు. నేడు అతను కానిస్టేబుల్ ఉదయ్ కాదు.. ఉదయ్ కృష్ణారెడ్డి ఐపిఎస్. తనను అవమానపరచిన వారే ఇప్పుడు సెల్యూట్ కొట్టే స్థాయికి ఎదిగారు, 'ది రియల్ హీరో' ఉదయ్.

**యూత్ ఐకాన్స్**

ఎంతో మంది యువతీయువకులు దేశ కీర్తిప్రతిష లను ఇనుమడింప చేశారు. చిన్న వయసులోనే అత్యున్నత శిఖరాలను అధిరోహించారు. యువతకు మార్గదర్శకులుగా నిలిచారు. అలాంటి అద్వితీయ ప్రతిభావంతుల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం..



# బీడి కార్మికులకు కనీస పెన్షన్ రూ.6000

## బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి.గోవర్ధన్, సుతారి రాములు డిమాండ్

## హనుమకొండలో రాష్ట్ర బీడీ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి సమావేశం



**ప్రజాపక్షం/హనుమకొండ :** ఇపిఎఫ్ ట్రస్టు బోర్డు కమిటీ నిర్ణయించిన ప్రకారం బీడి కార్మికులకు కనీస పెన్షన్ 6000 రూపాయలు పెంచాలని రాష్ట్ర బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బి.గోవర్ధన్, సుతారి రాములు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర సమితి సమావేశం జరిగింది. సమావేశంలో బి.గోవర్ధన్, సుతారి రాములు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయకుండా అలసత్వం వహిస్తుందని ఆరోపించారు. బీడి పరిశ్రమపై విధించిన ఆంక్షలను నిలిపివేసి పరిశ్రమను రక్షించి కార్మికుల ఉపాధిని కాపాడాలన్నారు. బీడి పరిశ్రమపై జిఎస్‌టిని తగ్గించి, బీడీ కార్మికుల సంక్షేమ నిధి సెస్సును యధావిధిగా కొనసాగించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. బీడి కార్మికుల పిల్లలను ప్రోత్సహించే విధంగా ఉపకార వేతనాలు పెంచాలన్నారు. సంక్షేమదవఖానాలో డాక్టర్లను, సిబ్బందిని పెంచి, మందులు స్టాకు ఉంచాలన్నారు. బీడి కంపెనీలలో నెలలో 26 రోజులు పని కల్పించి, ఆకు, తంబాకు చేతినిండా ఇవ్వాలని, నాసిరకం తునికాకు సరఫరా చేయడంతో 1000 బీడిలకు సరిపోక సగం తొట్టి నింపడం జరుగుతుందని, దీంతో సగం కూలీ నష్టపోతున్నారన్నారు. నాసిరకం తునికాకు వాపస్ తీసుకోవాలని, కటింగ్ బేసిక్ పైకి కత్తిరించి ఆవరేజ్ పెంచాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం 2014 కట్ ఆఫ్ తేదీని ఎత్తివేసి 2016 రూపాయల జీవన భృతిని నాలుగు వేల రూపాయలకు పెంచాలన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించి ఇవ్వాలని, స్థల ఉండి నిర్మించుకోలేని కార్మికులకు ఐదు లక్షల నుండి రూ.10 లక్షలు ఆర్థిక సహాయం పెంచాలన్నారు. తమిళనాడు రాష్ట్రంలో ఆల్ ఇండియా బీడి సిగార్ వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ కౌన్సిల్ తీర్మానం ప్రకారం తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ జిల్లా కేంద్రం జాతీయ కమిటీ సమావేశం డిసెంబర్ 9.10 తేదీలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బీడి వర్కర్స్ ఫెడరేషన్ జాతీయ మహాసభలు బీహార్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల అనంతరం జరుగుతాయన్నారు. సమావేశంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్‌వి స్టాలిన్, ఎఐటియుసి హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, బీడి వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సహాయకార్యదర్శులు కొక్కుల శాంత, కెవి.అనసూయ, కె.గోదావరి, బత్తిని సదానందం, కడారి రాములు, ఎస్.భానుచందర్, తిరునారి లక్ష్మణ్, రాష్ట్ర కోశాధికారి ఎండి.ముక్రం, నాయకులు అనుకరి అశోక్, డి.మహేష్, ఎండి కాసిం, ఆది రంగారెడ్డి, గుంటి రాజేందర్, జగిత్యాల, నిజామాబాద్, వరంగల్, హనుమకొండ, సిద్ధిపేట, మెదక్, అదిలాబాద్, రాజన్న సిరిసిల్ల జిల్లాల నుండి రాష్ట్ర సమితి సభ్యులు పాల్గొన్నారు.

# ఇండ్ల స్థలాల కోసం పోరాటాలు



## సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

## సిపిఐలో 50 కుటుంబాల చేరిక

**ప్రజాపక్షం/ధర్మసాగర్ :** పేదలకు ఇళ్ల స్థలాల కోసం ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములలో ఎర్ర జెండాల పాతి పేదల ఇండ్ల స్థలాలు కోసం భూపోరాటాలను ఉదృతం చేస్తామని సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పేర్కొన్నారు. సోమవారం ధర్మసాగర్‌లో 50కుటుంబాలు సిపిఐలో చేరగా వారికి భిక్షపతితో పాటు జిల్లా సహాయ కార్యదర్శి మద్దెల ఎల్లేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎదునూరి వెంకటరాజు సిపిఐ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మద్దెల ఎల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో భిక్షపతి మాట్లాడుతూ హనుమాకొండ జిల్లా పూర్తిగా పట్టణ ప్రాంతంగా కొనసాగుతున్నదని, వరంగల్ మహానగరంలె ఉపాధి అవకాశాలు లేక విద్యావంతులు, యువకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వారికి ఉపాధి కల్పించడం కోసం పరిశ్రమలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐలో చేరిన వారిలో భాగ్యమ్మ,ఆలకుంట్ల రాజయ్య, పల్లెపు కనకయ్య, రజిత, కుమార్, వల్లపు విజయ, కళ్యాణ్, లక్ష్మి , రంజిత్ కుమార్, మౌనిక, కళావతి, సాంబలక్ష్మి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో పిఐ నాయకులు చిలుక బాబు, వల్లపు వెంకటయ్య, అల్వాల రాజు, పద్మ, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేసి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలి




## సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా వినతి

## కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆందోళన

**ప్రజాపక్షం/వరంగల్ :** పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసి జిల్లాలో ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా కోరారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో ఏకశిల పార్క్ నుంచి వరంగల్ కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించి, కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యశారదకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా షేక్ బాష్ మియా మాట్లాడుతూ వరంగల్ జిల్లాలో సాగునీరు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు మరమ్మత్తులు చేసి, ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసి రైతులకు నీరు అందించాలన్నారు. రైతన్నకు కేంద్ర, రాష్ట్రా ప్రభుత్వాల తీరుతో కష్టాలు తప్పడం లేదన్నారు. సాగునీరు, తాగునీరు సకాలంలో అందించకుండా ప్రాజెక్టుల పేరుతో రాజకీయాలు చేస్తూ కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. సాగునీరు, యూరియా కొరతతో తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులతో పాటు, పలు ప్రాజెక్టులకు మరమ్మత్తులు చేపట్టి ఆయకట్టు చివరి వరకు నీరందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర సమితి సభ్యులు మేకల రవి మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి సాగు, తాగునీరు అందించాలని కోరారు. ఆరుకాలం కష్టించి పండించిన పంటకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పంజాల రమేష్, పనాస ప్రసాద్, దండు లక్ష్మణ్, బుస్స రవీందర్, గుండే భద్రి, సంగీ ఏలేందర్, గన్నారపు రమేష్, తోట చంద్రకళ, ల్యాదల్ల శరత్, కందిక చెన్నకేశవులు, ఓర్సు రాజు, ఎండి అక్బర్ పాషా, పార్థసారథి, సుంకరి భవాని, గోవర్ధన్, చిట్యాల సువర్ణ, పనికిరాల రమేష్, అయితే యాకయ్య, చిరంజీవి, శ్వేత, మహేష్ ,దస్రు తదితరులు పాల్గొన్నారు.

# ముంపు సమస్య శాశ్వతంగా పరిష్కరించండి

## సిపిఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా డిమాండ్

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన సిపిఐ ప్రతినిధుల బృందం

**ప్రజాపక్షం/కొత్తగూడెంటౌన్ :** కొత్తగూడెం కార్పొరేషన్, పరిసర ప్రాంతాల్లో ముంపునకు గురవుతున్న ప్రాంతాలను గుర్తించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. భారీ వర్షాలతో ముంపుకుగురైన ఎస్‌సిబి నగర్, విద్యానగర్ తదితర ప్రాంతాల్లో సోమవారం సిపిఐ ప్రతినిధుల బృందం పర్యటించింది. బాధిత ప్రజలను కలుసుకొని జరిగిన నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారుల సమాచారం ఇచ్చి ప్రభావిత ప్రాంతాలకు రప్పించి పరిస్థితులను వివరించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ భారీవర్షాలతో అంతర్గత రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ స్తంబాలు, కల్వర్టులు దెబ్బతిన్నాయని, దీంతో ప్రజలు ఇబ్బందులకు గురి అవుతున్నారన్నారు. వర్షాలు కొనసాగితే మరింత ప్రమాదం పరిస్థితులు నెలకొంటాయని, అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి యుద్ధ ప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలని, పునఃనిర్మాణపనులు చేపట్టాలని కోరారు. ఇండ్లు కోల్పోయిన పేదలకు నష్టపరిహారం, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాలతో సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచివుందని తక్షణమే వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి వైద్యం అందించాలన్నారు. సమస్యను స్థానిక ఎమ్మెల్యే కూనంనేని దృష్టికి తీసుకెళ్లామని, అత్యవసర నిధులు మంజూరు చేయించి ముంపు సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పాతకొత్తగూడెంపెనుబల్లి బ్రిడ్జిని సందర్శించి ప్రమాదకర పరిస్థితులను పరిశీలించారు. కూనంనేని కృషితో పెనుబల్లి బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవల రూ.6.50 కోట్లు సిఆర్‌ఆర్ మంజూరయ్యాయని, అక్టోబర్‌లో పనులు ప్రారంభం అవుతాయని, వచ్చే వర్షాకాలం నాటికి పనులు పూర్తయి పెనుబల్లి బ్రిడ్జి సమస్యకు శాశ్వత పరిస్కారం లభిస్తుందన్నారు. ప్రతినిధి బృందంలో సాబీర్ పాషా వెంట నాయకులు కంచర్ల జమలయ్య, వాసిరెడ్డి మురళి, మునిగడప వెంకటేశ్వర్లు, నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు, సందెబోయిన శ్రీనివాస్, మల్లేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



## నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి : దండి సురేష్



**కొణిజర్ల :** భారీవర్షాల కారణంగా నష్టపోయిన పంటలను అంచనా వేసి ఎకరాకు రూ.25వేల చొప్పున పరిహారం అందించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ డిమాండ్ చేశారు. సోమవారం సిపిఐ ప్రతినిధి బృందం కొణిజర్ల మండలంలో భారీవర్షాలకు నీటమునిగిన ప్రాంతాలను పరిశీలించారు. తనికెళ్ల సమీపంలో నీట మునిగిన పంటలను పరిశీలించిన అనంతరం దండి సురేష్ మాట్లాడుతూ రైతులు ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి నష్టపోయారని తెలిపారు. నీటి పరివాహక ప్రాంతాలతో పాటు మెట్ట పంటలు, ముఖ్యంగా పెసర, పత్తిపంటలు ఎర్రబారి ఎదుగు బొదుగు లేకుండా పోయాయన్నారు. పెసర దిగుబడి వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. జిల్లాలో 50వేల ఎకరాల్లో వివిధ రూపా ల్లో పంటలకు నష్టం వాటిల్లిందని, నష్టం అంచనా వేసి తక్షణం పరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రతినిధుల బృందంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు మిడికంటి వెంకటరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, సిపిఐ మండల కార్యదర్శి గడల భాస్కర్, సిపిఐ, రైతుసంఘం నాయకులు మునిగ కోటేశ్వరరావు, యాసా వెంకటేశ్వరరావు, రత్తయ్య, నర్సింహారావు, సీతారాములు, నరేష్, బానోత్‌రాములు, బానోత్ రామయ్య పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

వరంగల్, హన్మకొండ, జనగాం, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్

## అధిక ధరలకు యూరియాను విక్రయిస్తున్న పిఏసిఎస్

తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాపర్తి సోమయ్య

**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** యూరియా కొరతతో ఒక వైపు రైతులు ఇబ్బందులు పడుతుంటే ఇదే అదునుగా చూసి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం యూరియాను అధిక ధరలకు అమ్ముతూ సొమ్ము చేసుకుంటున్నట్లు తె లంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు రాపర్తి సోమయ్య ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక సహకార సంఘం దగ్గర యూ రియా కోసం వచ్చిన రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతాంగానికి సరిపడా యూరియాను అందించడంలో విఫలమైందన్నారు. ప్రాథమిక సహకార సంఘం విక్రయ కేంద్రంలో వ్యవసాయాధికారి ముందే రైతులకు యూరి యాను అధిక ధరలకు అమ్మడం జరిగిందన్నారు. సీపీఎం మండల కార్యదర్శి గుండెబోయిన రాజు, తెలంగాణరైతు సంఘం మండల కార్యదర్శి యాకయ్య, పాల్గొన్నారు.

## శిక్షణ పూర్తి చేసిన 48 మంది సర్వేయర్లకు సర్టిఫికెట్లు పంపిణీ



**ప్రజాపక్షం / జనగామ :**సర్వేయర్లుగా శిక్షణ పూర్తి చేసిన 48 మందికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ చేతుల మీదుగా సర్టిఫికేట్లు అందజేశారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో సర్వేయర్లకు సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ పొందిన సర్వేయర్లు క్షేత్ర స్థాయిలో పనిచేసి గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఎఓ శ్రీకాంత్, సర్వే శాఖ ఎడి మన్యంకొండ పాల్గొన్నారు.

## గొల్లకురుమలు హక్కుల సాధనకు ఒక్కటై పోరాడుదాం : వీరన్న యాదవ్



**ప్రజాపక్షం/గూడూరు:** గొల్ల కురుమలు హక్కల సాధన కోరకు ఒక్కటై పోరాడాలని టిపిసిసి వర్కింగ్ చైర్మన్ మేకల వీరన్న యాదవ్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో గొల్ల కురుమ మాదవ సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాన రాష్ట్ర ప్రభుత్వం బిసిలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని హామీ ఇచ్చిన మేరకు గొల్ల కురుమ యాదవులు సైతం ఈఉద్యమంలో పాలిభాగస్తులు అవుతారని అన్నారు. దీనికోసం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో యశోదగార్డెన్‌లో ఈ నెల 5వ తేదీన గొల్ల కురుమ యాదవ సదస్సు జరుగుతుందని దీనికీ పెద్ద ఎత్తున గొల్ల కురుమ యాదవులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈకరపత్రం ఆవిష్కరణ కార్యక్రమంలో మానుకోట జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు చీర అశోక్ మాజీ సర్పంచ్ చావుల అశోక్ మండల కురుమ సంఘం మండల అధ్యక్షుడు మండల ఉపెందర్ గ్రామ అధ్యక్షుడు కోరే కూమారస్వామి జిల్లా కమిటి మెంబర్ కిషన్ రామస్వామి సురేందర్ మండల మల్లేష్ పోతు రాజు రవి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి



**ప్రజాపక్షం/రాయపర్తి:** కాంగ్రెస్ ప్రభుత్వంతోనే అన్ని వర్గాల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ బిసి సెల్ అధ్యక్షుడు మచ్చ కుమారస్వామి అన్నారు. సోమవారం రాయపర్తిలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్ల పరిమితిని ఎత్తివేస్తూ బిసి రిజర్వేషన్లు 42 శాతం పెంచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సిఎం రేవంత్ రెడ్డి, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుత.. కాంగ్రెస్ ప్రభుత్వం సిఎం రేవంత్‌రెడ్డి బిసిలు రాజకీయంగా ఎదగాలనే ఉద్దేశంతో బిసి రిజర్వేషన్ అమలుచేశారన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు భూక్య సమ్మయ్య, మాజీ మండలాధ్యక్షుడు మాచర్ల ప్రభాకర్, పెండ్లి మహేందర్‌రెడ్డి, ముద్రబోయిన వెంకటేశ్వర్లు, ఉల్లెంగుల యాదగిరి, ఎండీ అఫ్రోజ్, ఎండీ ఉస్మాన్, కుంట రమేశ్, చెవ్వు కాశీనాథం, మచ్చ నిలయ, పాల్వంచ కోటేశ్వర్, మచ్చ రమేశ్, గుగులోతు శ్రీనివాస్, ఎస్కే రఫిక్, ఎండి గౌస్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## నెక్కొండ నీటిపారుదల ఇఇగా సురేష్



**ప్రజాపక్షం/నెక్కొండ :** వరంగల్ జిల్లా నెక్కొండ నీటి పారుదల శాఖ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఇఇ)గా పడాల సురేష్ సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు అదే నీటిపారుదల శాఖ పరకాల డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (డిఇఇ)గా ఇప్పటివరకు పనిచేస్తున్న సురేష్‌కు ఇఇగా పదోన్నతి లభించడంతో ఆయన పరకాలలో రిలీవ్ అయి నెక్కొండ ఇఇగా బాధ్యతలు చేపట్టారు. నెక్కొండ ప్రస్తుత ఇఇ యాదగిరి అదే ప్రమోషన్ లభించి, సూర్యాపేటకు బదిలీ అయ్యారు. కొత్త ఇఇ సురేష్‌ను కలుసుకుని అభినందనలు తెలిపిన వారిలో నెక్కొండ నీటిపారుదల విభాగం ఇన్‌చార్జి సూపరింటెండెంట్, సీనియర్ అసిస్టెంట్ అచ్యుత అనీల్ కు మార్, ఎస్‌ఎలు ఎం.కరుణాదేవి, హిమబిందు, జెఎ రమే ష్, టిఒ చంద్ర శేఖర్, ఆర్ ఎ కనకరాజం, ఓఎస్‌లు నవ్య, లక్ష్మీ, కుమారస్వామి, శ్రీరామ్‌లు ఉన్నారు. ఈ మేరకు అందరికీ అందుబాటులో ఉండి ప్ర భుత్వ సంక్షేమ పథకాల అమలులో సిబ్బంది ముందుండాలని అన్ని వర్గాలకు నీటిపారుదల సేవలను అందించి మన నెక్కొండ సర్కిల్‌కు ఒక ప్రత్యేక గుర్తింపు తేవాలని నూతన ఇఇ సురేష్ తన కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు.

## ఇరిగేషన్ ఇఇగా ప్రసాద్

కలెక్టర్‌ను కలిసిన ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**ఇరిగేషన్ డివిజన్1 డిఈగా విధులు నిర్వహిస్తూ ఇంచార్జి ఇఇగా కొనసాగుతున్న బసవ ప్రసాద్‌కు పదోన్నతి కల్పిస్తూ ఇరిగేషన్ ప్రి న్సిపల్ సెక్రటరీ రాహుల్ బొజ్జా ఉత్తర్వులు జారీ చేశారు. ఆ ఉత్తర్వుల మేరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పదవి బాధ్యతలు స్వీకరించిన బసవ ప్ర సాద్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మను సోమవారం ఐడిఓసి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బసవ ప్రసాద్ కు జిల్లా కలెక్టర్ అభినందనలు తెలియజేసి, భవిష్యత్తు కార్యక్రమాలలో విజయవంతంగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# ప్రజావాణికి 50 ఫిర్యాదులు

ములుగు కలెక్టర్ దివాకర టిఎస్



**ప్రజాపక్షం/ములుగు:**ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 50 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావుకు విన్నవిస్తూ ఆర్జీలు సమర్పించారు. ఆర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో 50 దరఖాస్తులు రాగా అత్యధికంగా గృహ నిర్మాణ శాఖకు 9, భూ సమస్యలు 8, ఉపాధి కల్పనకు 5, పెన్షన్ 5, ఇతర శాఖలకు సంబంధించినవి 23 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గోదావరి పరివాహక మండలాలైన వాజేడు, వెంకటాపురం, ఏటూరునాగారం, కన్నాయిగూడెం, మంగపేట మండలాల పరిధిలోని గ్రామాల అధికారులు, ప్రజలు నిత్యం అప్రమత్తంగా ఉండాలని, ఉధృతంగా పారుతున్న గోదావరి కారణంగా ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయడం జరిగిందని, ఈ నెల 6వ తేదీ వరకు జిల్లాలో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులందరు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాకాలం వరదల దృష్ట్యా తక్షణ సహాయం కోసం కలెక్టరేట్ టోల్ ఫ్రీ నెంబర్ 18004257109కు కంట్రోల్ రూమ్‌లో 24 గంటలు అధికారులు, సిబ్బంది షిఫ్టుల వారిగా అందుబాటులో ఉంటూ, వర్షానికి జలమయమైయ్యే ప్రాంతాల సమస్యకు సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే సంబంధిత శాఖల అధికారులు తక్షణ పరిష్కార నిమిత్తం పంపడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఆర్‌డిఓ వెంకటేష్, వివిధ జిల్లా స్థాయి అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, పర్యవేక్షకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల సహాయక చర్యలపై సమీక్ష



**ప్రజాపక్షం/ములుగు:** భారీ వర్షాలు, వరద సహాయక చర్యలపై సోమవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో సిఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాజరైన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, వివిధ విభాగాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు ములుగు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఎస్‌పి శబరీష్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్‌రావులు ఉన్నారు.

## గ్రీవెన్స్ ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించండి

జిడబ్ల్యుఎంసి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్



**ప్రజాపక్షం/ఖిలా వరంగల్ :**గ్రీవెన్స్ ఫిర్యాదులను వేగవంతంగా పరిష్కరించాలని బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ (ప్రజావాణి) కార్యక్రమాన్ని పురస్కరించుకొని బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి దరఖాస్తు లను స్వీకరించి పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా ఇంజనీరింగ్ 18,హెల్త్ సానిటేషన్ 08, ప్రాపర్టీ టాక్స్(రెవెన్యూ) 11, టౌన్ ప్లానింగ్ 41, నీటి సరఫరా 01, హార్టికల్చర్ 02, మొత్తం 81 ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చంద్రశేఖర్ సిఎంహెచ్ఓ డా॥ రాజారెడ్డి, డిఎఫ్ఓ శంకర్ లింగం, సిహెచ్ఓ రమేష్, ఇంచార్జి ఎస్ఈ, సిటీ ప్లానర్ లు మహేందర్, రవీందర్, రాడేకర్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు సమర్పించిన దరఖాస్తులు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించి ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో 70 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రజల సమస్యలను పరిష్కరించడం కోసం ఇచ్చిన ప్రతి దరఖాస్తును నిర్లక్ష్యం నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత శాఖాధికారులు జాగ్రత్తగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని సూచించారు. పరిష్కారంలో జాప్యం చేయొద్దని ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను తెలియచేస్తూ దరఖాస్తులు ఇస్తున్నారని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజలు చేసిన వినతులను కేవలం నమోదు చేయడం కాకుండా వాటిని శాశ్వత పరిష్కారం దిశగా తీసుకెళ్లేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. దరఖాస్తులు పరిష్కారం కాకుండా ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉంచితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, అన్ని శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శిలాఫలకం ధ్వంసం



**ప్రజాపక్షం / వేలేరు :** రూ.3 కోట్ల 69 లక్షల పనులకు గత నెల ఆగస్టు 24న స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన పనుల జాతర 2025 కార్యక్రమంలో భాగంగా వేలేరు మండలంలోని వివిధ గ్రామాల లోని ఎస్‌సి కాలనీలలో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులతో శంకుస్థాపన కార్యక్రమంలో భాగంగా మల్లికుదుర్ల గ్రామంలోని ఎస్‌సి కాలనీలో రూ.24.9 లక్షల విలువగల రోడ్లకు శంకుస్థాపన చేయగా ఆదివారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి శిలాఫలకం ధ్వంసం చేశారని గ్రామస్తులు బాహాటంగానే చర్చించుకుంటున్నారు. ఎస్ఐ సురేష్ వివరాల ప్రకారం మల్లికుదుర్ల గ్రామంలో శిలాఫలకం ధ్వంసమైన విషయం గ్రామస్తులు సమాచారం అందించగా వెళ్లి శిలాఫలకాన్ని పరిశీలించగా ధ్వంసమయిందని శిలాఫలకం ధ్వంసం చేసిన వారికోసం దర్యాప్తు చేయడం జరుగుతుందని శిలాఫలకం ధ్వంసం చేసిన వారిఆచూకి తెలిసిన వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని తెలిపారు.

## ప్రెస్‌క్లబ్ నిధులు దుర్వినియోగం చేసిన పూర్వ అధ్యక్ష, కార్యదర్శులపై చర్యలు

హన్మకొండ కలెక్టర్‌కు ఐజెయు, ప్రెస్ క్లబ్ నాయకుల వినతి



**ప్రజాపక్షం/హనుమకొండ టౌన్ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ నిధులు దుర్వినియోగం చేసి కేసులు ఎదుర్కొంటున్న పూర్వ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు తుమ్మ శ్రీధర్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లుపై చట్టపరమైన చర్యలు తీసుకుని నిధుల రికవరీ అయ్యేలా చూడాలని, ప్రెస్ క్లబ్‌కు అట్టి నిధులు జమ చేయించాలని టియుడబ్ల్యుజె (ఐజెయు), గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హన్మకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్‌కు వారు వినతిపత్రం అందజేశారు. వినతి పత్రం అందించిన వారిలో టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెండెం వేణుమాధవ్, కంకణాల సంతోష్, రాష్ట్ర హౌసింగ్, వెల్ఫేర్ కమిటీ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారం సదయ్య, ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవమూర్తి, జర్నలిస్టులు కోల్ల కృష్ణకుమార్ రెడ్డి, నాగరాజు, బండారి ప్రమోద్, సర్వేశ్వర్, సిద్దోజు రాకేష్, రవి, తదితరులు ఉన్నారు. ప్రెస్ క్లబ్ నిధులను దుర్వినియోగం చేసిన తుమ్మ శ్రీధర్ రెడ్డి, పెరుమాండ్ల వెంకటేశ్వర్లుతో సామరస్య పూర్వకంగా పలుమార్లు సమావేశాలను అన్ని యూనియన్ల బాధ్యులు, క్లబ్ బాధ్యులతో కలసి ఉమ్మడిగా నిర్వహించినా వారు పెడచెవిన పెట్టడంతో వారిపై చట్టపరమైన చర్యలకు ఆ సమావేశం సిఫార్సు చేసిందని, ఆ నిర్ణయాలను వారు ధిక్కరించటంతో విధిలేని పరిస్థితుల్లో సుబేదారి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయటం జరిగిందని వివరించారు. అట్టి ఫిర్యాదుపై సుబేదారి పీఎస్ లో ఎఫ్ఐఆర్ నెంబర్ 206/2024 కేసు నమోదైందని తెలిపారు. ఆ కేసు విషయంలో చొరవ తీసుకుని వారి నుండి నిధుల రికవరీ అయ్యేలా చూసి క్లబ్ కు జమచేయించాలని విజ్ఞప్తి చేశారు. డిసెంబర్ నాటికి క్లబ్ లో జరుగుతున్న అన్ని అభివృద్ధి పనులు పూర్తిచేసేందుకు నిర్ణయించామని కలెక్టర్ కు వివరించారు. తక్షణమే పూర్వ అధ్యక్ష, కార్యదర్శుల నుండి నిధులు రికవరీ చేయించాలని వారు కోరారు. ఈ వినతిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

## ఆశావర్కర్ల అక్రమ అరెస్టును ఖండించండి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** చలో హైదరాబాద్ కార్యక్రమానికి ఆశ వర్కర్లు సోమవారం తరలుతున్న సందర్భంగా ఎఐటియుసి అనుబంధ ఆశా వర్కర్లను ధర్నా కార్యక్రమానికి వెళ్తున్న సందర్భంలో పోలీస్ అధికారులు పోలీస్‌స్టేషన్‌కి పిలిచి వివరాలు తెలుసుకొని సొంత పూచిక పైన విడుదల చేసిన పోలీస్ అధికారులు ఈ సందర్భంగా ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి రేషపల్లి నవీన్. ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కన్వీనర్. పుచ్చకాయల రజనీలు మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం హయంలో ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఎన్నో పోరాటాలు చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఆశా వర్కర్ల సమస్యలపైన సమ్మెలు చేస్తున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ప్రజా ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆశా వర్కర్లకు భరోసా ఇవ్వడం జరిగిందన్నారు. ఆశా వర్కర్లు చేస్తున్న వెట్టిచాకిరి పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ఆశా వర్కర్లకు కనీస వేత్తనం 26వేల రూపాయలు ఇవ్వాలన్నారు. ఏఎన్‌సి టార్గెట్‌ను ఎత్తివేయాలని. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కల్పించి పదవి విరమణ చెందిన ఆశ వర్కర్లకు 5 లక్షల రూపాయలు ఇవ్వాలి ప్రమాద బీమా రూ.25 లక్షలు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే నైనా ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కారమవుతాయి అనుకున్నారు కానీ నేటికీ ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించక పోవడం చాలా బాధాకరమన్నారు రానున్నటువంటి రోజుల్లో ఆశా వర్కర్ల సమస్యల పైన ఎఐటియుసి ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తామన్నారు ఈ కార్యక్రమంలో. కె రేణుక, నాగలక్ష్మి , విజయ, కోమలత రాధ, మమత, మహేశ్వరి, యశోద. లక్ష్మి , ఉమా, సరిత, విజయ, చంద్రకళ, శారద. కమలమ్మ, రమణ ఎఐటియుసి నాయకులు మంద శంకర్ పాల్గొన్నారు.

## ఉధృతంగా ప్రవహిస్తున్న పాకాల వాగు

గూడూరు మండలంలో ఆదివారం రాత్రి భారీ వర్షం



**ప్రజాపక్షం/ గూడూరు :** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రం ఏజెన్సీ ప్రాంతంలో గత ఆదివారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఏకంగా మండల కేంద్రంలో 78.6% వర్షం నమోదైనట్లు అంచనా! కాగా భారీ వర్షంతో మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఆయా వాగులు పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రం నుండి కేసముద్రం వెళ్లే రహదారి మధ్యలో ఉన్న పాకాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుంది దీంతో కేసముద్రం నెక్కొండ ప్రాంతానికి రాకపోకలు నిలిచిపోయాయి. అంతేకాకుండా కోబాల్ తండా మూడు మార్గం మధ్యలో వాగు ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామానికి వెళ్లవలసిన ప్రజలు నిలిచిపోవాల్సి వచ్చింది. అదేవిధంగా మట్టేవాడ ప్రాంతంలోని దొరవారి తిమ్మాపురం వాగు సైతం ఉధృతంగా ప్రవహించడంతో ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. అదేవిధంగా సీతానగరం శివారులోని భీముని పాదం జలపాతం ఉధృతంగా ప్రవహించడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున అటవీశాఖ అధికారులు జలపాతా సందర్శనకు అనుమతి లేదని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉంటే భారీ వర్షాలకు గూడూరు మండల వ్యాప్తంగా మొక్కజొన్న పత్తి వేసిన రైతులకు తీవ్ర నష్టం వాటిలినట్లు పెద్ద ఎత్తున పంటలు దెబ్బతిన్నాయని పలువురు రైతులు వాపోతున్నారు వాగులు దాటే ప్రయత్నం చేయకండి గూడూరు, సీఐ సూర్య ప్రకాష్, ఎస్సై గిరిధర్ రెడ్డి మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ఆదివారం నుండి కురుస్తున్న భారీ వర్షానికి మండల వ్యాప్తంగా ఉన్న వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండడంతో గూడూరు సిఐ సూర్య ప్రకాష్, ఎస్సై గిరిధర్ రెడ్డి ప్రజలకు పలు సూచనలు చేశారు ముఖ్యంగా గూడూరు నుండి నెక్కొండ కేసముద్రం వెళ్లే రహదారి మధ్యలో ఉన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తూ ఉండటం వల్ల ఎవరు దాని మీద నుండి వెళ్లడానికి సాహసం చేయవద్దని ఆయన సూచించారు అదేవిధంగా ఆయా ప్రాంతాలకు వెళ్లే దారుల్లో ఉన్న వాగులను సైతం దాటడానికి ప్రయత్నం చేయవద్దని ప్రమాదాన్ని కొని తెచ్చుకోవద్దని సూచించారు చిన్న పిల్లలని ఎట్టి పరిస్థితుల్లో చెరువుల దగ్గరికి వాగుల దగ్గరికి పంపించవద్దని పలు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు

# కెసిఆర్ కుటుంబం చేసిన ద్రోహానికి శిక్ష తప్పదు

విలేకర్ల సమావేశంలో కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి



**ప్రజాపక్షం / జనగామ :**తెలంగాణ ప్రజలకు కేసీఆర్ చేసిన ద్రోహానికి శిక్ష తప్పదు, ఆయనను ఆయన కుటుంబాన్ని నడి బాజారులో రాళ్లతో కొట్టినా తప్పులేదని జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి, భువనగిరి పార్లమెంట్ ఇంచార్జీ, టిపిసిసి కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం జనగామలోని డిసిసి కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో భువనగిరి పార్లమెంట్ మరో ఇంఛార్జీ ఈవి శ్రీనివాస రావుతో కలిసి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. తొమ్మిద్దిన్నరేండ్లు తెలంగాణ ప్రజల్ని దోచుకున్న సొమ్ము కేసీఆర్ కుటుంబం నుండి కక్కించాల్సిన అవసరం ఉందన్నారు. కాళేశ్వరం పేరుతో వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడ్డారని, కాళేశ్వరం ఖర్చు లక్షా 50వేల కోట్లు కాగా వాస్తవంగా ఖర్చుచేసింది మాత్రం 25 వేల కోట్లు అన్నారు. తప్పు చేయని వారు పిసీ ఘోష్ నివేధికకు కట్టుబడి ఉండాలి తప్ప కోర్టుకు వెళ్లడం, సిబిఐ విచారణ చేపట్టవద్దని చెప్పడం సరియైంది కాదన్నారు. కోర్టుకు వెళ్తున్నారంటేనే వారు తమ తప్పును ఒప్పుకున్నట్లు, తప్పును అంగీకరించలేక దొంగ నాటకాలు ఆడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన వాగ్ధానాలను అమలు చేయడం జరుగుతుందని, కామారెడ్డిలో చేసిన బిసి డిక్లరేషన్ ప్రకారం బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు చేయాలని అసెంబ్లీతో తీర్మాణం చేసి గవర్నర్‌కు పంపడం జరిగిందన్నారు. తెలంగాణలో కేసీఆర్ ఆటలు సాగే పరిస్థితి లేదని, ఆ కుటుంబం ఎవరికి చదవు రాక ఇష్టం వచ్చినట్లు కాళేశ్వరం డిజైన్లు మార్చి వేల కోట్లు నీటిలో పోశారన్నారు. దీని శిక్ష తప్పదన్నారు.

దామోదర్ రాజనర్సింహ్మా కార్యక్రమం విజయవంతం చేయాలి

జనగామ జిల్లా కేంద్రంలోని జిల్లా హాస్పటల్‌లో జరిగే సిటి స్కానింగ్ కార్యక్రమానికి మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ్మా రానున్నందున పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని డిసిసి జిల్లా అధ్యక్షులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యా వైద్యం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో చేస్తుందన్నారు. ఆరోగ్య శ్రీ 10లక్షలకు పెంచడంతో పాటు హాస్పటల్‌లో డాక్టర్ల పోస్టుల భర్తీ, సరియైన వసతులు కల్పించడం వంటివి చేయడం జరుగుతుందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు గంగం నర్సింహ్మా రెడ్డి, జనగామ మండల పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, పట్టణ అద్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ వంగాల కళ్యాణి, పిఎసిఎస్ డైరెక్టర్ మల్లారెడ్డి,ర తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం
REGIONAL NEWS
ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం

## జాలిముడి ప్రాజెక్టు కాల్వకు గండి -నీట మునుగుతున్న పొలాలు

**ప్రజాపక్షం/బోనకల్ :** గత నాలుగైదు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో మండలంలోని బ్రాహ్మణపల్లి కలకోట మధ్యగల జాలిముడి ప్రాజెక్టు కాల్వకు గండి పడింది. దీంతో ప్రాజెక్టు చుట్టూపక్కల ఉన్న పొలాల్లోకి భారీగా వరద నీరు చేరి మునిగిపోతుండటంతో రైతులు లబోదిబోమంటున్నారు. సంబంధిత అధికారులు గండి పూడ్చకపోవడంతో పై నుండి వస్తున్న భారీ వరదల వలన వరి పొలాలు నీట మునిగాయని, దీంతో తీవ్ర నష్టం జరిగిందని, ఈ విషయాన్ని అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి జాలిముడి కాల్వకు మరమ్మత్తుల చేయించి తమ పంట పొలాలను కాపాడాలని కోరుతున్నారు.





## నష్టపరిహారం చెల్లించాలని రైతు వేడుకోలు

**ప్రజాపక్షం/బోనకల్ :** అమరావతి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనుల్లో భాగంగా తన పొలంలోని మూడు కుంటలకు సంబంధించిన నష్టపరిహారాన్ని అందించాలని బోనకల్ మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గుడిదే రామారావు అధికారులను వేడుకుంటున్నాడు. గ్రీన్‌ఫీల్డ్‌హైవే నిర్మాణం కోసం సర్వే నెంబర్ 219/అలో తనకున్న 2.3 ఎకరాల భూమిలో 3కుంటల భూమిని గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కోసం అధికారులు తీసుకున్నారని, కాని ఇంతవరకు తనకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. ఆ 3కుంటలు భూమిలో గ్రీన్ ఫీల్డ్ హైవే పనులకు సంబంధించిన గ్రావెల్ తోలి పనులను నిలిపివేశారని, దీంతో తన పొలంలో పొలం పనులు చేసుకోవటానికి వీలు లేకుండా పోయిందని, తనకు రావాల్సిన నష్టపరిహారాన్ని కూడా ఇంతవరకు ఇవ్వకుండా, పొలం పనులను చేయనివ్వకుండా అధికారులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఈ విషయమై సంబంధిత అధికారుల చుట్టూ ఎన్నిసార్లు తిరిగినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి తనకు పరిష్కార మార్గాన్ని చూపి 3కుంటల భూమికి సంబంధించిన నష్టపరిహారం వెంటనే చెల్లించాలని బాధిత రైతు వేడుకుంటున్నాడు.



## సిఎం పర్యటన ఏర్పాట్ల పర్యవేక్షణ

**ప్రజాపక్షం/చంద్రుగొండ :** ఈనెల మూడవ తేదీన మండల పరిధిలోని బెండలపాడు గ్రామంలో సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభ కార్యక్రమాల ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్‌లు పర్యవేక్షించారు. సోమవారం బెండలపాడు గ్రామంలో ఇందిరమ్మలను పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. సిఎం పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏర్పాట్లు చేయాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తేనే పర్యటన విజయవంతం అవుతుందన్నారు. అనంతరం చంద్రుగొండలో హెలిప్యాడ్ దామరచర్ల గ్రామంలో సీఎం పాల్గొననున్న బహిరంగ సభ స్థలాలను అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్, డిఆర్‌డిఓ విద్యాచందన, హైజింగ్ పిడి రవీంద్రనాథ్, డిఎస్పీ అబ్దుల్, మండల స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, రహమాన్, ఎంపిడిఓ అశోక్, తహసీల్దార్ సంధ్యా రాణి, కాంగ్రెస్ నాయకులు భోజ్యా నాయక్, అశ్వారావుపేట నియోజకవర్గ కాంగ్రెస్ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ బక్ష, సారేపల్లి శేఖర్, కిరణ్‌రెడ్డి, బొర్రా సురేష్, ఇమ్రాన్, తదితరులు పాల్గొన్నారు.



## పోటు ప్రసాద్ జయంతి సందర్భంగా విద్యార్థికి సైకిల్ వితరణ

**ప్రజాపక్షం/ఖమ్మం :** దివంగత కమ్యూనిస్టు నాయకుడు, సిపిఐ మాజీ జిల్లా కార్యదర్శి అమరజీవి పోటు ప్రసాద్ జయంతిని పురస్కరించుకుని ఓ విద్యార్థికి సైకిల్‌ను అందించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు వారి సోదరులు తోట నాగకృష్ణలు పోటుప్రసాద్ జయంతిని పురస్కరించుకుని చైతన్యమోహన్ అనే ఐటిఐ చదివే విద్యార్థికి అందించారు. సిపిఐ కార్యాలయంలో ఉంటూ ఐటిఐ చదువుతున్న విద్యార్థి రోజు టేజు వెళ్లి రావడానికి అయ్యే ఖర్చును దృష్టిలో ఉంచుకుని వారు ఈ సైకిల్‌ను ఉచితంగా అందించారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు చేతుల మీదుగా సోమవారం అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, నాయకులు పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల సుధాకర్, పోటు పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ నిమజ్జనం సాఫీగా నిర్వహించాలి

### నిమజ్జన ఘాట్లను పరిశీలించిన కమిషనర్

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** నగర పాలక సంస్థ పరిధిలో గణేష్ నిమజ్జన కార్యక్రమం సాఫీగా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య అధికారులకు సూచించారు. సోమవారం ఖమ్మం నగరంలో నిమజ్జన ఘాట్ల వద్ద ఏర్పాట్లను కమిషనర్ అభిషేక్ అగస్త్య పరిశీలించారు. ఘాట్ల వద్ద రహదారులు, లైటింగ్, రక్షణ చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, శానిటేషన్ వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. నిమజ్జనం సాఫీగా ఎటువంటి అంతరాయాలు లేకుండా ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని నిర్వహించాలని అందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలు అధికంగా వచ్చే ప్రాంతాల్లో రక్షణ కవచాల ఏర్పాటు, బారికేడింగ్, లైఫ్ జాకెట్లు, రెస్క్యూ టీములను సిద్ధంగా ఉంచాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా శోభాయాత్ర జరగనున్న ప్రధాన రూట్లను కమిషనర్ పరిశీలించారు. శోభాయాత్ర రూట్లలో ఎక్కడ ఎటువంటి ఆటంకం లేకుండా చూడాలని, ఎక్కడైనా చెట్ల కొమ్మలు, విద్యుత్ లైన్లు ఇతర అడ్డంకులు ఉంటే వాటి వల్ల ఎటువంటి ప్రమాదాలు కలుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.
**అర్జీల స్వీకరణ :** ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య అర్జీలను స్వీకరించారు. సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మొత్తం 31 దరఖాస్తులు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.



# పంటలు దెబ్బతిన్న రైతులను ఆదుకోవాలి


### సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి



**ప్రజాపక్షం/చింతకాని :** అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మండల పరిధిలోని నేరడ గ్రామంలో వరదలతో పంటలు నష్టపోయిన రైతులతో కలిసి పంటలను సిపిఐ బృందం పరిశీలించారు. ఈ సందర్భంగా జమ్ముల జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ చేతికి వచ్చిన పంటలు వర్షాల వల్ల దెబ్బతిన్నాయన్నారు. పెసర పంటకు తీవ్రంగా నష్టం వాటిల్లిందని ప్రభుత్వం రైతులను ఆదుకోవాలన్నారు. నీట మునిగిన పంటలకు ఎకరానికి రూ.20వేలు, వరి, మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ.30వేలు, పత్తి రైతులకు ఎకరానికి రూ.50వేలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. గ్రామంలో వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని పారిశుధ్య చర్యలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, నాయకులు గోగుల ఆది, మట్టా రవి, కోటయ్య, గురుమూర్తి, గురవయ్య, శంకర్‌రావు, నాగులమీరా, మస్తాన్, రసూల్, సాయి, తిరుపతిరావు పాల్గొన్నారు.

## వరద, వర్ష ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించండి

### నష్ట నివారణ చర్యలు యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
### కొత్తగూడెం శాసనసభ సభ్యుడు కూనంనేని



**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** భారీ వర్షాలు, వరదల ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించాలని ప్రభుత్వ శాఖల అధికారులను కొత్తగూడెం శాసన సభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆదేశించారు. హైదరాబాద్‌లో ఆయన సోమవారం మున్సిపల్, ఆర్ అండ్ బి, విద్యుత్, పంచాయతీ, పోలీసు, రెవెన్యూ తదితర జిల్లా, డివిజన్ అధికారులను ఆదేశించారు. కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నియోజకవర్గంలోని పలు గ్రామాలు, బస్తీల్లోని అంతర్గత రహదారులు దెబ్బతిన్నాయని, తక్షణమే పునర్నిర్మాణం చేపట్టి పరిస్థితిని చక్కదిద్దాలని, దిబ్బతిన్న విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్తును పునరుద్ధరించాలని సూచించారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని, ప్రత్యేక డ్రైవులు చేపట్టి ప్రజలు జబ్బులబారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. అవసరైన చోట వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు చికిత్స అందించాలని, ఇండ్లు కోల్పోయిన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు కృషిచేస్తానని, ప్రభుత్వం ద్వారా పరిహారం చెల్లించేవిధంగా అదేవిధంగా పంటల నష్టంపై సర్వే చేపట్టి నష్ట అంచనాను ప్రభుత్వానికి నివేదించడం ద్వారా బాధితుల్ని పరిహారం అందేవిధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. నిర్వాసితులుగా మరిన్ని కుటుంబాలని తక్షణమే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి సకలసౌకర్యాలు ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు.

## నిధులు దుర్వినియోగం చేసినవారిపై చర్యలు తీసుకోండి

### కలెక్టరేట్ ఎదుట డ్వాక్రా మహిళల నిరసన



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** డ్వాక్రా సంఘంలోని నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఖమ్మం కలెక్టరేట్ ఎదుట డ్వాక్రా మహిళలు నిరసన చేపట్టారు. సోమవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట బోనకల్ మండలం గోవిందాపురం ఎ గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళలు కండ్లకు నల్ల గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు మాట్లాడుతూ నెల రోజుల క్రితం గ్రూపుల్లో నిధుల దుర్వినియోగం అయినట్లు గుర్తించామని తెలిపారు. ఎపిఎంను సంప్రదించగా గతంలో ఉన్న ఎపిఎం కట్టా సురేంద్రబాబు నిధుల దుర్వినియోగానికి పాల్పడినట్లు తెలిసిందన్నారు. ఎపిఎం సురేంద్రబాబు బదిలీపై వెళ్లారని దీనికి సంబంధించి కొత్తగా వచ్చిన ఎపిఎం వెంకటేశ్వరరావును కలిసి ఎన్నిసార్లు విన్నవించినా సమస్యను పట్టించుకోవడంలేదని వాపోయారు. సమస్యను పరిష్కరించకపోగాపై అధికారులకు తప్పుడు సమాచారం అందిస్తున్నారన్నారు. తక్షణమే నిధుల దుర్వినియోగానికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనను ఉధృతం చేస్తామన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో షేక్ షాహీహన్, బొబ్బిళ్ల రాధ, బొబ్బిళ్ల కిట్టమ్మ, వత్సవాయి కిట్టమ్మ, షేక్ హుస్సేన్, షేక్ లాలమ్మ, బొబ్బిళ్ల శైలజ, బొబ్బిళ్ల మంగమ్మ, బాగం దుర్గ, షేక్ షాహీన్, షేక్ జాన్‌బీ, షేక్ మైబు, షేక్ షకీలా తదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ కల్పన అభినందనీయం

### బిజెపి ద్వంద వైఖరి విడనాడాలి : సిపిఐ

**ప్రజాపక్షం/ఖమ్మం :** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ చేసిన తీర్మానం చారిత్రాత్మకమని దీనిని సిపిఐ పూర్తిగా మద్దతునిస్తూ అభినందనలు తెలియజేస్తుందని సిపిఐ ఖమ్మం జిల్లా సమితి తెలిపింది. సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి 42 శాతం రిజర్వేషన్‌తోనే ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్ అమలుకు సంబంధించి దొడ్డిదారి ప్రయత్నాలు కాకుండా నేరుగా అమలు చేసేందుకు బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని సురేష్ కోరారు.

## తోగ్గూడెంలో ఆగని బాంబుల మోత

### దద్దరిల్లుతున్న పల్లెలు

**ప్రజాపక్షం/పాల్వంచ :** ఆ గ్రామంలో బాంబుల మోత మళ్ళీ మొదలయ్యాయి. దీనితో సుమారు నాలుగు కిలో మీటర్ల మేర గల గ్రామాలు దద్దరిల్లిపోతున్నాయి. మండల పరిధి తోగ్గూడెం గ్రామంలో గల క్వారీల యజమానులు ప్రభుత్వానికి చెల్లించాల్సిన సుమారు 300 కోట్ల రాయల్టీని చెల్లించకుండా ఎగ్గొట్టారు. అధికారులు పలుమార్లు నోటీసులు జారీచేసినా ఎంత మాత్రం ఖాతర్ చేయకుండా పట్టించుకోకుండా క్వారీల నిర్వాహణ తమ ఇష్టారీతిన కొనసాగించారు. గత్యంతరం లేని పరిస్థితిలో అధికారులు గత సంవత్సరం క్రితం అనుమతులు లేని క్వారీలను మూసివేశారు. విద్యుత్ సౌకర్యం నిలిపివేశారు. దీనితో కొంత కాలం ప్రశాంతంగా ఉన్న పల్లెలు తిరిగి తల్లడిల్లిపోతున్నాయి. క్వారీ యజమానులు తమ పలుకుబడితో అధికారులను మచ్చికచేసుకొని గత కొన్ని రోజులుగా జనరేటర్ సహాయంతో క్వారీలలో బాంబులు అమర్చి ప్రతీ రోజు సాయంత్రం ఆరు గంటల నుండి రాత్రి ఎనిమిది గంటల సమయంలో బాంబు బ్లాస్టింగ్‌లకు పాల్పడుతున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతున్నాయి.
**అందుబాటులో లేని మైనింగ్ ఎడిఇ :** ఈ విషయంపై జిల్లా మైనింగ్ ఎడిఇ దినేష్ కుమార్‌ను ఫోన్ ద్వారా వివరణ కోరటానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.



# మెట్ట పంటలకు వాన దెబ్బ

### పత్తి, పెసరకు అపార నష్టం
### పరీవాహక ప్రాంతాల్లో ముంపుకు గురైన పంట భూములు
### జాలిముడి ప్రాజెక్టు కాలువకు గండి





**ప్రజాపక్షం/ఖమ్మం :** భారీ వర్షాలకు మెట్ట పంటలకు అపార నష్టం వాటిల్లింది. గడిచిన వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తోడు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వాగులు, నదులు, ఏర్ల పరివాహక ప్రాంతాల్లోని పంటలు నీట మునిగాయి. కొన్ని చోట్ల గడిచిన 24 గంటలుగా పంటలు నీటిలోనే ఉన్నాయి. పలు చోట్ల పంట భూములు కోతకు గురైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మెట్ట పంటలైన పెసర, పత్తి పంటలను సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది పెసర పంటకు సంబంధించి కనీసం కోసే పరిస్థితి లేకుండా పోయింది. విత్తు కూడా ఇంటికి చేరలేదంటే అతిశయోక్తి కాదు. గడేడాది పత్తి పంటను నష్ట పరిచ్చినట్లుగానే ఈ ఏడాది కూడా వాతావరణం అననుకూలంగానే మారుతుంది. భారీ వర్షాల కారణంగా పత్తి పంట ఎర్ర బారింది. పల్లపు భూముల్లో సాగు చేసిన పత్తి గడ్డి వేసిందని తొలగించడం తప్ప మరో మార్గం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే పెట్టాల్సినంత పెట్టుబడి పెట్టామని తీరా ఇప్పుడు వర్షాలు తీవ్ర ఇబ్బందులు పెడుతున్నాయన్నారు. పత్తి రైతులకు కష్టాలు, నష్టాలు మిగిలే సూచనలే కనిపిస్తున్నాయి. భారీ వర్షాలకు జాలిముడి ప్రాజెక్టుకు గండి పడింది. కుడి కాలువ పరిధిలోని బ్రాహ్మణపల్లి, కలకోట గ్రామాల మధ్య గండిపడి నీరు వృథాగా పోతుంది. దీనితో జాలిముడి ప్రాజెక్టు కుడి కాలువ పరిధిలో నీటి సరఫరాకు అంతరాయం కలిగింది. పలు చోట్ల వాగులు పొంగిపొర్లడంతో గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొణిజర్ల మండలం అంజనాపురం వద్ద ఏరు ఉధృతంగా రోడ్డుపై ప్రవహించడంతో ఆ మార్గంలో రాకపోకలను నిలిపి వేశారు. బోనకల్, ఖమ్మం ప్రధాన రహదారిలో రామకృష్ణాపురం వాగు ఉప్పొంగడంతో ప్రధాన రహదారిపైకి నీరు చేరింది. దీనితో అధికారులు రాకపోకలను నిలిపి వేశారు.
సత్తుపల్లి, చంద్రుగొండ తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి. కొణిజర్ల మండలంలోనూ తనికెళ్ల గ్రామం నుంచి గణేశ్వరం, తుమ్మలపల్లి, బోడియతండా, రామనర్సయ్య నగర్ తదితర గ్రామాలకు వెళ్లే రహదారిపై వర్షపు నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రఘునాథపాలెం మండల పరిధిలోని విఆర్ బంజర వద్ద బుగ్గవాగు పొంగి ప్రవహించడంతో పాపటపల్లి, విఆర్‌బంజర గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. డోర్నకల్ నుంచి ఖమ్మం వచ్చే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పాల్వంచ, శ్రీనివాస్ నగర్ ప్రాంతంలో రోడ్డుపైకి నీరు చేరడంతో రాకపోకలను నిలిపివేశారు. అశ్వారావుపేటలో నివాస ప్రాంతాల్లోకి నీరు చేరింది.
**వ్యాధులు ప్రబలుతాయన్న ఆందోళనలో ప్రజలు :**
భారీ వర్షాల మూలంగా సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే గ్రామాల్లో జ్వర పీడితుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతుంది. గుండాల మండలంలో ఓ బాలిక డెంగీ బారీన పడి మృతి చెందగా కొణిజర్ల మండలంలో ఇప్పటికే రెండు మరణాలు చోటు చేసుకున్నాయి. కూచిపూడి హరిత, స్వాతి మరణించగా పలువురు డెంగీ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రతియేటా సీజనల్ వ్యాధులతో ఆసుపత్రుల బారీన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని జ్వరపీడిత గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తపరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలని మందులను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.




## మహిళల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా చర్యలు

### అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ

**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** మహిళల అభ్యున్నతికి ప్రణాళికాబద్ధంగా తగు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ తెలిపారు. కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఇందిరా మహిళా శక్తిపై సోమవారం సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ, కొత్త సొసైటీ సంఘాల ఏర్పాటు, బ్యాంక్ లింకేజీ రుణాలు, ఏకరూప దుస్తుల కుట్టు పనులు, ఎర్రుపాలెం కల్లూరులో సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు, పెట్రోల్ బంక్ ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అక్షరాస్యత పెంచేదిశగా పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించని మహిళలను గుర్తించి తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీలో నమోదు చేయాలని ఏపిఎంల వారీగా లక్ష్యాలను కేటాయించారు. ప్రతి మండల పరిధిలో సమావేశం నిర్వహించుకుని ప్రణాళిక ప్రకారం అడ్మిషన్లు నమోదు చేయాలన్నారు. జిల్లా సమైక్యల సమావేశం రెగ్యులర్‌గా నిర్వహించాలన్నారు. జిల్లాలో మహిళా సంఘాల ద్వారా పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అర్బన్ ప్రాంతంలో అనువైన స్థలాలను ఎంపిక చేయాలన్నారు. సత్తుపల్లి పట్టణంలో ఎంపిక చేసిన స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు పనులు ప్రారంభించాలన్నారు. నిర్దేశిత లక్ష్యం ప్రకారం నూతన స్వశక్తి మహిళా సంఘాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. బ్యాంక్ లింకేజీ రుణాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డివో సన్యాసయ్య, డిపిఎం, ఎపిఎంలు సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### అదనపు కలెక్టర్లు



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు డా. పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు పి. శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలు పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మాట్లాడుతూ ప్రజావాణి దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలన్నారు. కల్లూరు మండలం చంద్రుపట్లకు చెందిన పి.కావ్య కల్లూరు సాంఘిక సంక్షేమ గురుకులంలో ఏడవ తరగతిలో సీటు ఇప్పించాలని దరఖాస్తు చేశారు. సింగరేణి మండలం విశ్వనాథపల్లి గ్రామ పంచాయతీ లింగంబంజర గ్రామస్తులు గ్రామంలో గతం నుంచి ఉన్న రోడ్డును ట్రాక్టర్ ద్వారా దున్ని చెడగొట్టిన వారిపై చర్యలు తీసుకుని రోడ్డును తిరిగి నిర్మించాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం పార్శీబంధంకు చెందిన షేక్ ఆసియా తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని దరఖాస్తు చేశారు. ఖమ్మం అర్బన్ మండలం వెలుగుమట్లకు చెందిన జి. సత్యనారాయణ పుట్టకోట చెరువు 50 ఎకరాలు ఆక్రమణకు గురైందని ఆక్రమణదారులపై చర్యలు తీసుకుని, చెరువు సుందరీకరణ, ఆధునీకరణ చేపట్టాలని దరఖాస్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఆర్వో ఎ. పద్మశ్రీ, జెడ్పిసిఈవో దీక్షారైనా, డిఆర్‌డివో సన్యాసయ్య, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హామీలు అమలు కాకపోతే ఉద్యమ కార్యాచరణ

### కలెక్టరేట్ ఎదుట జెఎసి ఆధ్వర్యంలో పెన్షన్ విద్రోహ దినం



**ప్రజాపక్షం/ఖమ్మం :** ఉద్యోగులు, పెన్షన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే ఉద్యమ కార్యాచరణ తప్పదని జెఎసి నేతలు హెచ్చరించారు. సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ పద్ధతిని అమలు చేయాలని డిమాండ్ చేశారు. జెఎసి పిలుపు మేరకు సోమవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట విద్రోహ దినం పేరుతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వివిధ సంఘాల నేతలు మాట్లాడుతూ కొత్త పెన్షన్ విధానం వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని ప్రభుత్వం వెంటనే ఈ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. హామీలను అమలు చేయకపోతే జేఏసి నేతృత్వంలో కార్యాచరణ రూపొందించుకుని ఆందోళనను మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఆందోళనను ఉద్దేశించి టిజిఈజెఏసి ఛైర్మన్ గుంటుపల్లి శ్రీనివాసరావు, టిజివోస్ కార్యదర్శి మోదుగు వేలాద్రి, రెవెన్యూ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు తుంబూరు సునీల్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఉద్యోగుల సంఘం నాయకులు మల్లెల రవీంద్ర ప్రసాద్, రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయల రవి కుమార్, వివిధ సంఘాల నేతలు కళ్యాణం కృష్ణయ్య, సుబ్బయ్య, ఫణిరాజ్, కళ్యాణం నాగేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు, గోపిచంద్, కె. శ్రీనివాస్, జైపాల్, గంగవరపు బాలకృష్ణ, విజయ్‌కుమార్, శేషప్రసాద్, మనోహర్‌రాజ్, వెంగళరావు, హుస్సేనయ్య, వెంకన్న, లలితాకుమారి తదితరులు పాల్గొన్నారు.

# రీల్



## 'మదరాసి' ప్రీ రిలీజ్

శివకార్తికేయన్ యాక్షన్ ఎంటర్టైనర్ 'మదరాసి', ఎ.ఆర్. మురుగదాస్ దర్శకత్వంలో శ్రీలక్ష్మీ మూవీస్ నిర్మించిన ఈ ప్రతిష్టాత్మక వెంచర్ ఇప్పటికే టీజర్, ట్రైలర్, రెండు చార్ట్‌బస్టర్ సింగిల్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. ఈ చిత్రం సెప్టెంబర్ 5న థియేటర్ల లోకి రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ గ్రాండ్ ప్రీరిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా హీరో శివకార్తికేయన్ మాట్లాడుతూ ఈ సినిమాలో లవ్ యాక్షన్ రెండు పిల్లర్స్. అందులో లవ్ పోర్షన్ అద్భుతంగా రావడానికి కారణం తనే. ఈ సినిమాలో మరో పిల్లర్ విలన్ విద్యుత్ జమ్వాల్. ఆయనతో యాక్షన్ సీక్వెన్స్ చాలా క్రేజీగా ఉంటాయి. అందరూ సెప్టెంబర్ 5 థియేటర్స్‌కి వెళ్లి మద్రాసి చూడండి.




## నేడు 'ఉస్తాద్ భగత్ సింగ్' పోస్టర్ విడుదల

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. 'గబ్బర్ సింగ్' వంటి సంచలన విజయం తరువాత పవన్ కళ్యాణ్ హరీష్ శంకర్ కలయికలో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అంచనాలు భారీగానే ఉన్నాయి. పుట్టినరోజు (సెప్టెంబర్ 2) సందర్భంగా తాజాగా ఈ చిత్రం నుండి ప్రత్యేక పోస్టర్‌ను విడుదల చేశారు. త్రీ పీస్ సూట్, టోపీతో పూర్తిగా నల్లటి దుస్తులు ధరించి పవన్ కళ్యాణ్ చాలా అందంగా కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ పోస్టర్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.



## అంగరంగ వైభవంగా 'గామా' అవార్డ్స్

దుబాయ్‌లో అంగరంగ వైభవంగా జరిగింది. ఈ వేడుకలో టాలీవుడ్ పరిశ్రమ నుంచి సినీ ప్రముఖులు హాజరై సందడి చేశారు. గామా అవార్డ్స్ చైర్మన్ కేసరి త్రిమూర్తులు, సీఈఓ సౌరభ్ కేసరి ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా అత్యంత వైభవంగా ఈ అవార్డుల కార్యక్రమం ఘనంగా జరిగింది. గామా అవార్డ్స్ 2025 జ్యూరీ చైర్ పర్సన్స్ ప్రముఖ సినీ దర్శకులు ఏ.కోదండ రామిరెడ్డి, ప్రముఖ సంగీత దర్శకులు కోటి, ప్రముఖ సినీ దర్శకులు బి.గోపాల్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు ఎంపిక అయిన టాలీవుడ్ కళాకారులకు, సినిమాలకు గామా అవార్డ్స్ బహుకరించారు. ప్రముఖ హాస్య నటులు బ్రహ్మానందం స్పెషల్ అవార్డును అందుకున్నారు. వీరితోపాటు లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డును నిర్మాత అశ్వినీ దత్ అందుకున్నారు. హీరో సత్యదేవ్ హీరోయిన్ కూడా స్పెషల్ అవార్డును అందుకున్నారు.






## 12న తెలుగులో 'టన్నెల్' విడుదల

కోలీవుడ్ హీరో అథర్వా మరోసారి తనకు కలిసి వచ్చిన యాక్షన్‌ప్యాక్డ్ థ్రిల్లర్ జానర్‌లో 'టన్నెల్' అనే మూవీని చేశారు. రవీంద్ర మాధవ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో లావణ్య త్రిపాఠి కథానాయికగా నటించారు. అశ్విన్ కాకుమాను విలన్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం సెప్టెంబర్ 12న థియేటర్లలోకి రానుంది. ఈ మూవీని తెలుగులోకి ఎ.రాజు నాయక్ లచ్చురామ్ ప్రొడక్షన్స్ ద్వారా విడుదల చేస్తున్నారు. ఇప్పటికే తమిళనాడులో ఈ ట్రైలర్ సెన్సేషన్‌గా మారింది.

## అక్టోబర్ 16న మిత్ర మండలి విడుదల



ప్రముఖ నిర్మాత బన్నీ వాస్ స్థాపించిన నిర్మాణ సంస్థ బి.వి. వరక్స్ సమర్పణలో సప్త అశ్వ మీడియా వర్క్స్, వైరా ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న 'మిత్ర మండలి' చిత్రం హాస్యం, రహస్యం, యవ్వన శక్తి మిశ్రమంగా ప్రేక్షకులకు అపరిమిత వినోదాన్ని అందించడానికి సిద్ధమవుతోంది. నూతన దర్శకుడు విజయేందర్ ఎస్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ప్రియదర్శి, నిహారిక ఎన్.ఎం., విష్ణు ఓయ్, రాగ్ మయూర్, ప్రసాద్ బెహరా ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. వీరు వెండితెరపై నవ్వుల టపాసులు పేల్చబోతున్నారు. అక్టోబర్ 16న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. నిర్మాతలు కళ్యాణ్ మంతిన, భాను ప్రతాప, డా. విజయేందర్ రెడ్డి తీగల నిర్మిస్తున్న ఈ చిత్రానికి సహ నిర్మాతగా సోమరాజు పెన్మెత్స వ్యవహరిస్తున్నారు.

## 'నేను రెడీ' షూటింగ్ షురూ



హీరో హవీష్, డైరెక్టర్ త్రినాధరావు నక్కిన క్రేజీ కాంబినేషన్‌లో రూపొందుతున్న అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ 'నేను రెడీ'. కావ్య థాపర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రాన్ని హార్నిక్స్ ఇండియా ఎల్ఎల్‌పి బ్యానర్‌పై నిఖిల కోనేరు నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. రామోజీ ఫిల్మ్ సిటీలో కీలక టాకీ పార్ట్ షూటింగ్ షెడ్యూల్ ప్రారంభమైయింది. హీరోతో పాటు ప్రధాన నటీనటులపై ముఖ్యమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. నేను రెడీ కోసం త్రినాధరావు నక్కిన తన మార్క్‌లో అవుట్ అండ్ అవుట్ ఎంటర్ టైనర్ స్క్రిప్ట్‌ని రెడీ చేశారు. ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో బ్రహ్మానందం, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, వీటి గణేషన్, అజయ్, మురళి గౌడ్ గోపరాజు లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు.

## ఈ సినిమా బాగుంటుంది : బన్నీవాస్



'90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ మౌళి తనుజ్, 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు' మూవీతో గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరోయిన్ శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటిస్తున్న మూవీ 'లిటిల్ హార్ట్స్'. ఈ చిత్రాన్ని ఈటీవీ విన్ ఒరిజినల్ ప్రొడక్షన్ బ్యానర్‌పై దర్శకుడు సాయి మార్తాండ రూపొందించారు. '90s మిడిల్ క్లాస్ బయోపిక్' ఫేమ్ డైరెక్టర్ ఆదిత్య హాసన్ 'లిటిల్ హార్ట్స్' మూవీకి నిర్మాతగా వ్యవహరించారు. ఈ సినిమాను నిర్మాతలు బన్నీ వాస్, వంశీ నందిపాటి థియేట్రికల్ గా రిలీజ్ చేస్తున్నారు. 'లిటిల్ హార్ట్స్' సినిమా సెప్టెంబర్ 5న థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది. సోమవారం బన్నీ వాస్, వంశీ నందిపాటి మీడియాతో మాట్లాడారు. ప్రొడ్యూసర్, డిస్ట్రిబ్యూటర్ బన్నీ వాస్ మాట్లాడుతూ ఈ మూవీ బాగుందని వంశీ నందిపాటి చెప్పాడు. ఆ తర్వాత ఆదిత్య హాసన్ వచ్చి మూవీ గురించి వివరించాడు.

## హాలీవుడ్ కొలాబరేషన్‌లో 'ది ప్యారడైజ్'

నేచురల్ స్టార్ నాని మోస్ట్ ఎవైటెడ్ గ్లోబల్ యాక్షనర్ 'ది ప్యారడైజ్'లో ఇంతకు ముందు ఎన్నడూ చేయని ఇంటెన్స్, ఫియర్లెస్ క్యారెక్టర్ చేస్తున్నారు. దసరా ఫేమ్ శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్ ఎల్‌వి సినిమాస్ బ్యానర్‌పై నిర్మాత సుధాకర్ చెరుకూరి అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ నిర్మిస్తున్నారు. 'ది ప్యారడైజ్'ను గ్లోబల్ సినిమా విజన్‌తో చాలా గ్రాండ్ స్కేల్‌లో రూపొందిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వచ్చిన ఫస్ట్ గ్లింప్స్‌తో మేకర్స్ యూనివర్సల్ విజన్ అందరికీ అర్థమైయింది. మల్టీ లాంగ్వేజ్ రిలీజ్, బోల్డ్ ప్రమోషన్స్ అన్నీ గ్లోబల్ మూవీ దిశగానే సాగుతున్నాయి. లేటెస్ట్ అప్డేట్ ఏమిటంటే.. ది ప్యారడైస్ టీం హాలీవుడ్‌లోని #కనెక్ట్ మొబ్ సెన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ క్రియేటివ్ కంటెంట్ అలెగ్జాండ్రా విస్కోంటినితో కలసి సినిమా కోసం కొలాబరేషన్ అవుతున్నారు. ఈ సినిమా 2026 మార్చిలో వరల్డ్ రిలీజ్‌కి రెడీ అవుతుంది



## బిల్లులు ఆమోదించండి

(మొదటి పేజీ తరువాయి)

పెంపుకు అడ్డంకిని తొలగించిన ఈ బిల్లులను ఆమోదించాలని ప్రతినిధి బృందం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను కోరింది. రిజర్వేషన్ల పెంపునకు అడ్డంకిగా ఉన్న చట్ట సవరణ బిల్లులను ఆమోదిస్తే,బిసి రిజర్వేషన్లను పెంచుకునేందుకు అవకాశం ఉంటుందని, సభ ఏకగ్రీవంగా ఆమోదించిన బిల్లులను సాధ్యమైనంత త్వరగా ఆమోదించాలని వారు గవర్నర్‌ను విజ్ఞప్తి చేశారు.

### బిజెపి,ఎంఐఎం గైర్హాజరు

బిసి రిజర్వేషన్ల అమలులో భాగంగా శాసనసభ ఆమోదించిన బిల్లులను ఆమోదించాలని అఖిలపక్షం గవర్నర్‌ను కలిసి విజ్ఞప్తి చేయాలని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శాసనసభలో కోరారు. ఈ మేరకు ఆయన అన్ని రాజకీయ పార్టీల శాసనసభాపక్ష నాయకులకు లేఖ కూడా రాశారు. అయితే గవర్నర్‌ను కలిసేందుకు ఎంఐఎం, బిజెపి నుంచి ఎవ్వరూ హాజరుకాలేదు.

### బిసి రిజర్వేషన్లకు సానుకూలంగా స్పందించండి: మహేష్‌కుమార్ గౌడ్

టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ స్థానిక సంస్థలలో రిజర్వేషన్లకు 50 శాతం సీలింగ్ ఉండడంతో బిసిలకు అన్యాయం జరుగుతుందని, తద్వారా వారి రిజర్వేషన్లను పెంచుకునే వెసులుబాటు లేకుండా పోయిందన్నారు. రాష్ట్రంలో 56.33 శాతం బిసిలు ఉన్నట్టు ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో వెల్లడైందని, అందుకే బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, బిసి సంఘాలు, మేథావులు కూడా రిజర్వేషన్లను పెంచాలని కోరుతున్నారని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో గవర్నర్ సానుకూలంగా స్పందించాలని కోరారు.

### ఇక బిసిల ఆవేశాన్ని ఆపడం సాధ్యం కాదు: నారాయణ

డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ బిసి రిజర్వేషన్ల విషయంలో ఇప్పటికే చాలా ఆలస్యం జరిగిందిన, ఇప్పటికైనా బిల్లులను ఆమోదిస్తే, బిసిలకు న్యాయం జరుగుతుందని అన్నారు. బిసి రిజర్వేషన్ల పెంపు అంశంలో పెద్ద ఎత్తున డిమాండ్ ఉన్నదని, బిసిల ఆవేశాన్ని ఆపడం ఇక సాధ్యం కాదని సూచించారు.

### బిజెపి కుంటిసాకులతో అడ్డుకోవద్దు : నెల్లికంటి సత్యం

నెల్లికంటి సత్యం మాట్లాడుతూ సామాజిక ఉద్యమాలు బలపడుతున్నాయని, బిసిలకు దక్కాల్సిన వాటాను ఇవ్వాలని, రిజర్వేషన్లను పెంచాలని సూచించారు. ఇప్పటికైనా బిసి రిజర్వేషన్లకు సంబంధించిన బిల్లులను, 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్‌ను ఎత్తివేసే చట్ట సవరణ బిల్లును గవర్నర్ ఆమోదించాలని కోరారు. బిసి రిజర్వేషన్ల అమలుకు శాసనసభలో మద్దతు ప్రకటించిన బిజెపి, రాజ్‌భవన్‌లోని గవర్నర్‌ను కలిసేందుకు మాత్రం రాలేదని మండిపడ్డారు. బిసి రిజర్వేషన్లను కుంటిసాకులతో అడ్డుకోవద్దన్నారు.

### సిఎం పోరాటం ద్వారానే రిజర్వేషన్లు సాధ్యం: కె.పి.వివేకానంద

కె.పి.వివేకానంద మాట్లాడుతూ బిల్లులను గవర్నర్ ఆమోదించినప్పటికీ బిసి రిజర్వేషన్ల విషయంలో న్యాయపరమైన చిక్కులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. 9వ షెడ్యూల్‌లో పొందుపర్చడం ద్వారానే బిసి రిజర్వేషన్లకు రక్షణ ఉంటుందన్నారు. ఇందుకు సిఎం రేవంత్ రెడ్డి చిత్తశుద్ధితో ఢిల్లీలో పోరాటం చేయాలన్నారు. తమపైన నెపం పెట్టి చేతులు దులుపుకుంటే కుదరబోదన్నారు

## ఎన్నికల ప్రక్రియ

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. రాజకీయాలతో సంబంధాలు ఉన్న లేకపోయినా ఓటు వేసే ప్రతి ఒక్కరికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో సంబంధం ఉన్నట్లేనన్నారు. తాను ఏ పార్టీ అభ్యర్థిని కాదని, తనకు ఏ పార్టీలో సభ్యత్వం లేదని, భవిష్యత్‌లో కూడా ఏ పార్టీలో సభ్యున్ని కాబోనని, రాజ్యాంగాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత గల పౌరుడిగా మాత్రమే తాను కేవలం ప్రతిపక్ష పార్టీల అభ్యర్థిగా ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నానని ఆయన వెల్లడించారు. రాజకీయాలకు అతీతంగా తనకు ఓటు వేసి గెలిపించాలని అన్ని పార్టీల ఎంపిలకు తాను విజ్ఞప్తి చేస్తూ లేఖలు రాయనున్నట్లు వెల్లడించారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి పోటీలో ఉన్న తన ప్రత్యర్థి మధ్య చర్చలు, సంభాషణలు జరిగి ఉంటే ఈ దేశ ప్రజలకు ఎవరూ ఏమిటి అనేది తెలిసి ఉండేదని, కానీ తనకు ఆ అవకాశం లేకుండా పోయిందన్నారు. గతంలో ఎన్నికల సంఘానికి ఉన్న అధికారాలు ఏమిటి? పలానా అధికారం వారికి లేదని, మరీ ఎలా నిర్వహిస్తున్నారన్న ప్రశ్న వచ్చినప్పుడు ప్రపంచ న్యాయ కోవిదులైన జస్టిస్ కృష్ణఅయ్యర్ 'రిజర్వాయర్ ఆఫ్ పవర్' అని వ్యాఖ్యానించారన్నారు. రిజర్వాయర్ ఆఫ్ పవర్' అంటే ఎన్నికలను పారదర్శకంగా అత్యంత జవాబుదారితనంగా నిర్వహించేందుకు చట్టంలో లేని, రాజ్యాంగంలో లేని అధికారాన్ని వినియోగించుకునేందుకు మాత్రమేనతప్ప తమ ఇష్టానుసారంగా చట్టవిరుద్ధంగా వినియోగించుకునేందుకు కాదని గుర్తు ంచుకోవాలన్నారు.

### 53ఏళ్ల న్యాయశాస్త్రంతో పెనవేసుకున్న పేగుబంధంలోని అంతర్భాగంగానే ఉపరాష్ట్రపతిగా పోటీ

తాను 53 ఏళ్లుగా న్యాయవ్యవస్థతో పెనవేసుకున్న పేగు బంధమని, ఆ అంతర్ ప్రయాణంలో భాగంగానే ఉపరాష్ట్రపతిగా పోటీ చేస్తున్నానని జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఉపరాష్ట్రపతి పదవి అనేది రాజకీయ పదవి కాదని, ఇది రాజ్యాంగబద్ద పదవి అని, ఇప్పటికే 6 సార్లకు పైగా రాజ్యాంగానికి విధేయుడిగా ఉంటానని ప్రమాణం చేశానని, కానీ ఉపరాష్ట్రపతిగా అవకాశం లభిస్తే రాజ్యాంగాన్ని పరిరక్షిస్తానని ప్రమాణం చేస్తానన్నారు. కొందరు తాను ఇచ్చిన తీర్పుల గురించి మాట్లాడారని, తనకంటే ముందు, తన తర్వాత 11 మంది న్యాయమూర్తులు ఆ కేసును విచారించారని, ఆ తీర్పు తనది కాదని, సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు అని, తాను కేవలం ఆ బాధ్యతను మాత్రమే నిర్వర్తించానని ఆయన స్పష్టం చేశారు. ఆ తీర్పులో తాన ఏ ఒక్కరిని సమర్థించినట్లుగా ఉంటే శిరస్సు వంచి నమస్కరిస్తానని, సుప్రీంకోర్టు తీర్పులను పూర్తిగా చదివిన తర్వాతే మాట్లాడితే బాగుంటుందని హితువు పలికారు. తన తీర్పుపై దేశ వ్యాప్తంగా చర్చ ప్రారంభం కావడాన్ని తాను స్వాగతిస్తున్నానని, ఆలాంటి వ్యాఖ్యలతో తాను భయపడి ఎన్నికల్లో పోటీ చేయకుండా తప్పుకుంటానని భావించారని, కానీ ఏలాంటి సవాల్‌నైనా ఎదుర్కొనేందుకు సిద్దంగా ఉన్నట్లు జస్టిస్ సుదర్శన్‌రెడ్డి స్పష్టం చేశారు.

### తెలుగు వ్యక్తికి మద్దతు ఇవ్వండి : సిఎం

'ప్రస్తుతం జరుగుతున్న ఉపరాష్ట్రపతి ఎన్నికకు అంత్యంత ప్రాధాన్యత ఉంది. రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఎజెండాతో ఎన్‌డిఏ అభ్యర్థిని పెట్టింది. రాజ్యాంగాన్ని పరిరక్షించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలనే ఉద్దేశంతో ఇండియా కూటమి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని బరిలోకి దింపింది. ఎన్నికలు, రాజకీయాలు, వివాదాలపై ఎప్పుడైనా మాట్లాడుకోవచ్చు. కానీ తెలుగు వ్యక్తికి ఇప్పుడొక అవకాశం వచ్చింది. ఎపి సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, మాజీ సిఎంలు కెసిఆర్, జగన్, ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీలకు విజ్ఞప్తి చేస్తున్నా. రాజకీయంగా ఉన్న భిన్నాభిప్రాయాలను పక్కనపెట్టి జస్టిస్ సుదర్శన్ రెడ్డికి మద్దతు ఇవ్వాలి' అని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఎంపిలతో జస్టిస్ సుదర్శన్ రెడ్డి సమావేశం హైదరాబాద్‌లో సోమవారం జరిగింది. సి సందర్భంగా జరిగిన మీడియా సమావేశంలో సిఎం మాట్లాడారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్ రెడ్డిని పార్టీలు, రాజకీయాలకు అతీతంగా ప్రకటించామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇండియా కూటమి ఆలోచనను జస్టిస్ సుదర్శన్ రెడ్డి గౌరవించారని అన్నారు. అందరూ ఒక తాటిపైకి వచ్చి తెలుగు వారందరూ సుదర్శన్ రెడ్డికి అండగా నిలబడాలని నిర్ణయించామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన 42మంది ఎంపిలు, 18 మంది రాజ్యసభ సభ్యులు ఆత్మప్రభోదానుసారం ఓటు వేయాలని వ్యక్తిగతంగా విజ్ఞప్తి చేస్తున్నానని సిఎం చెప్పారు. సుదర్శన్ రెడ్డి పోటీ వల్ల ఎన్‌డిఏ కూటమికి ఇండియా కూటమి గట్టి పోటీ ఇస్తోందన్నారు. నీలం సంజీవరెడ్డి, వివిగిరి, పి.వి.నరసింహరావు, జైపాల్ రెడ్డి, వెంకయ్య నాయుడు, ఎన్‌టి రామారావు వంటి తెలుగు నేతలు గతంలో జాతీయ స్థాయిలో కీలక పాత్ర పోషించారని, నేడు తెలుగు నాయకులు జాతీయ రాజకీయాల్లో అంత కీలకంగా లేరని పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో తెలుగు భాష రెండో స్థానంలో ఉన్నప్పుడు తెలుగువారు కూడా ఆ స్థాయిలో ఉండాలని, జస్టిస్ సుదర్శన్‌రెడ్డి గెలిస్తే తెలుగు వారి ప్రతిష్ట పెరుగుతుందన్నారు. ఉప రాష్ట్రపతి రాజీనామా చేయడం ఆశ్చర్యకరమని, ఆయన రాజీనామాను దేశప్రజలు గమనిస్తున్నారన్నారు. దేశంలో 18 ఏళ్లకు ఓటు హక్కు ఇచ్చిన రాజీవ్ గాంధీ ఆలోచన ఒక వైపు, ఓట్ చోర్ ఆలోచనతో మరో పార్టీ ఇంకో వైపు దేశంలో ఉన్నాయని, పెద్దల సభ రాజ్యసభ చైర్మన్ సీటులో గౌరవమైన వ్యక్తులు, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విధానాలపై సంపూర్ణ విశ్వాసం ఉన్నవారు కూర్చుంటే పూర్తి న్యాయం జరుగుతుందన్నారు. రాజ్యాంగాన్ని రక్షించే పార్టీలో ఆయన మొదటి సభ్యత్వం తీసుకున్నారని, రాజ్యాంగాన్ని రక్షించడమే ఆయన పార్టీ అన్నారు. ఎజెండా, జెండా లేకుండా జస్టిస్ సుదర్శన్ రెడ్డికి అంతా మద్దతు ఇవ్వాలన్నారు. రాజ్యాంగాన్ని రక్షి స్తే దేశాన్ని రక్షించినట్లేనని, లేకుంటే దేశానికి నష్టం జరుగుతుందన్నారు. జస్టిస్ సుదర్శన్ రెడ్డిని ఒక జాతీయ నాయకుడు నక్సలైట్ అని అంటున్నారని సిఎం గుర్తు చేస్తూ 'నక్సలిజం ఒక విధానం మాత్రమే. నక్సలిజం ఫిలాసఫీ నచ్చవచ్చు లేదా నచ్చకపోవచ్చు. మనకు నచ్చని ఫిలాసఫీతో వాదించి గెలవాలి. కానీ అంతం చేస్తానంటే కుదరదు' అని సిఎం రేవంత్‌రెడ్డి అన్నారు.

### రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని పరిరక్షించేందుకు సుదర్శన్ రెడ్డిని గెలిపించండి

రాజ్యాంగాన్ని ప్రజా స్వామ్యాన్ని, లౌకికతత్వాన్ని పరిరక్షించి కోవాలంటే ఉపరాష్ట్రపతిగా జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గెలుపించుకోవాలని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ కోరారు. తెలంగాణ ఉద్యమం పునాదులను పటిష్టం చేసేందుకు ఏనలేని కృషి చేసిన తెలంగాణ బిడ్డ అయిన జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి పార్టీలకు అతీతంగా ఎంపిలందరూ ఓటు చేసి గెలిపించాలన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికలో రాజ్యాంగ పరిరక్షణే ధ్యేయంగా రాజకీయాలకు అతీతంగా జస్టిస్ సుభాష్‌రెడ్డి పోటీ చేస్తున్నారని, విధానాలపై జరుగుతున్న ఈ ఎన్నికలో రాజ్యాంగ భక్షకుల వైపు ఉంటారా, రాజ్యాంగ పరిరక్షకుల వైపు ఉంటారా అనేది ఎంపిలు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. దేశంలో రాజ్యాంగాన్ని మార్చి మనువాదాన్ని ముందుకు తీసుకురావాలనే కేంద్రంలోని అధికారంలో ఉన్న బిజెపి చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా రాజ్యాంగం కల్పించిన హక్కుల పరిరక్షణ కోసం ఉపరాష్ట్రపతి ఎన్నికలు ప్రధాన అంశంగా ఉండనుందని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ తెలిపారు. ఈ తరుణంలో జస్టిస్ సుదర్శన్‌రెడ్డి పూర్తిగా రాజ్యాంగ హక్కులను పరిరక్షించే ప్రతినిధిగా భావించి ఆయనను ప్రతిపక్ష పార్టీలన్నీ అభ్యర్థిగా నిలబెట్టాయన్నారు. దేశంలో రాజ్యాంగంలో పేర్కొనబడిన అంశాలను, ప్రాథమిక హక్కులను కాపాడుకోవాలని భావించే శక్తులన్నీ జస్టిస్ సుదర్శన్ రెడ్డిని గలిపించాలన్నారు.

## తప్పక ఉండాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

అడ్మిషన్లకు అనుమతిస్తూ తెలంగాణ ప్రభుత్వం విధించిన నివాస నిబంధనలను అత్యున్నత న్యాయస్థానం సమర్థించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్ ధర్మాసనం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌ను అనుమతించింది. 2024 లో సవరించిన తెలంణ మెడికల్, డెంటల్ కాలేజీల అడ్మీషన్ ( ఎంబిబిఎస్, బిడిఎస్‌లోకి అడ్మీషన్) రూల్స్ 2017ను 2024లో సవరించడాన్ని సమర్థించింది. ఈ నిబంధనలు రాష్ట్రంలో గత నాలుగు సంవత్సరాలుగా 12వ తరగతి వరకు చదువుకున్న విద్యార్థులకు మాత్రమే రాష్ట్ర కోటా కింద వైద్య కళాశాలలు, దంత కళాశాలల్లో ప్రవేశం కల్పించాయి.తెలంగాణ హైకోర్టు తీర్పు ప్రకారం.. రాష్ట్ర శాశ్వత నివాసితులు కొంతకాలం రాష్ట్రం వెలుపల నివసించిన కారణంగా వారికి మెడికల్ కాలేజీల్లో ప్రవేశ ప్రయోజనాలను తిరస్కరించలేరని స్పష్టంచేసింది. రాష్ట్రంలోని వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించిన నివాస నియమాన్ని రద్దు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌తో సహా దాఖలైన పిటిషన్‌లపై ఆగస్టు 5న సుప్రీంకోర్టు తన తీర్పును రిజర్వ్‌చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ, న్యాయవాది శ్రవణ్‌కుమార్ కర్ణం తమ వాదనలను వినిపించారు. వివరణాత్మక (డీటైల్డ్) తీర్పు రావాల్సి ఉంది.

## జిహెచ్‌ఎంసి వార్డుల పునర్విభజన విధానం చెప్పండి

### ప్రభుత్వానికి హైకోర్టు నోటీసు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జిహెచ్‌ఎంసి పరిధిలో వార్డుల పునర్విభజన ప్రక్రియపై వివరణ ఇవ్వాలని తెలంగాణ హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ సలీమ్, మరొకరు దాఖలు చేసిన పిటిషన్‌పై సోమవారం విచారణ జరిగింది. ప్రధాన న్యాయమూర్తి అపరేశ్ కుమార్ సింగ్, న్యాయమూర్తి జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. 1996లో జారీ చేసిన జిఓ 570 ప్రకారం జనాభా ఆధారంగా వార్డుల పునర్విభజన జరగాల్సి ఉందని పిటిషనర్ న్యాయవాది బర్కత్ అలీ ఖాన్ వాదించారు. ప్రస్తుతం అమలులో ఉన్న వార్డు విభజన విధానం రాజ్యాంగం ఆర్టికల్ 243S, డిలిమిటేషన్ చట్టంలోని సెక్షన్ 8లకు వ్యతిరేకమన్నారు. తెలంగాణ మున్సిపాలిటీల చట్టంలోని సెక్షన్ 6లో జనాభా స్థానంలో ఓటర్ల సంఖ్య అని ఉండటం చెల్లదన్నారు. ఢిల్లీ, ఎంపీ, అరుణాచల్ ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాల్లో మున్సిపల్ చట్టాల ప్రకారం జనాభా ఆధారంగా వార్డుల పునర్విభజన ఉంటుందన్నారు. ఇక్కడ మాత్రం అందుకు వ్యతిరేకంగా ఉందన్నారు. జిహెచ్‌ఎంసిలో మొత్తం 150 వార్డులు ఉన్నాయని, వాటిలో 117 వార్డులు అశాస్త్రీయంగా ఉన్నాయని చెప్పారు. కొన్ని వార్డుల్లో 78 వేల ఓటర్లు ఉండగా, మరికొన్నింటిలో 28 వేలే ఉన్నాయన్నారు. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయడానికి మూడు వారాల గడువు కోరింది. అందుకు హైకోర్టు అనుమతిచ్చింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

## అవినీతి మరక

(మొదటి పేజీ తరువాయి)

చేస్తున్నారని మండిపడ్డారు. కెసిఆర్‌పైన సిబిఐ విచారణ చేసే పరిస్థితి వచ్చిందంటే ఇక ఆ పార్టీ ఉంటే ఎంత? లేకపోతే ఎంత ? అని అసంతృప్తి వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని జాగృతి కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ తనపైన హరీష్ రావు,సంతోష్ రావు ఎన్ని కుట్రలు చేసినా భరించానని, కానీ కెసిఆర్‌పైన అవినీతి ఆరోపణలు వస్తుంటే మాత్రం తాను తట్టుకోలేకపోతున్నానని భావోద్వేగానికి గురయ్యారు. తన వెనకాల బిజెపి, కాంగ్రెస్ ఉన్నదని సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తనది కెసిఆర్ బ్లడ్ ఉన్నదని, తాను ఇండిపెండెంట్‌గా ఉంటానని, తాను ఎవరో ఆడిస్తే ఆడే ఆటబొమ్మను కాదని, ఇక నుంచి తనపై సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తే 'మీ తోలు' తీస్తానని కవిత హెచ్చరించారు. కెసిఆర్ పక్కన ఉన్నవారి వల్లనే ఆయనకు అవినీతి మరక వచ్చిందని, ఈ విషయాన్ని బిఆర్‌ఎస్ శ్రేణులు ఆలోచించాలన్నారు. కాళేశ్వరం అవినీతిలో హరీశ్ రావు పాత్ర లేదా ?, వారి స్వార్థం కోసమే అవినీతికి పాల్పడ్డారని, అందుకే రెండవ సారి అధికారంలోకి వచ్చిన తర్వాత హరీశ్‌రావును నీటి పారుదల శాఖ నుంచి తప్పించారన్నారు. ఇటీవల ఎసిబి అధికారులు అరెస్ట్ చేసిన నీటి పారుదల శాఖకు చెందిన అధికారులను విచారిస్తే, వారి వెనకాల ఎవరు ఉంటారో తేలుతుందన్నారు. హరీష్ రావు,సంతోష్ రావు వెనకాల సిఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, వారి మధ్య ఒప్పందాలు కూడా ఉన్నాయని, అందుకే కెసిఆర్‌ను టార్గెట్ చేస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా తాను నేరుగా పేర్లను వెల్లడించానని, వారిపై విచారణ చేపట్టాలన్నారు. సిబిఐ విచారణలో కెసిఆర్ కడిగినముత్యంలా బయటకు వస్తారన్నారు. బీహార్ ఎన్నికల కోసం తెలంగాణ బిసిలను బలి చేస్తున్నారని ఆరోపించారు. బిసి రిజర్వేషన్ల కోసం కెసిఆర్ ఎందుకు వెళ్లడం లేదని కవిత ప్రశ్నించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Plot No 302, Venkata Sai Towers, Nehrunagar, KHAMMAM 507 002 Telangana State. RNI TELTEL /2018/76759, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com